ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
18-2-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 18 పేజీలు: 10+4 వెల: 6.50

నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురు దెబ్బ 2లో

బంగ్లా కొత్త ప్రధానిగా తారిక్ రెహ్మాన్ ప్రమాణం 5లో



## విశాఖలో రాష్ట్రపతి

ఘన స్వాగతం పలికిన గవర్నర్ నజీర్, డిసిఎం పవన్ 2లో

## ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్

**విజయవాడ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులకు ఎల్లవేళలా అండగా నిలుస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఆక్వా రైతులకు ఒకే రకమైన విద్యుత్ సబ్సిడీ అమలుపై అసెంబ్లీలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు బంధించి జోన్ – నాన్ జోన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ఫిషరీస్ శాఖ సమగ్రంగా నిర్వ హించిందని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. ఏపీఈఆర్సీ ఆదేశాల ప్రకారం ఆక్వాకల్చర్‌కు యూనిట్‌కు రూ. 3.85 వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆక్వా రైతుల



### జోన్-నాన్‌జోన్ విధానం అమలు
### పారదర్శకంగా లబ్ధిదారుల గుర్తింపు
### అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమగ్ర సమాధానం ఇచ్చారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆక్వాకల్చర్‌కు విద్యుత్ సబ్సిడీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఆక్వాకు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రూ. 2.35 సబ్సిడీ భారం భరిస్తూ యూనిట్‌ను కేవలం రూ. 1.50కే అందిస్తున్నదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో నోటిఫైడ్ ఆక్వాకల్చర్ జోన్ పేరుతో కేవలం పది ఎకరాలకే పరిమితం >>2




మంగళవారం ముంబయిలోని లోక్‌భవన్‌లో భేటీ అయిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, ప్రధాని మోడీ

## ఫ్రాన్స్, భారత్ మధ్య 'రాఫెల్' బంధం

### 114 రాఫెల్, హామర్ క్షిపణుల కొనుగోలుపై కుదిరిన ఒప్పందం
### రక్షణ, వాణిజ్యం, ఆరోగ్యం సహా 12 రంగాల్లో ఎంఒయులు
### ముంబైలోని లోక్‌భవన్‌లో ఫ్రెంచ్ అధ్యక్షుడు మెక్రాన్-ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

**ముంబై, ఫిబ్రవరి 17:** భారత్– ఫ్రాన్స్ బంధాన్ని ప్రపంచ స్థిరత్వానికి శక్తిగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. ఈ భాగస్వామ్యం సాంప్రదాయ దౌత్యానికి మించి 'ప్రజల భాగస్వామ్యం'గా పరిణామం చెందిందని పేర్కొన్నారు. భారత్– ఫ్రాన్స్ భాగస్వామ్యం శాంతికి 'విశ్వసనీయ లంగరు' అని నొక్కి చెప్పారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఫ్రాన్స్‌ను 'అనివార్య భాగస్వామి'గా వ్యాఖ్యానించారు. భారత్– ఫ్రాన్స్ అవిష్కరణ సంవత్సరం 2026 రోడ్ మ్యాప్‌లో కేంద్ర బిందువు అని అన్నారు. 'ఆవిష్కరణ ఒంటరిగా జరగదు, సహకారం ద్వారా జరుగుతుంది. స్వచ్ఛమైన శక్తి, డిజిటల్ ఆరోగ్యంలో ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి >>2



## సెలెబ్రిటీలైనా.. జనంలో స్వేచ్ఛగా!

| జాగింగ్ చేశారు | ఆటో ఎక్కారు |
|---|---|
| ముంబయిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ | బెంగళూరులో అమెరికా రాయబారి సెర్గియో |

**ముంబై/బెంగళూరు, ఫిబ్రవరి 17:** వాళ్లిద్దరూ ప్రపంచ దేశాలకు సుపరిచరితులు. ఒకరు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, మరొకరు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్. ఇద్దరూ భారత్‌లో సామాన్య పౌరుల్లా నగరవాసులతో కలిసిపోయారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మంగళవారం ఉదయం ముంబై విమానాశ్రయంలో దిగగానే, హోటల్‌కు చేరుకుని దుస్తులు మార్చుకున్నాడు. బూడిద రంగు టీషర్టు, నల్ల షార్ట్స్ ధరించి హోటల్ నుంచి బయటకు వచ్చి మెరైన్ డ్రైవ్‌లో జాగింగ్ చేశాడు. మెక్రాన్‌తోడుగా భద్రతా సిబ్బందివస్తున్నా, >>2





## సిద్ధార్థ రెడ్డి 4 వారాల్లో లొంగిపోవాలి

### సినీనటి ప్రత్యూష మృతికేసులో 'సుప్రీం' సంచలన తీర్పు
### నిందితుడి పిటిషన్ డిస్మిస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి హయాంలో సంచలనం రేపిన అప్పటి యువ నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీం కోర్టు మంగళవార సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రత్యూష మృతిపై ఆరోపణలు ఎదుర్కొం టున్న ఆమెను ప్రేమించిన సిద్దార్థ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం ధర్మా సనం డిస్మిస్ చేయడంతో పాటు దీనిపై గతంలో హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించింది. ఈ కేసులో సిద్దార్థ రెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం చింది. 2002 ఫిబ్రవరి 23వ తేదీన ప్రత్యూషతో పాటు ఆమెను ప్రేమించిన సిద్దార్థ రెడ్డి పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్ తాగి ఆత్మహత్యకు యత్నించడం అప్పట్లో సంచలనం రేపడం తెలి సిందే. హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో నిర్జనప్రాంతంలో వీరిద్దరు ఆత్మహత్యకు యత్నించగా సమీపంలోని బస్తీ ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. ఇంటర్ చదువుతున్న సమయంలోనే వీరిద్దరు ప్రేమించుకోగా ఇంటర్ పూర్తయ్యాక ప్రత్యూష సినీ రంగంలో వెళ్లింది. సిద్దార్థ రెడ్డి ఇంజనీరింగ్‌లో చేరాడు. అయితే పెళ్లి విషయంలో అభిప్రాయ బేధాలు రావడంతో వీరిద్దరు ఆత్మహత్యకు యత్నించారని పోలీసులు తెలిపారు. అయితే ఆసుపత్రిలో చేరిన మరుసటి రోజు ప్రత్యూష మర ణించగా రెండు వారాల తరువాత సిద్దార్థ రెడ్డి కోలుకున్నాడు. వీరిద్దరు తాగిన కూల్ డ్రింక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు దానిని ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపగా అందులో ఆర్గానో ఫాస్పేట్ అనే పురుగుల మందు ఉన్నట్లు తేలింది. దీని కారణంగానే ప్రత్యూష మరణించిందని, సకాలంలో వైద్యం అందడంతో సిద్దార్థరెడ్డి కోలుకున్నట్లు ప్రత్యూష మరణంపై నిజాలు వెలికితీసేందుకు >>2

## కొత్తగా 10 ఎంజెపి స్కూళ్లు

**విజయవాడ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో త్వరలో బీసీ హాస్టళ్లలో 1,291 మంది పారిశుధ్య సిబ్బంది, 142 మంది కుక్ కమాటీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకులాలను స్థాపించబోతున్నామని, ఆరు గురుకులా పాఠశాలలను జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేట్ చేయబోతున్నామన్నారు. బీసీలను పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆదరణ 1.0, ఆదరణ 2.0 పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేశారని, త్వరలో ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుట్టబోతున్నారని వెల్లడించారు. బీసీలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్త అనే పాలసీ ద్వారా బీసీలకు ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

### 6బిసి గురుకులాలు జూ.కళాశాలలుగా అప్‌గ్రేడ్
### జిల్లా కేంద్రాల్లో బిసి భవనాల నిర్మాణం: అసెంబ్లీలో మంత్రి సవిత



పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దనున్నామని, ఇందులో భాగంగా ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో వారికి అవకాశమివ్వనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల కాలంలో డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో సముద్రంలో చేపల వేట ఉపశమన పథకం, తల్లికి వందనం, దీపం2, ఆటో డ్రైవర్ సేవలో, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా ఫించన్ల కింద 1,59,99,934 మంది బీసీ లబ్ధిదారులకు రూ.31,331.25 కోట్లు అందించామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సీహెచ్. వంశీకృష్ణ ప్రశ్నకు మంత్రి సవిత స్పందించారు. అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు రెండు కళ్లలాంటి వారన్నారు. బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. 2014 19లోనూ, ప్రస్తుతం బీసీలను అన్ని విధాలా ఆదుకోడానికి ఎన్నో సంక్షేమ

**త్వరలో 10 ఎంజెపి గురుకులాల స్థాపన:** 1,100 బీసీ సంక్షేమ హాస్టళ్లలో 84,446 మంది విద్యార్థులకు వసతి, 109 ఎంజేపీ గురుకులా పాఠశాలల్లో 39,832 మందికి వసతితో పాటు విద్యా బోధన చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. పీఎంయశ్వసీ పథకం కింద 3,05,840 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరేలా రూ.145 కోట్లు విడుదల చేశామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు హాస్టళ్లు, గురుకులాల్లో యూపీఎస్ లు, ఆర్వో ప్లాంట్లు, దోమ తెరలు, వంటగది పాత్రలు వంటి సౌకర్యాలు అందించడానికి రూ.69.33 కోట్లు మంజూరు చేశామన్నారు. హాస్టళ్లలో 1,291 మంది పారిశుధ్య సిబ్బందిని, 142 మంది అదనపు వంటవారిని, కామాటీ పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నామన్నారు. రూ.160.60 కోట్లతో ఎంజేపీ గురుకులపాఠశాలల్లో నిర్మాణాలు, మరమ్మతులు >>2



మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్

## దేశంలో నిజమైన హీరోలు వైద్యులే

### సమాజం వారిని దేవునిలా భావిస్తుంది: ఎయిమ్స్ స్నాతకోత్సవంలో మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** సంపద లేదా హోదా వల్ల కాకుండా, జీవితానికి మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందించడం వల్లే వైద్యులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. లాభాపేక్షతో కాకుం డా మానవత్వంతో సేవలందించాలని, రోగుల నమ్మకాన్ని కూడా తమ విధి నిర్వహణలో భాగం గా మార్చుకోవాలని ఆయన యువవైద్యులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఆల్ >>2



నిందితుడు కులవర్ధన్ (ఫైల్)

## 'మగవాంఛ'కు చిన్నారి బలి

### డ్రమ్ములో బందీ అయిన పసి ప్రాణం
### నేతన్న ఇంట్లో తీరని విషాదం
### అదృశ్యమైన రిషికప్రియ దారుణ హత్య
### కన్నీటి పర్యంతమైన మదనపల్లి

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఆ ఇల్లు నిన్నటి వరకు చిన్నారి రిషిక ప్రియ కిలకిల రావాలతో కళకళలాడేది. తండ్రి గోపీనాథ్ తిరుమల కాటేజ్ లో హౌస్ కీపింగ్ పనిచేసుకుంటూ అందులోని తన కూతురి భవిష్యత్తును వెతుక్కునేవాడు. కానీ, ఒక్క సోమవారం సాయంత్రం ఆ కుటుంబంలో చీకటిని నింపింది. 'బొరుగులు ఇస్తా రామ్మా' అన్న ఆ పిలుపు ఒక పసి ప్రాణాన్ని బలి తీసుకుంటుందని ఎవరు ఊహించలేదు. తెలిసినవాడే కదా అని ఆ చిన్నారి వెళ్తే, అదే ఆమెకు ఆఖరి ప్రయాణం అయింది. ఆడుకుంటూ కనిపించకుండా పోయిన తన బిడ్డ కోసం ఆ తల్లిదండ్రులు రాత్రంతా పడ్డ ఆవేదన వర్ణనాతీతం. పోలీసులు వెతుకుతున్నంత సేపు నా బిడ్డ ఎక్కడో ఒకచోట సురక్షితంగానే ఉంటుంది అని వారు పెట్టుకున్న ఆశలు, చివరకు ఆ ప్లాస్టిక్ డ్రమ్ములో విగతజీవిగా పడి ఉన్న కూతుర్ని చూశాక ముక్కలైపోయాయి. మృతదేహాన్ని గుర్తించిన సమయంలో అక్కడి దృశ్యాలు చూపరులను కలచివేశాయి. తన ప్రాణ సమానమైన కూతురు రక్తపు మడుగులో, నిర్జీవంగా పడి ఉండటం చూసి ఆ తల్లి వేసిన ఆర్తనాదాలు ఆ వీధినంతా >>2

## చట్టసభలను చూడండి..



మంగళవారం విద్యార్థులతో అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకరు అయ్యన్న, డిప్యూటీ స్పీకరు రఘురామ

### విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు
### అసెంబ్లీ కార్యక్రమాలను వీక్షించేందుకు బస్సుల్లో తరలివచ్చిన విద్యార్థులు

**విజయవాడ,ఫిబ్రవరి17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభా స్పీకరు అయ్యన్న పాత్రుడు ఒక వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ప్రజాస్వా మిక వ్యవస్థలో చట్టసభల పాత్రను ప్రత్యక్షంగా చూసేందుకు పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పించారు. భావి భారత పౌరులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఏపీ శాసనసభ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం ఒక్కరోజే 300 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించి సభా కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇందు కోసం వారు భీమవరం, ఉండి నుంచి ప్రత్యేకంగా బస్సుల్లో తరలివచ్చారు. గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపు 1100 మంది విద్యార్థులు భాగమయ్యారు. ప్రజా సమస్యలపై చర్చలు, చట్టాల రూపకల్పన విధానం, బడ్జెట్ ఆమోద ప్రక్రియ వంటి అంశాలను వారు ఆసక్తిగా గమనించారు. అనంతరం స్పీకరు అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకరు కనుమూరు రఘురామకృష్ణంరాజు ను వారు కలుసుకున్నారు. అసెంబ్లీలో ఓటింగ్ ఎలా జరుగుతుంది? బడ్జెట్‌లో ఏ అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది? అంటూ పాఠశాల విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఓపిగ్గా, సరళంగా సమాధానాలు ఇచ్చారు. సరదా ప్రశ్నలతో కూడిన విద్యార్థుల జిజ్ఞాస ఆయన్ను అమితంగా ఆకట్టుకుంది. ఓటింగ్ ఎలా జరుగుతుంది? స్పీకర్‌ను అడిగి తెలుసుకున్న విద్యార్థులు. సభా విరామ సమయంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు >>2



మంగళవారం సిబిఎస్ఇ పరీక్షలకు హాజరైన టెన్త్ విద్యార్థులు

# దేశంలో నిజమైన హీరోలు వైద్యులే

>> ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ప్రతి ఆసుపత్రి ఆవరణలో ఆందోళన, భయం, బాధ ఉంటాయి. అత్యవసర వార్డులోకి వచ్చే రోగి మీ కళ్లలోకి ఎంతో ఆశగా చూస్తారు. వారు మీ నుంచి కేవలం మందులనే కాదు, నమ్మకాన్ని, భరోసాను ఆశిస్తారు. మీరు ఇచ్చేది కేవలం ప్రిస్క్రిప్షన్ కాదు, వారిలో చిగురింపజేసే ఆశ. కోవిడ్19 సమయంలో ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైతే, ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు సేవలందించారు. అందుకే సమాజం మిమ్మల్ని దేవుడి తర్వాత అంతటి వారిగా చూస్తుంది" అని అన్నారు. ఈ స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక కాదని, విద్యార్థులుగా ప్రవేశించి జీవన సంరక్షకులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న పరివర్తన అని లోకేశ్ అభివర్ణించారు. "ప్రాంతీయ అసమతుల్యతలను సరిదిద్దే జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ఎయిమ్స్ భావించబడుతోంది. 2015లో ఈ సామాన్యంగా ప్రారంభమైన మంగళగిరి ఎయిమ్స్, నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులతో 1,300 మందికి పైగా విద్యార్థులతో ఒక సమగ్ర సంస్థగా ఎదిగింది. కొన్ని పడకల నుంచి నేడు దాదాపు 650 పడకలకు విస్తరించింది. ఓపెన్‌హార్ట్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి, రోబోటిక్ మోకాళ్ల మార్పిడి వంటి అధునాతన సేవలను అందిస్తోంది. ఈ సంస్థ బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. వీటికి నమ్మకం అనే నాలుగో స్తంభాన్ని కూడా మీరు జోడించాలి" అని ఆయన సూచించారు.

ఇప్పటివరకు 45 లక్షలకు పైగా ల్యాబ్, డయాగ్నస్టిక్ సేవలు అందించడం సంస్థ విస్తరిస్తున్న ఆశలకు ప్రతీక అని కొనియాడారు. యువ వైద్యులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "మీరే ఈ దేశపు నిజమైన హీరోలు. సాంకేతికత ఎంత మారినా, కృత్రిమ మేధస్సు (ఏఐ) మీ నైపుణ్యానికి సహాయపడినా.. వైద్యుడి స్పర్శలోని స్వస్థత శక్తికి సాటిలేదు. ఒక్కసారి మందుల కన్నా మీరిచ్చే భరోసాయే రోగాన్ని నయం చేస్తుంది. డబ్బు చెల్లించలేని రోగిని ఎలా చూస్తారు, నిరక్షరాస్యులకు ఎలా వివరిస్తారనే దానిపైనే మీ మానవత్వం ఆధారపడి ఉంటుంది" అని అన్నారు. వైద్యులకు వినయం గొప్ప లక్షణమని, గిరిజన ప్రాంతాలను సందర్శించి అక్కడి ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. మీరు అందుకున్న పట్టా వైద్య విద్య పూర్తి చేసిన సర్టిఫికేట్ మాత్రమే కాదు, నిరంతరం నేర్చుకోవడానికి పొందిన లైసెన్స్. డాక్టర్ నేర్చుకోవడం ఆపివేసిన క్షణమే, రోగులు ఇబ్బంది పడతారు. లాభాపేక్షతో మందులు సూచించవద్దు, సౌకర్యం కోసం రాజీ పడవద్దు. మీ వృత్తి మీ హృదయంలోని మానవత్వాన్ని ప్రతిబింబించాలి. ఓటమిని విజయానికి సోపానంగా భావించి, కష్టాలను అధిగమించాలి. తెల్ల కోటు ధరించినప్పుడు దాని గౌరవాన్ని నిలబెడుతూ, రోగులపై ప్రేమతో ముందుకు సాగాలి" అని మంత్రి లోకేశ్ ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ డాక్టర్ తపన్ కుమార్ సాహో, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అంతం శాంత సింగ్, అధ్యాపకులు, పట్టభద్రులైన వైద్యులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ

### విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసు

**విజయవాడ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ కిడ్నాప్ కేసుకు సంబంధించి మోహన్ బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. క్వాష్ పిటిషన్‌పై విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేసింది. ఫోన్‌కాల్స్‌తో పాటు మెసేజ్‌లను విశ్లేషించి ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నివేదిక అందజేయాల్సి ఉందని హైకోర్టు పేర్కొంది.ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసింది. ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని మోహన్ బాబు తరుపు న్యాయవాది చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టి వేసింది. వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామని మార్చి 3వ తేదీకి క్వాష్ పిటిషన్‌ను వాయిదా వేసింది. ఇటీవల మోహన్ బాబు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించేందుకు బయల్దేరిన విద్యార్థి సంఘం నాయకులు కిడ్నాప్‌నకు గురయ్యారు. దీనిపై సహచర విద్యార్థి సంఘం నాయకులు తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్ ప్రత్యేక బృందాలు వెంటనే రంగంలోకి దిగి.. నారావారిపల్లి సమీపంలోని భీమవరం వద్ద కిడ్నాపర్ల వాహనాన్ని అడ్డుకున్నాయి. కిడ్నాప్‌నకు గురైన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు విడిపించారు. కిడ్నాపర్లను అరెస్ట్ చేశారు. కిడ్నాప్‌నకు పాల్పడిన వారంతా మోహన్ బాబు కాలేజీ బౌన్సర్లుగా పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మోహన్ బాబుపై కేసు నమోదైంది.

## చట్టసభలను చూడండి..

>> గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పత్తిపాటి పుల్లారావు, బొండా ఉమామహేశ్వరరావు విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఉన్నత లక్ష్యాలతో చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడితో విద్యార్థులు ఫొటోలు దిగారు. చట్టసభ వాతావరణాన్ని ప్రత్యక్షంగా చూడటం తమకు స్ఫూర్తినిచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భీమవరం కాకతీయ పాఠశాల విద్యార్దులు మాట్లాడుతూ తాము అసెంబ్లీకి వెళ్లినప్పుడు స్పీకర్, ఎమ్మెల్యేలు ఉన్నారు.

## విశాఖలో రాష్ట్రపతి

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** విశాఖ జిల్లాలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐ.ఎఫ్.ఆర్.)కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం మధ్యాహ్నం వాయుమార్గం ద్వారా ఢిల్లీ నుండి భారతీయ వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో విశాఖనేవల్ ఎయిర్ స్టేషన్, ఐ ఎన్ఎస్ డేగా కు చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్య మంత్రి కె.పవన్ కళ్యాణ్, జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, పార్లమెంటు సభ్యులు యం.శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్‌కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తూర్పు నావికాదళ అధికారులు ఐఎన్ఎస్ డేగాలో భారత రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు.

## ఆక్వా రైతులకు రూ. 1.50కే విద్యుత్

>> చేశారని మంత్రి గొట్టిపాటి అసెంబ్లీ వేదికగా సభ్యులకు వివరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిమితులను సవరించి రైతులకు అనుకూల నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే 50 వేల అదనపు ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ప్రస్తుతరాష్ట్రంలో 5లక్షల 21వేల మంది ఆక్వా రైతులు యూనిట్‌కు రూ. 1.50 చెల్లిస్తూ సబ్సిడీ ప్రయోజనం పొందుతున్నారని మంత్రి తెలిపారు.ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడిఉందని ఆయనస్పష్టం చేశారు.

**విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు:** విద్యుత్ ప్రమాదాల నివారణకు ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ప్రతి జిల్లాకు రూ. 1 కోటి చొప్పున నిధులు మంజూరు చేసినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇళ్లకు సమీపంగా, ఇళ్ల పై మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాలపై శాసనసభలో నెలిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అడిగిన ప్రశ్నకు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. విద్యుత్ పంపిణీ లైన్లు అన్ని నియమ నిబంధనల ప్రకారమే వేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలి పారు. అయితే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసిన తర్వాత, వాటి కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం వల్లే భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని స్పష్టం చేశారు. అవగాహన లోపం, లైన్ల కింద నిర్మాణాలే ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.

గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి శాసన సభలో వివరించారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు లేదా స్తంభాలు ఎక్కడైనా గుర్తిస్తే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. లైన్లు లేదా స్తంభాల మార్పిడికి సంబంధీకులు దరఖాస్తు చేస్తే, పరిశీలించి మార్పులు చేపడతామని మంత్రి తెలిపారు. విజయనగరం జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎంపీ నిధుల ద్వారా విద్యుత్ లైన్ల మార్పిడి చేపట్టినట్లు వెల్లడించారు. ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదని, విద్యుత్ ప్రమాదాల నియంత్రణ పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి స్పష్టం చేశారు. రైతులు పామాయిల్ తోటల్లో కోత కోసే సమయంలో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటూ, వాటి నివారణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇకపై విద్యుత్ లైన్ల కింద ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీ, మున్సిపల్ శాఖలు అనుమతులు ఇవ్వకూడదని సూచించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పునరుద్ఘాటించారు.



మదనపల్లిలో రోదిస్తున్న రిషికప్రియ కుటుంబ సభ్యులు



నిందితుడి ఇంటి వద్ద గుమికూడిన జనం

# 'మగవాంఛ'కు చిన్నారి బలి

>> కన్నీరు పెట్టించాయి. కుమార్తె కోసం ఆమె అల్లాడిపోతున్న తీరు స్థానికులను సైతం కదిలించింది. ఈ వార్త తెలియగానే మదనపల్లి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిందితుడు ఎంతటి వాడైనా కఠినంగా శిక్షించాలనే డిమాండ్ ఒక్క కుటుంబం నుంచే కాదు, ప్రతి తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది. నిందితుడు కులవర్ధన్ చేసిన ఈ ఘాతుకం మదనపల్లి చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది. ఆ కామాంధుడు చిన్నారిని ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అంతటితో ఆగకుండా హత్య చేసి ఇంట్లోనే ఉన్న నీళ్ల డ్రమ్ములో దాచి పెట్టేసాడు. ఈ విషాదకర సంఘటన మంగళవారం మదనపల్లెలో వెలుగుచుడటంతో తీవ్ర కలకలం రేపింది. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, కాట్లాటపల్లె రోడ్డు, సిమెంట్ వీధిలో గోపినాథ్, స్వర్ణలత దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల బాలిక రుషిక ప్రియ స్థానిక ప్రైవేట్ పాఠశాల రెండో తరగతి చదువుతున్నది. కోళ్లబైలు కు చెందిన లేట్ హరి, ఆంజలమ్మల, కుమా రుడు కులవర్ధన్ (27) సిమెంట్ రోడ్డులోనే రుషికప్రియ ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్నాడు. కుల వర్ధన్ తల్లి ఆంజలమ్మ వెంకటేశ్వరపురం పాఠశాలలో ఆయాగా పని చేస్తుండగా, కులవర్ధన్ చెడు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం సాయంత్రం గంజాయి మత్తులో ఉన్న కులవర్ధన్, ఇంటి ముందు ఆడుకుంటున్న రిషికప్రియ బొరుగులు ఇస్తానురా అంటూ ఇంట్లోకి పిలుచుకొనిపోయాడు. కులవర్ధన్ ఉంటున్న ఇంటికి వేర్వేరుగా రెండు గదులు ఉండడంతో ఒక గదిలోకి పాప ను తీసుకెళ్లాడు. పాపపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసి ఇంటిలోని డ్రమ్ములో కుక్కి పెట్టేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. రాత్రి 8 గంటలు దాటినా పాప కనబడక పోవడంతో తల్లిదండ్రులు గోపినాథ్, స్వర్ణలత కంగారు పడ్డారు. చుట్టు పక్కల గాలించినా ఎక్కడా కనబడక పోవడంతో స్థానిక ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించి సీఐ మహ్మద్ రఫీ కి ఫిర్యాదు చేశారు. ఎదురింటిలో ఉన్న కులవర్ధన్ రాత్రి పాపతో మాట్లాడు తుండటం తాను గమనించానని పాప తాత నరసింహులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కులవర్ధన్ కోసం ఇంటికి వెళ్లగా గది లోపల గడియ పెట్టుకుని బయటకు రాకుండా ఉండడంతో తలుపు గడియలు పగలకొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో పరిశీలించి చూడగా పాప రిషిక శవమై డ్రమ్ములో ఉండటం చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నా కులవర్ధన్ ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. రిషిక ప్రియ హత్య ఉదంతం తెలియడంతో క్షణాల వ్యవధిలో వందల సంఖ్యలో జనం హంతకుని ఇంటి వద్దకు చేరిపోయి గుమిగూడారు. పోలీసులు నిందితున్ని స్టేషన్‌కు తరలించారు. బాలిక మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నం చేయడంతో అప్పటికే వేల సంఖ్యలో గుమికూడిన జనం తిరగుబాటు చేశారు. బాలిక మృతదేహాన్ని తరలించేందుకు ససేమిరా ఒప్పుకోలేదు. కులవర్ధన్‌ను మాకు అప్పగిస్తేనే బాలిక మృతదేహాన్ని అప్పగిస్తామని బాలిక బంధువులు హంతకుని ఇంటి ముందుబైఠాయించారు. రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్, వన్ టౌన్ సీఐ మహ్మద్ రఫీ, టూటౌన్ సీఐ రాజారెడ్డి, స్థానిక నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ధర్నాలతో దద్దరిల్లిన మదనపల్లె రిషికే ప్రియా దారుణ హత్య వార్త తెలుసుకున్న పట్టణంలోని మహిళలు, ప్రజలు, కుల సంఘాలనాయకులు రాజకీయ పార్టీ నాయకులు భారీ ఎత్తున సంఘటన స్థలానికి చేరుకున్నారు. మొదట టమాట మార్కెట్ ఎదురుగా సుమారు గంట సేపకు పైగా ధర్నా నిర్వహించారు. అనంతరం అన్నమయ్య సర్కిల్లో 8 గంటల పాటు రోడ్డుపై బైఠాయించి వాహన రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. బాలికకు న్యాయం జరిగే వరకూ తాము ఇక్కడి నుంచి కదలమంటూ భీష్మంచి కూర్చున్నారు.

మదనపల్లె కలెక్టర్, జిల్లా ఎస్పీ, మద నపల్లి డిఎస్పీలు అందుబాటులో లేకపోవడంతో రాయచోటి డిఎస్పి కృష్ణ మోహన్ బాధితులతో చర్చించారు. అయినా వారు వినకపోవడంతో సమా చారాన్ని ఉన్నతాధికారులకు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడప ఎస్పీ నసకేట్ విశ్వనాథ్ మదనపల్లికి చేరుకొని చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

# మదనపల్లె బాలిక హత్యపై సిఎం చంద్రబాబు తీవ్ర విచారం

## నిందితుడిని వదిలిపెట్టేది లేదని కుటుంబానికి భరోసా

## బాలిక హంతకులను వదిలిపెట్టమన్న మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి 17,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏడేళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఆయన బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లెలో మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఏడేళ్ల బాలిక, చివరకు శవమై తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాలిక మృతదేహాన్ని ఎదురింట్లో గుర్తించారు. ఆ ఇంట్లో నివసించే కులవర్ధన్ అనే వ్యక్తిపై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

### బాలిక దారుణ హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షిస్తాం: హోంమంత్రి అనిత

అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రాంతంలో ఏడేళ్ల బాలిక దారుణ హత్య కేసుకు కారకుడైన వ్యక్తిని కఠినంగా శిక్షి స్తామని ఏపీ హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు. హత్యకు గురైన చిన్నారి తల్లిదండ్రులతో హోంమంత్రి మాట్లాడారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చేస్తుందని హామీ ఇచ్చారు మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. ఘటనపై జిల్లా ఎస్పీతోనూ మాట్లాడారు. కేసును సీరియస్‌గా తీసుకుని నిందితులకు కఠిన శిక్ష పడేలా చేయాలని పోలీసులను ఆదేశించారు.

ఈ కేసులో మరో షాకింగ్ విషయం బయటకు వచ్చింది . బాలికను హత్య చేసే ముందు నిందితుడు ఆమెపై లైంగిక దాడికి కూడా పాల్పడినట్లు పోస్ట్‌మార్టం నివేదికలో తేలిందని రాయలసీమ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. నిందితుడిపై పోక్సో కేసు కూడా నమోదవుతుందని ఆయన వెల్లడించారు.

నిందితుడికి కఠిన శిక్షపడేలా కేసును ముందుకు తీసుకు వెళ్తామన్నారు. పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బాలిక స్వగ్రామానికి తరలించినట్లు వెల్లడించారు.

# సిద్ధార్థ రెడ్డి 4 వారాల్లో లొంగిపోవాలి

>> సర్కారు నియమించిన ము గ్గురు వైద్యుల బృందం వెల్లడించింది. అయితే మరణానికి ముందు ప్రత్యూషపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదని వైద్యులు బృందం స్పష్టం చేసిం ది. అయితే ప్రత్యూష మరణంపై ఆమె తల్లి సరోజ సంచలన ఆరోపణలు చేశారు. తన కూతురును హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, ఈ కేసులో సిద్ధార్థ రెడ్డి దోషిగా ఆమె తెలిపారు. దీనిపై ఆమె ఫిర్యాదు నేపథ్యంలో పంజాగుట్ట పోలీసులు మొదట ఆత్మహత్యగా నమోదైన కేసును ఆ తరువాత హత్య కేసుగా మార్చారు. ఈ కేసును మొదట పంజాగుట్ట పోలీసులు విచారించగా ఆ తరువాత ప్రత్యూష తల్లి ఫిర్యాదు మేరకు సిబిఐ కి బదలాయించారు. ప్రత్యూష మృతికి సంబంధించిన కేసును సిబిఐకి బదలాయించడంతో ఆ విభాగం పోలీసులు విచారణ చేబట్టి కొత్త విషయాలు వెలుగులోకి తెచ్చారు. సిబిఐ విచారణ తరువాత సిద్ధార్థ రెడ్డిపై ఐపిసి 306 (ఆత్మహత్యకు పురిగొల్పడం), 309 (ఆత్మహత్యకు యత్నించడం) సెక్షన్ల కింద సిబిఐ కొత్తగా నాంపల్లి సిబిఐ కోర్టులో ఛార్జిషీట్ దాఖలయ్యింది. దీని ఆధారంగా నాంపల్లి సిబిఐ కోర్టు సిద్ధార్థ రెడ్డికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23వ తేదీన తీర్పు వెలువరించింది. దీనిపై సిద్ధార్థ రెడ్డి హైకోర్టును ఆశ్రయిం చగా కేసు విచారించిన హైకోర్టు సిద్ధార్థ రెడ్డికి జైలు శిక్షను ఐదేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించి 50 వేల రూపాయల జరిమానాను పెంచుతూ 2011 డి సెంబరు 28వ తేదీన తీర్పు చెప్పింది. ఈ తీర్పును ప్రత్యూష తల్లి సరోజ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఇదే సమయంలో హైకోర్టు విధించిన శి క్షను పూర్తిగా రద్దు చేయాలని సిద్ధార్థ రెడ్డి సుప్రీం కోర్టును వేడుకున్నాడు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడి న సుప్రీం ధర్మాసనం గత ఏడాది నవంబరు నెలలో విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్‌లో వుంచింది. దీనిపై మంగళవారం తీర్పును వెలువరిస్తూ ప్రత్యూష మృతి కేసులో సిద్ధార్థ రెడ్డికి హైకోర్టు 2011 డిసెంబరు నెలలో ఖరారు చేసిన తీర్పును సమర్థించింది. ఈ కేసులో సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లో పోలీసుల ఎదుట లొంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కాగా ఈ కేసులో గాంధీ ఆసుపత్రిలో ఆమెకు జరిగిన పోస్టుమార్టం తీరుపై నా సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యూష మృతదేహానికి పోస్టుమార్టం జరిగిన తీరు సరిగ్గా లేదని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

## వారం - వర్జ్యం

18-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, ధనిష్ఠ కార్తె
శు.పాడ్యమి సా.4.54
శతభిష రా.9.13
వర్జ్యం : రా.11.33-12.08
దు. ఉ.11.59-12.46
శుభసమయం : ఉ.6.30-7.30,సా.5.30-6.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

- **మేషం:** ఒకరికి అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం రెండూ చేయకండి విద్యా రంగంలో ఫలితాలు సానుకూలంగానే ఉంటాయి.
- **వృషభం:** కుటుంబ వృద్ధికి సంతాన పురోగతికి దైవానుగ్రహంవల్ల మంచి అవకాశాలు కలిసివస్తాయి. వస్త్రలాభం.
- **మిథునం:** మీ ప్రమేయం, పర్యవేక్షణ నామమాత్రంగా ఉన్న సందర్భాలలో సైతం మీ వాళ్ళనుంచి పురోగతి సాధిస్తారు.
- **కర్కాటకం:** వ్యాపార విషయాలలో భాగస్వాముల నిజాయితీ మీద అతి నమ్మకం నిర్లక్ష్యం వద్దు.వాహనసౌఖ్యం.
- **సింహం:** సంతానానికి సంబంధించిన విషయ వ్యవహారాలు మీ కనుసన్నలలో నడుస్తాయి. ఇది ఎంతో ఊరట కలిగించే పరిణామమే.
- **కన్య :** మీవాళ్ళు ప్రతిభతో తెచ్చుకున్న అవకాశాలను సద్వినియోగ పరచుకోవడానికి మీరు శక్తికిమించి తోడ్పడతారు.
- **తుల :** కీలక విషయాలలో మిత్రులతో ఆలోచించి ముందుకు సాగండి. ఒక అవకాశం వెతుక్కుంటు రాగలదు.
- **వృశ్చికం:** అందరిని కలుపుకుని మంచి పనులు చేస్తారు. రావల్సిన ధనం చేతికి అందదు. ఆరోగ్యం జాగ్రత్త.
- **ధనుస్సు:** నూతన వ్యక్తులతో, పెద్దలతో పరిచయాలు ఏర్పడతాయి. తద్వారా మీరు కొంతమేర లాభపడతారు.
- **మకరం:** కళా, సాహిత్య, క్రీడారంగానికి సంబంధించిన విషయాలు కలిసివస్తాయి. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు.
- **కుంభం:** మీరు చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యముతో ఎదర్కొంటారు. ఋణాలు తీరుతాయి.
- **మీనం:** వృత్తియందు బాధ్యతలు పెరుగుట వలన అధికశ్రమకు లోనవుతారు. కార్యలయములో గౌరవ ప్రతిష్ఠలు పెరుగును.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కొత్తగా 10 ఎంజెపి స్కూళ్లు

>> చేపట్టామన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద హాస్టళ్లలో 971 మరుగుదొడ్లు నిర్మిస్తున్నా మన్నారు. ప్రస్తుతం ఆ పనులన్నీ పురోగతిలో ఉన్నాయన్నారు. ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులకు ట్రాక్ సూట్లు, బూట్లు అందించామన్నారు. కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకులాలను స్థాపించబోతున్నామని, 6 ఎంజేపీ గురుకులాలను జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేట్ చేయబోతున్నామని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు(ఎంటీఎఫ్) కోసం రూ.420.72 కోట్లు, ట్యూషన్ ఫీజు రీయింబర్స్ మెంట్ (ఆర్టీఎఫ్) కోసం రూ.933.76 కోట్లు కేటాయించామన్నారు.

**జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాల నిర్మాణం:** రాష్ట్రంలో 13 బీసీ స్టడీ సర్కిళ్లతో పాటు విజయవాడలోని గొల్లపూడిలో సివిల్ సర్వీసెస్ కోచింగ్ కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశామని మంత్రి సవిత తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా మెగా డీఎస్సీ కోసం 6,364 మందికి ఉచిత శిక్షణ ఇవ్వగా, 281 మంది టీచర్లుగా ఎంపికయ్యారన్నారు. 13ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో బీసీ భవనాలను మంజూరు చేయగా, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో ఆ భవన నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఏలూరు, నెల్లూరు, కర్నూలులో పనులు పురోగతిలో ఉన్నాయని, ఆయా భవనాల నిర్మాణాలకు రూ.18.69 కోట్లు అవసరమై ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లో డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో సముద్రంలో చేపల వేట ఉపశమన పథకం, తల్లికి వందనం, దీపం2, ఆటో డ్రైవర్ సేవలో, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా ఫించన్ల కింద 1,59,99,934 మందికి రూ.31,331.25 కోట్లు అందించామని మంత్రి సవిత తెలిపారు.

# ఫ్రాన్స్, భారత్ మధ్య 'రాఫెల్' బంధం

>> భారతీయ, ఫ్రెంచ్ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇలు, పరిశోధనా కేంద్రాలను అనుసంధానించడం లక్షనయం" అని మోడీ పేర్కొన్నారు. భారత్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ అసెంబ్లీ లైన్ ప్రారంభోత్సవం 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' దార్శనికతకు ప్రధాన ఉదాహరణ అని అన్నారు. హామర్ ప్రెసిషన్‌గైడెడ్ క్షిపణులు, ల్యాండ్‌మార్క్ 114 రాఫెల్ ఫైటర్ జెడ్ ప్రాజెక్టుతో సహా సైనిక హార్డ్‌వేర్ ఉమ్మడి ఉత్పత్తిపై దృష్టి సారించి, హారిజన్ 2047 రోడ్‌మ్యాప్‌ను ఇరు దేశాధినేతలు సమీక్షించారు.ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026తో సమావేశం జరగడంతో గ్లోబల్ సౌత్‌కు సురక్షితమైన, భద్రమైన, ప్రయోజనకరమైన 'సార్వభౌమ ఎఐ'ని అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. మార్సెయిల్ నుండి ముంబైకి భాగస్వామ్యం మారుతున్నట్లు పేర్కొంటూ, ఫ్రాన్స్‌లో వారి మునుపటి చర్చలను ఆయన గుర్తు చేసుకున్నారు, ఈ భాగస్వామ్యం ఇప్పుడు ఆ ఎఐ దార్శనికతలను స్పష్టమైన పారిశ్రామిక ఫలితాలుగా అనువదిస్తోందని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదం, గాజాలోని పరిస్థితిలపై చర్చలు, దౌత్యమార్గాలే పరిష్కారమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు, అంతకు ముందు ముంబైలోని లోక్ భవన్‌లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా 114 రాఫెల్, హామర్ క్షిపణుల కొనుగోలుపై కీలక ఒప్పందం కుదిరింది. అలాగే అనేక ఇతర అంశాలు కూడా చర్చించినట్లు సమాచారం. రక్షణ, వాణిజ్యం, నైపుణ్యాలు, ఆరోగ్యం సహా వివిధ రంగాలలో అనేక ఒప్పందాలు కుదుర్చుకున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. దాదాపు డజను ఒప్పందాలు, ఎంఒయులపై సంతకాలు జరిగినట్లు సమాచారం. ఇద్దరు నాయకులు సంయుక్తంగా భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ సంవత్సరాన్ని ప్రారంభించారు. 2026 సంవత్సరాన్ని రెండు దేశాలలో భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ సంవత్సరంగా జరుపుకుంటోంది. అధికారిక ప్రకటన ప్రకారం, ఇద్దరు నాయకులు భారత్- ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిని సమీక్షించారు. చర్చల అనంతరం కర్ణాటకలోని కోలార్‌లోని వేమగల్ ఇండస్ట్రియల్ ఏరియాలో (బెంగళూరు సమీపంలో) హెచ్125 హెలికాప్టర్ల కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్ (హెచ్ఎఎల్)ను మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది భారతదేశంలో మొట్టమొదటి ప్రైవేట్ రంగ హెలికాప్టర్ తయారీ కేంద్రం, ప్రారంభంలో ఏటా 10 హెచ్125 హెలికాప్టర్లను ఉత్పత్తి చేస్తుంది, ఇది పొరుగు దేశాలలోదేశీయ అవసరాలు, ఎగుమతి మార్కెట్లకు సేవలు అందిస్తుంది. ఈప్లాంట్ ప్రారంభంలో సంవత్సరానికి 10 హెచ్125 హెలికాప్టర్లను ఉత్పత్తి చేస్తుంది, రాబోయే 20 సంవత్సరాలలో 500 యూనిట్ల అంచనా వేసిన డిమాండ్‌ను తీర్చడానికి విస్తరించే అవకాశం ఉంది.

# సెలెబ్రిటీలైనా.. జనంలో స్వేచ్ఛగా!

>> వద్దని వారించాడు. తీరం వెంబడి ముంబై వాసులు అప్పటికే జాగింగ్ చేస్తున్నారు. వారి మధ్యనే సాధారణ పౌరుడిలా జాగింగ్ చేశాడు. ఎవరితను అని కొందరు తమలో తాము మాట్లాడుకున్నారు. ఎలాంటి హంగు, ఆర్భాటంలేకుండా రావడంతో ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. చాలామంది మెక్రాన్ అన్న విషయం గుర్తించలేకపోయారు. ఆయన కూడా వాకర్లకు చేయి ఊపుతూ సామాన్యుడిలానే ముందుకు సాగాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియోలో వైరల్ అయ్యింది.

**ఇక మరొకరు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్:** బెంగళూరులో బిజెపి ఎంపి తేజస్వి సూర్యతో కలిసి ఇందిరానగర్‌లో ఆటోలో విహరించారు. ఓ హోటల్‌లో ఇడ్లీ, మసాలా దోశె తింటూ స్ట్రాంగ్ కాఫీ తాగుతూ ఖుషీఖుషీగా గడిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరుకు అమెరికా రాయబారిని ఘనంగా స్వాగతించామని బిజెపి ఎంపి తేజస్వి సూర్య ఎక్స్‌లో ట్వీట్ చేశాడు. వీడియోను పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బెంగళూరు 700కి పైగా అమెరికన్ కంపెనీలకు ఆతిథ్యం ఇస్తుందని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో దాదాపు 43శాతం వాటాను కలిగి ఉందని ఉందని ఎంపి పేర్కొన్నారు. అదనంగా భారత్‌లోని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో దాదాపు 40శాతం బెంగళూరు నుంచి పనిచేస్తున్నాయని తేజస్వి సూర్య పేర్కొన్నారు. ఇక తేజస్వి సూర్య ఆతిథ్యానికి సెర్గియో గోర్ కూడా ముగ్ధులయ్యారు. చాలా బాగుంది అంటూ ప్రశంసించారు.

## డిజిటల్ అటెండెన్స్ బాగా పనిచేస్తోంది: స్పీకర్ అయ్యన్న

విజయవాడ ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదు.అలాంటి వారికి జీతం కట్‌చేయాలి. ఉద్యోగులు కార్యాలయానికి రాకపోతో వారికి జీతాలు కట్ చేసి చర్యలు తీసుకునేందుకు ఉన్న నిబంధన ఎమ్మెల్యే లకు ఎందుకు వర్తించకూడదు? ఈ అంశాలపై జాతీయ స్థాయిలో చర్చ చేపట్టాలి. ఈ నిబంధన దాదాపు 8దేశాల్లో అమల్లో ఉంది. అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోంది.

# ఎపి సాంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేద్దాం

## - సాంస్కృతిక శాఖపై సమీక్ష సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పిలుపు



విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్ టూరిజం విభాగాలను సమన్వయం చేస్తూ "ఆరెంజ్ ఎకానమీ"ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో శాఖాపరమైన అంశాలపై సాంస్కృతిక శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కవులు, కళాకారులకు అత్యున్నత గౌరవం దక్కుతుంది. సాంస్కృతిక శాఖ 365 రోజులు క్రియాశీలకంగా పని చేస్తూ, కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుంది. ప్రతి వారం దేవాలయాల్లో, హ్యాపీ సండే వంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తామని సాంస్కృతిక శాఖ అధికారులకు హామీ ఇచ్చారు.. కళలను కేవలం ప్రదర్శనలుగా కాకుండా, ఒక సుస్థిర ఆర్థిక వనరుగా మార్చాలని సూచించారు..వచ్చే ఉగాది పురస్కారాల ఎంపికలో ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా, క్షేత్రస్థాయిలో నిజమైన ప్రతిభ ఉన్న కళాకారులను గుర్తించి సత్కరించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి తుది జాబితాను ప్రకటించాలని ఆదేశించారు. అంతకుముందు మంత్రి కందుల దుర్గేష్ ఘంటసాల సంగీత కళాశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించి బోధనా తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జూన్ లేదా జులై మాసాల్లో దీనిపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. 'ఆరెంజ్ రివల్యూషన్' ద్వారా రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలని పిలుపునిచ్చారు. కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణ చేయాలని అధికారులు కోరగా రాష్ట్ర వారసత్వ సంపదైన కూచిపూడి నృత్యాన్ని అట్టడుగు వర్గాలకు చేరవేయడమే లక్ష్యంగా గతంలో అమలు చేసిన 190 మంది కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకాన్ని పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు..2019లో నిలిపివేసిన ఈ పథకం వల్ల వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని, దీన్ని పునరుద్ధరించడం ద్వారా కళాకారులకు ఉపాధి దొరకడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ నృత్య వైభవం ప్రపంచవ్యాప్తం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కళాకారులందరికీ ఐడి కార్డ్స్ ఇవ్వాలని కోరగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. తెలుగు వారి సొంతమైన పద్యనాటకానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఒక కోర్సును రూపొందించాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. ఉగాది నుండి వారంలో మూడు రోజుల పాటు అతిథి ఉపాధ్యాయులతో క్లాసులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నాటక పరిషత్తులకు ప్రత్యేక గ్రాంట్లు కేటాయించే విషయంపై చర్చించారు. రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా బ్రాంచి ఏర్పాటుకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ శేఖవత్ సుముఖత వ్యక్తం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో వారి సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రత్యేకంగా ఖగిరిజన ఉత్సవ్ఖ నిర్వహించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వంలో అంతరించిపోయిన కళలు, సాంస్కృతిక రంగాలకు పునర్ వైభవం కల్పించి, కళాకారులను గౌరవంగా సత్కరించి రాష్ట్ర సాంస్కృతిక రంగానికి పునర్జీవం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అధికారులతో అన్నారు. ఈ సమావేశంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ళమల్లికార్జున రావు, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, జానపద కళల అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, మేనేజర్ శ్రీనివాస్ మరియు ఇతర శాఖాపరమైన సిబ్బంది పాల్గొన్నారు.



## కీర్తి చాటిన కీర్తన

బొబ్బిలి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: బొబ్బిలికి చెందిన విద్యార్థిని కీర్తన దేశవ్యాప్తంగా విడుదలైన జె.ఇ.ఇ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో జిల్లా కీర్తిని చాటి చెప్పింది. బొబ్బిలి పట్టణానికి చెందిన వంజరాపు సాయి కీర్తన 99.77శాతం మార్కులు సాధించి సత్తా చాటింది. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా 470 మార్కులకు గాను 465, పదవ తరగతిలో 600 మార్కులకు గాను 590 సాధించింది. ఈ నేపథ్యంలో గోశాల ప్రిన్సిపాల్ రామారావు, ఐపిఎల్ శాఖ ప్రిన్సిపాల్ నాగభూషణం, డైరెక్టర్ సతీష్, రామయ్యలతో పాటు శ్రీ చైతన్య యాజమాన్యం ప్రతినిధి డాక్టర్ సుష్మా అభినందనలు తెలియజేశారు. అలాగే వంగర ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జి స్వయంగా కీర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

### మద్యం రవాణా అక్రమాలపై

## ఇడి దర్యాప్తులో కీలక విషయాలు

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాత వార్త ప్రతినిధి: ఎపి మద్యం రవాణా అక్రమాలపై ఇడి దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఎపిఎస్ బిసిఎల్ డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం రవాణా కాంట్రాక్టులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగి విచారించిన సిఐడి రూ.400 కోట్ల దోపిడీ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించింది. ఈ వ్యవహారంపై సిఐడి కేసు నమోదు చేసింది. కారుమూరి నాగేశ్వరరావు, కుమారుడు సునీల్, కోడలు కీర్తి, చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ విజయానందరెడ్డి, సామినేని ఉదయ భాను అల్లుడు, ఎపిఎస్‌బిసిఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డి బావమరిది నంసింహారెడ్డి. నిందితుల్లో రాజ్ కెసిరెడ్డి, అనుచరులు బూనేటి చాణక్య, ఈశ్వర్‌లను నిందితులుగా చేర్చింది. ఇందుకు సంబంధించి తాజా పరిణామాల్లో భాగంగా ఇడి దర్యాప్తు చేపట్టింది.

### ఉండవల్లి పంపింగ్ స్కీమ్‌కు

## రూ.595 కోట్లు

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి వరదను పంపింగ్ చేసేందుకు ఉండవల్లి వద్ద ఏర్పాటుచేస్తున్న రెండో పంపింగ్ స్టేషన్‌కు రూ.595 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చారు. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్వే, టెస్టింగ్, నిర్మాణం, నిర్వహణ మొత్తం 15 ఏళ్లకు గానూ ఈ నిధులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అంపావల్లి క్లోరినేషన్ గ్యాస్ లీక్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా

బలిజిపేట (పార్వతీపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: బలిజిపేట మండలం అంపావల్లిలో రక్షిత తాగునీటి పథకం పైలట్ ప్రాజెక్టు పంపుహౌస్ వద్ద క్లోరినేషన్ సిలిండర్ లీక్‌పై మంత్రి అచ్చెన్నాయుడు మన్యం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లోరినేషన్ సిలిండర్ లీక్ కారణంగా ఆరుగురికి అస్వస్థతపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్న మంత్రి ఈ అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించగా అస్వస్థతకు గురైన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రికి అధికారులు వివరించారు.

# శ్రీసిటీలో మరో దిగ్గజ ఎసి కంపెనీ

## క్యారియర్ కొత్త తయారీ యూనిట్‌కి లీజ్ ఒప్పందం



శ్రీసిటీలో పత్రాలు మార్చుకుంటున్న మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: గ్లోబల్ హీటింగ్, వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ (హెచ్‌వీఏసీ) రంగంలో అగ్రగామిగా ఉన్న క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజరేషన్ లిమిటెడ్ సంస్థ శ్రీసిటీలో కొత్త తయారీ కేంద్రం స్థాపనకు లీజ్ డీడ్‌పై సంతకం చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో క్యారియర్ మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సులభతర వ్యాపారం(ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్) మాత్రమే కాకుండా వేగవంతమైన అమలు (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) విధానానికి కట్టుబడి ఉందని తెలిపారు. శ్రీసిటీ హెచ్‌వీఏసీ రంగంలో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, క్యారియర్ పెట్టుబడి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. స్థిరమైన, శక్తి సమర్థ వాణిజ్య సీతలీకరణ పరిష్కారాలకు పెరుగుతున్న డిమాండ్‌ను శ్రీసిటీ ఫ్యాక్టరీ తీర్చడమే కాకుండా స్థానిక ప్రతిభకు అర్థవంతమైన అవకాశాలను కల్పిస్తుంది. ఈ ప్లాంట్ పచ్చదనం ఆధారిత తయారీ విధానాలను అనుసరించి, గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించి, క్యారియర్ సంస్థకు విస్తృత స్థాయిలో తయారీ సామర్థ్యాన్ని అందించి మార్కెట్ దృష్టికి తోడ్పడుతుందని సుందరేశన్ నారాయణన్ అన్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ క్యారియర్ పెట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శనానికి నాయకత్వంలో రాష్ట్ర పారిశ్రామిక వాతావరణంపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరిగి ఆధునిక తయారీ, సుస్థిర ఆవిష్కరణల కేంద్రంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నిర్ణయంతో భారతదేశంలో క్యారియర్ సంస్థ ఉనికి మరింత బలపడనుంది. ఇప్పటికే హర్యానాలో ఉన్న తమ తయారీ కేంద్రానికి తోడుగా ఈ కొత్త యూనిట్ పని చేస్తూ సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా దీర్ఘకాలిక సుస్థిర వృద్ధితో పాటు మార్కెట్‌లో నాయకత్వ స్థానాన్ని మరింత విస్తరించనున్నట్లు క్యారియర్ సంస్థ పేర్కొంది.

### కృష్ణానది వరద పరిరక్షణ పనులకు

## రూ.308.60 కోట్లతో టెండర్లు

### ప్రపంచ బ్యాంక్, ఎడిబి నిధులు కేటాయింపు

### తూర్పు తీరంలో రక్షణ పనులపై ప్రభుత్వం దృష్టి

రాజంపేట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, కృష్ణా నదికి కుడి ఒడ్డున నేరుగా ఉండడంతో భవిష్యత్తులో వరద ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాజధాని కోర్ సిటీ జోన్‌లో దూరం చాలా తక్కువగా ఉండడం, కొత్త రాజధాని ప్రాంతం పరిపాలనా, చట్టపరమైన న్యాయ కేంద్రం కృష్ణ నదికి కుడి ఉన్న నేపథ్యంలో వరద పరిరక్షణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు ఎడిబి నిధులను కేటాయించింది. ఈ ప్రాంతంలోని కుడి ఒడ్డు ప్రాంతం వరదలకు గురయ్యే చదునైన, సారవంతమైన భూమిని కలిగి ఉండడంవల్ల నివాస ప్రాంతాలకు ముప్పు లేకుండా రక్షించడానికి వరద రక్షణ గోడలను నిర్మించేందుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ మంగళవారం 308.60 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో టెండర్లను పిలిచింది. రాజధాని నిర్మాణం పనులు భాగంగా ఈ 1 రహదారి ప్రాంతంలో 37వ ప్యాకేజ్ 104.55 కోట్ల తోను, 38వ ప్యాకేజీ 101.74 కోట్ల తోను, 39వ ప్యాకేజీ 102.31 కోట్లతోనూ ఎడిసిఎల్ టెండర్లు పిలిచింది. టెండర్లు దాఖలు చేసేందుకు మార్చి 11 వరకు గడువు ఇచ్చారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేస్తారు. అనంతరం ఫైనాన్స్ బిడ్ ఓపెన్ చేసి టెండర్లు ఖరారు చేస్తారు.



# విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

## శాసనసభలో ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

సచివాలయం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ప్రతి జిల్లాకు రూ.1కోటి చొప్పున నిదులు మంజూరు చేసినట్లు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇళ్ళకు సమీపంగా, ఇళ్ళపై మీదుగా వెళ్ళే హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాలపై శాసనసభలో నెలిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు. విద్యుత్ పంపిణీ లైన్లు అన్ని నియమ నిబంధలన ప్రకారమే వేస్తున్నామని మంత్రి తెలిపారు. అవగాహన లోపం, లైన్ల కింద నిర్మాణాలే ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. గ్రామాలు పట్టణాల్లో విద్యుత్ శాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మంత్రి శాసనసభలో వివరించారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు లేదా స్తంభాలు ఎక్కడైనా గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. వాటి మార్పిడికి సంబంధీకులు దరఖాస్తు చేస్తే, పరిశీలించి మార్పులు చేపడతామన్నారు. విజయనగరం జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎంపి నిధుల ద్వారా విద్యుత్ లైన్లు మార్పిడి చేపట్టినట్లు తెలిపారు. ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదని, విద్యుత్ ప్రమాదాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి స్పష్టంచేశారు. రైతులు పామాయిల్ తోటల్లో కోత కోసే సమయంలో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటూ వాటి నివారణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇకపై విద్యుత్ లైన్ల కింద ఇళ్ళ నిర్మాణాలకు పంచాయితీ, మున్సిపల్ శాఖలు అనుమతులు ఇవ్వకూడదని సూచించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు.

# తిరుమల సమాచారం



## కపిలేశ్వరుని ఉత్సవాల్లో శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం

తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం త్రిశూల స్నానంతో ముగిసాయి. ఉదయం 6.30 గంటలకు నటరాజస్వామి సూర్యప్రభ వాహనంపై అన్నారావు కూడలి వరకు వెళ్ళి ఆలయానికి చేరుకున్నారు. 9గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగింపునకు చేరుకున్నాయి. రాత్రి 8నుండి 10గంటల వరకు రావణాసుర వాహన సేవతో వాహనసేవలు పరిసమాప్తమయ్యాయి. హరిబ్రహ్మాదులకే లభ్యం గాని పవిత్ర పాదపద్మాలను హృదయ చక్రంలో నిలుపుకొని నిత్యం ధ్యానం చేసిన రాక్షసభక్తుడు రావణుడు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



## శ్రీవారి దర్శనంతో సంతోషం

తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనంతో ఆనందంగా ఉందని యుఎస్ఎ క్రికెట్ టీమ్ విశ్వాసం వెలిబుచ్చింది. మంగళవారం ఉదయం యుఎస్ఎ క్రికెటర్లు మోనాంక్ పటేల్, మిలింద్ కుమార్, సౌరబ్‌నేత్రా వల్కర్‌లు శ్రీవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి ఆశీస్సులుండాలి

తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, రాష్ట్ర ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని పలువురు ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనసమయంలో తెలంగాణా ప్రభుత్వ సలహాదారుడు కెఎస్ శ్రీనివాసరాజు, సంగీత దర్శకుడు కోటి, సినీనటి ఇషారెబ్బ, రుహాణీశర్మ, దర్శకుడు శైలేష్‌కోలను వేర్వేరుగా ఆలయం లోపలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు జడ్జి గోపాలకృష్ణరావు



తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణరావు కుటుంబం మంగళ వారం ఉదయం దర్శించుకుంది. విఐపి బ్రేక్ దర్శన సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుమల లడ్డూ కల్తీపై వైసిపి దొంగ ఏడుపు

- సిగ్గుపడాల్సిందిపోయి ఎదురు దాడి చేస్తున్నారు
- కల్తీ జరిగిందని నాటి టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి అంగీకారం
- హెరిటేజ్‌పై ఆరోపణలు... ఆధారాలు ఎక్కడ?
- హిందూ సాంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదు
- నిజం దాగదు, బాధ్యులపై చర్యలు తప్పవని మండలిలో హెచ్చరించిన మంత్రి అచ్చెన్నాయుడు



సచివాలయం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: శాసన మండలిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైసిపి ఎమ్మెల్సీలపై, ఆ పార్టీ నేతలపై ఆగ్రహంతో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని అప్పటి టిటిడి చైర్మన్ స్వయంగా ఒప్పుకున్న వాస్తవాన్ని దాచిపెట్టి, సిగ్గుపడాల్సింది పోయి వైసిపి నేతలు కూటమి ప్రభుత్వంపై ఎదురు దాడులు చేయడం, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. కల్తీ జరిగిందని ఒప్పుకున్న తర్వాత కూడా బాధ్యత నుంచి తప్పించుకోవడానికి కుట్ర రాజకీయాలు చేయడం వైసిపి తీరుకు నిదర్శనమన్నారు. మాజీ టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి స్వయంగా లడ్డూ కల్తీ విషయాన్ని ఒప్పుకున్నారనే నిజాన్ని ప్రజలు మరచిపోరన్నారు. అయినా ఈరోజు అదే వైసిపి నేతలు దాన్ని మళ్లించేందుకు కొత్త ఆరోపణలు తీసుకురావడం, నిజాలను వక్రీకరించడం అత్యంత దారుణమన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయాలనుకోవడం రాజకీయ దిగజారుడుతనమని విమర్శించారు. హెరిటేజ్ ఇష్యూపై వైసిపి చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం అయినా చూపించగలరా? అని మంత్రి ప్రశ్నించారు. జగన్మోహన రెడ్డి తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్ళి డిక్లరేషన్ ఎందుకు ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. హిందూ సాంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదని, ఎందుకంటే హిందూవుల మనోభావాలను దెబ్బతీసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు వంటి పవిత్ర సంస్థల ప్రతిష్టను దెబ్బతీయ దానికి వైసిపి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మంత్రి హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న వాస్తవం నుంచి తప్పించుకునే ప్రయత్నాలు ఎంత చేసినా నిజం దాగదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# సప్తగిరులపై ఇక ఇవి వాహనాలే

- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత
- జూన్‌నాటికి తిరుమల ఘాట్‌లో డీజెల్ వాహనాలకు స్వస్తి!
- విద్యుత్ వాహనాలపై టిటిడి దృష్టి




తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలంకొండల్లో కొలువైన సప్తగిరులపై పర్యావరణ పరిరక్షణతోబాటు కాలుష్యనియంత్రణకు రానున్న జూన్‌నాటికి పూర్తిగా డీజిల్‌తో నడిచే వాహనాలకు స్వస్తిపలకాలని టిటిడి ఆలోచన చేస్తోంది. ఇందుకోసం తొలుత ఆర్టీసి బస్సులనుండే మార్పుకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఇదే విషయంగా ఇప్పటికే పలుమార్లు టిటిడి అధికారులు అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, రవాణ జిఎం శేషారెడ్డి, ఆర్టీసి, రవాణాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం కూడా నిర్వహించారు. తిరుమలకొండపై వాయుకాలుష్యంతోపాటు శబ్ధకాలుష్యం కూడా పెరుగుతోందని శాస్త్రవేత్తల ఆందోళన. ఇప్పటికే పలుచోట్ల పర్యావరణ శాస్త్రవేత్తలు పరీక్షలు చేశారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలకు వీలైనంత వరకు విద్యుత్ వాహనాలను వినియోగించుకునే దిశగా టిటిడి అవగాహన కల్పిస్తోంది. తిరుపతి నుండి తిరుమలకు ఘాట్‌లో నడిచే వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. పర్యావరణం కూడా కలుషితమవుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

తిరుమలపై వాయు, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టేందుకు టిటిడి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆరువేలవరకు రోజువారీగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పెట్రోల్, డీజెల్‌తో నడిచేవి తీసుకువస్తున్నారు. 450వరకు ఆర్టీసి బస్సులు డీజెల్‌తో నడిచేవి తిరుగుతున్నాయి. స్థానికంగా తిరుపతి- తిరుమల మధ్య నాలుగువేల వరకు ట్యాక్సీలు, వాహనాలు డీజెల్, పెట్రోల్‌వి నడుపుతున్నారు. దీనివల్ల ఘాట్‌లో, తిరుమల కొండపై కాలుష్యం శాతం పెరిగిపోతోందనేది పర్యావరణ శాస్త్రవేత్తల అంచనా. దీన్ని తగ్గించేందుకు, పచ్చదనం పెంపొందించడంతోబాటు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని టిటిడి అధికారుల ఆలోచన. ఈ ఏడాది జూన్‌నాటికి పాత డీజెల్, పెట్రోల్ వాహనాలను ఘాట్‌లో అనుమతించరాదనేది ఒక నిర్ణయం తీసుకుంటున్నారు. రానున్న ఏప్రిల్, మే నెలలు పూర్తిగా వేసవిసెలవులు కావడంతో యాత్రికుల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వరకు తిరుపతి నుండి తిరుమలకు యాత్రికులను చేరవేయడానికి విద్యుత్ బస్సులపైనే ఆధారపడనుంది.

ఇప్పటికే దశాబ్ధకాలం క్రిందటి వాహనాలను, కాలంచెల్లిన వాహనాలను తిరుమలకు దాదాపు అనుమతించడం లేదు. అలిపిరి వద్ద రవాణాశాఖ, పోలీసులు తనిఖీ చేసి ఆ తరువాత అనుమతినిస్తున్నారు. ఘాట్‌లో సామర్థ్యం లేనివాహనాలను అలిపిరిలోనే నిలిపివేసి ఆర్టీసి బస్సుల్లో, వేరే ప్రత్యామ్నాయాలు చూపుతున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి సిఎం సూచనలు అమలుచేసేదిశగా కార్యాచరణ సిద్దం చేస్తున్నారు. తిరుమలకు ప్రస్తుతం 50వరకు విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులు తిరుగుతున్నాయి. ఇవేగాక మరో వందవరకు టిటిడి అధికారులు విద్యుత్ కార్లు, రెండువందలపైగా ద్విచక్రవాహనాలు కూడా విద్యుత్‌తో నడిచేవి వినియోగిస్తున్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం విజయవంతంగా అమలవుతోంది. తిరుమల క్షేత్రాన్ని దేశంలోనే కాలుష్యరహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం దిశగా టిటిడి ఆలోచన శుభపరిణామంగానే భావిస్తున్నారు.

# తిరుపతిలో మంగళం డిపోను ప్రైవేటు పరం చేయొద్దు



తిరుపతి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లాలో కీలకమైన ఆర్టీసి మంగళం డిపోను ప్రైవేట్‌పరం చేయడం మానుకోవాలని సిఐటియు నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మికులంతా ప్రజల మద్దతుతో ఐక్యపోరాటం చేస్తే భవిష్య తరాలకు ఆర్టీసీ ఆస్తులను నిలిపిన వారమోతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కార్మికులకు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వందకోట్ల రూపాయల విలువచేసే మంగళం డిపోకు చెందిన పది ఎకరాల స్థలాన్ని పూలేకి చెందిన పినాకిల్ సంస్థకు అమ్మే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని కందారపు మురళి ప్రశ్నించారు. మంగళవారం ఉదయం మంగళం డిపోను సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్.జయచంద్ర, కోశాధికారి ఈఎస్ కుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఆర్టీసీకి సంబంధించిన స్థిర ఆస్తులను ప్రైవేటుపరం చేయడానికి కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఎస్ మన్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, ఎస్‌డబ్ల్యుఎఫ్ మంగళం డిపో అధ్యక్షుడు వి.మురళి, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి ఎస్.రెడ్డప్ప, మంగళం డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## బిల్‌గేట్స్ పర్యటనపై విషం కక్కుతున్న జగన్: మంత్రి పార్థసారథి

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాత వార్త ప్రతినిధి: రాష్ట్ర అభివృద్ధికి జగన్ వ్యతిరేకి అనే విషయం మరోసారి నిరూపితమైందని మంత్రి పార్థసారథి విమర్శించారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అమరావతి పర్యటనపై ఆయన విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా ఐదేళ్ల పాలన విధ్వంసానికి కూటమి పాలన నిర్మాణానికి నిదర్శనం. కూల్చివేతల ఆలోచన ఉన్న జగన్ అమరావతి నిర్మాణం జరుగుతుంటే ఓర్చుకోలేక పోతున్నారు. కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు విజన్‌ను బిల్‌గేట్స్ పొడగటంతో జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య విభాగం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నం. AE1/25/2025-26 తేది: 12.02.2026
పనిపేరు: YSR కడప జిల్లాలో మైదుకూరు మండలం ... మహాత్మా జ్యోతిబాపూలే A.P B.C సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థాగత సొసైటీ (బాలికలు) వద్ద కమ్యూనిటీ పారిశుధ్య కాంప్లెక్స్ నిర్మాణం. అంచనా వేరు: రూ.42.00 లక్షలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌లో టెండర్ డాక్యుమెంట్లు 19.02.2026 నుండి 05.03.2026 మ.3.30గం. వరకు అందుబాటులో ఉంటాయి. తదుపరి వివరాలకు దిగువ సంతకందారుని నుండి పొందవచ్చును.
సం/-, సూపరింటెండింగ్ ఇంజనీర్ RWS&S సర్కిల్, కడప.
DIPR.NO. 19099/CL/ADVT/1/1/2022-23 తేది: 17.02.2026

వార్త

పువ్వు ఎంత అందంగా ఉన్నా పరిమళం లేకపోతే అది వ్యర్థమే. అలాగే క్రియాశూన్యమైన మాటలు వినడానికి ఎంత సొంపుగా ఉన్నా నిష్ప్రయోజనమే.

-మెకాలే

# కొత్త ఆశల 'గేట్'?

డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులున్నాయి. అది గుర్తించిన వారు మాత్రమే భారత్‌తో మమేకమై పయనిస్తారు. అందుకే దేశ రాజధానిలో జరుగుతున్న ఎఐ సమ్మిట్‌లో ఎంతో మంది టెక్నాలజీ సంస్థల అధినేతలు కదిలి వచ్చారు. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ తెలుగునేలపై మరోసారి అడుగుపెట్టారు. టెక్నాలజీ అనుసంధానంతో సుపరిపాలన సాధ్యమేనని నమ్మి రియల్ టైమ్ గవర్నెన్స్‌లో ఆటోమేషన్ దిశగా అడుగులేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఎంతటి అధునాతన ప్రణాళికలు సృష్టించాలన్నా పాలకులకు దూరదృష్టి ఉండాలి. అలా ఉన్న నేతల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన రియల్ టైమ్ గవర్నెన్స్ గేట్స్ ఫౌండేషన్ అధినేత మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను ఆకట్టుకొంది. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పెర్సెప్షన్, ఏజంట్ స్పేస్, ఏపి ఎఐ సెర్చ్‌బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టులపై ఆయన అధికారులను అడిగి మరీ తెలుసుకున్నారు. 1997లో ఓసారి ఆయన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానంపై హైదరాబాద్ వచ్చివెళ్లారు. హైటెక్ సాంకేతిక అభివృద్ధిలో ఒక స్ఫూర్తి ఆయన పర్యటన మిగిల్చింది. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత పాతతరం స్నేహాన్ని పురస్కరించుకుని ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్ పర్యటనకు బిల్‌గేట్స్ రావడం ముదావహం. భవిష్యత్‌లో గేట్స్ ఫౌండేషన్ చేపట్టే ప్రాజెక్టులలో ఆంధ్రప్రదేశ్ శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవాలన్న ఆకాంక్ష ఈ పర్యటనలో కనపడుతోంది. కొన్ని పరిచయాలు కొందరి విషయంలో అద్భుతాలు సృష్టిస్తాయి. మూడు దశాబ్దాల నాటి బిల్‌గేట్స్ సాన్నిహిత్యం, సహచర్యం, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పంట పండింది. 'హలో ఫ్రెండ్.. హౌఆర్యూ' అని బిల్‌గేట్స్ తెలుగుదేశాధినేతను పలకరించడాన్ని బట్టి ఆ రాష్ట్రానికి ఏదో మేలు జరిగే శుభసూచనలు కనపడుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'క్వాంటమ్ కంప్యూటింగ్ అద్భుతాలు చేస్తుంది. ఆరోగ్య సంరక్షణ, ఔషధ పరిశోధనలు, సైబర్ భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల శక్తి దానికి ఉంది. అయితే అలాంటి టెక్నాలజీకి సాంకేతిక అనుసంధానం కోసం బిల్‌గేట్స్ వంటి మేధావులు అండదండలు కూడా అవసరమే. అందుకోసమే ఆ రాష్ట్రపాలకులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిరంగాల్లో అద్భుతాలు సృష్టించవచ్చుననే దృక్పథంతో సర్వశక్తులూ ఒడ్డి పరిపాలిస్తున్నారు. సాంకేతిక విప్లవ మార్పులతో ఆంధ్రాలో అద్భుత ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నానికి ఆయన రాక ఒక సంకేతం. దేశ విదేశాల్లో కృత్రిమ మేధ ఒక అద్భుత పయనం. దాని విషయంలో ఎపి తామూ ముందడుగే అని వడివడిగా అడుగులు వేస్తున్న తరుణంలో బిల్‌గేట్స్ రాక కొండంత బలమే. ఆరోగ్య సేవలను ప్రజలకుమరింత చేరువ చేయాలనే సంకల్పంతో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌కార్యక్రమాలుండడంతో ఆయన 'కుప్పం'లోని సంజీవని ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్నారు. విశేషించి విభజిత తెలుగు రాష్ట్రంలో వ్యవసాయంలో కృత్రిమ మేధను ఉపయోగించడాన్ని బిల్‌గేట్స్ ప్రస్తుతించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా సాగులో ఎఐని వాడకపోవడాన్ని గురించి ప్రస్తావించారు. డ్రోన్ వ్యవసాయాన్ని మన ప్రధాని నిత్యం వల్లించే ప్రకృతి వ్యవసాయాన్ని ఉండవల్లి అరటితోటలల్లోకి వెళ్లిస్వయంగా వీక్షించారు. ఎక్కడినుంచి వచ్చినా ఇక్కడివానిలానే ఆంధ్రప్రాంతపు రైతులతో మమేకమయ్యారు. వారి అనుభవాలను క్రోడీకరించుకుని, వారి ఆశయాలకు కృత్రిమమేధ ప్రోత్సాహం నిచ్చెనలువేసారు. కొంత మంది మంత్రులడిగిన ప్రశ్నలకు భవిష్యత్తులో కృత్రిమ మేధవల్ల ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందంటూనే పనిలో 'హ్యూమన్ టచ్' అనేది ఉండదన్నారు. విజనరీ ఆలోచనలకు తానెప్పుడూ పరవశమవుతాననే అర్థం వచ్చే ఎన్నో విషయాలను ప్రస్తావించారు. ఏదో చూడడానికి, ఎవరినో ప్రశంసించడానికి వచ్చినట్లుకాకుండా తనముందు ప్రదర్శించిన అన్ని అంశాలపై డిస్‌ప్లేవాల్ ప్రెజంటేషన్‌ను సావధానంగా వీక్షించి మెచ్చుకున్నారు. నాడు ఐటి, నేడు ఎఐ క్వాంటమ్ టెక్నాలజీలు రెండూ తెలుగు రాష్ట్రాలకు చిరుదివ్వెలేననే అభిప్రాయాన్నిఆయన వ్యక్తం చేశారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి అప్రమత్తమయ్యే వ్యవస్థను ఆయన ప్రశంసించారు. సాగులో సాంకేతికత పట్ల సంతోషించారు. రాష్ట్రంలో వనరులకు లోటులేదని, సంపద సృష్టించడమే తరువాయి అని అది బిల్‌గేట్స్ రాకతో నెరవేరు తుందన్న ఆశాభావం పాలకుల్లో కలిగింది. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం గేమ్‌చేంజర్ అని, ఆంధ్రప్రదేశ్‌తో గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి కొత్త దశ, దిశ ఏర్పడుతుందని సిఎం చంద్రబాబు ఆశాభావం. ఎపిలో మొత్తం పది రంగాలు, 30 ప్రభుత్వ విభాగాలో ఎఐని వినియోగిస్తున్నారు. 98 ఎఐ యూజ్ కేసులు, 43హ్యాక్‌థాన్లు ఉన్నాయి. ఏడు డేటా లేక్‌లున్నాయి. యూనివర్సల్ హెల్త్‌స్క్రీనింగ్, ఆయు ష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు సజావుగా జరుగుతోంది. సంజీవని ప్రాజెక్టును సమగ్ర ఆరోగ్య వేదికగా తీర్చిదిద్దే సంకల్పాన్ని కొనియాడారు. ఒక ప్రాంతంమీద ప్రేమతోనో, ఒక నేత మీద నమ్మకంతోనో కాకుండా గేట్స్ ఫౌండేషన్ సంకల్పాలు చాలా భిన్నంగా ఉంటాయి. ఆ మేరకు మన సంకల్పాలను కూడా తీర్చిదిద్దగలిగితే ఆయనతో చెలిమి మన ఆకాంక్షలను సుసంపన్నం చేయగలదు.

గడిచిపోయిన కష్టాలను జ్ఞప్తికి తెచ్చుకో, అనుభవిస్తున్న సుఖాల తీయదనం పెరుగుతుంది.




సిసి కోల్టన్

జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు.



జార్జ్ ఇలియట్

# ప్రజావాక్కు



## తొలి అడుగు

దశాబ్దంన్నర సంవత్సరాలు ప్రవాసంలో గడిపి కేవలం రెండు నెలలముందు స్వదేశం అయిన బంగ్లాదేశ్‌కు వచ్చి బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ తరపున పోటీచేసి అఖండ విజయం సాధించారు. ఆయనే తారీఖ్‌రహ్మాన్, కొద్ది రోజుల క్రితంమరణించిన ప్రధాని ఖాలీదాజియా కుమారుడు. ఈ అరవై ఏళ్ల వృద్ధుడు గతంలో జైలు జీవితం గడిపి లండన్ పారిపోయి వచ్చారు. చరిత్ర ఎవరికి తెలియంది కాదు. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌అనే దేశాన్ని నిర్మించింది భారత్ అనేసత్యాన్ని ఏ బంగ్లాపౌరుడు విస్మరించకూడదు, సత్సంబధాలను ఎప్పటికి కొనసాగించాలి. ఇది ఉభయ దేశాలకు మంచిది. ఇక భారత్‌లో తలదాచుకున్న పూర్వ ప్రధాని షేక్ హసీనాబంగ్లాకు అప్పగించే విషయం చర్చల ద్వారా నిర్ణయం తీసుకోవాలి. ప్రధానిగా తారీఖ్ రెహ్మాన్ ప్రమాణ స్వీకారానికి మనప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించడం బంగ్లాదేశ్ సహృద్భావానికి తొలి అడుగు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మామునూరు విమానాశ్రయం

వరంగల్‌లోని మామ్నూర్ విమానాశ్రయం కోసం భూసేకరణ పూర్తయింది. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ విమానాశ్రయంలో ప్రయాణికుల సేవలతో పాటుకార్గో, మెయింటెనెన్స్, రిపేర్‌అండ్ ఓవర్‌హాల్ కేంద్రం కూడా ఏర్పాటు చేయబడుతుంది. హైదరాబాద్ విమా నాశ్రయంపై ఉన్న ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది ఉత్తర తెలంగాణ ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచి, రైతులువ్యాపారులకు లాభంచేకూరుస్తుంది. అలాగే ఉపాధి అవకాశాలు పెరిగి, పర్యాటకం వ్యాపార అభివృద్ధికి దోహదపడుతుంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## పదవీ విరమణ వయస్సు తగ్గించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులు పదవీ విరమణ వయస్సుగురించి తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గది. ప్రభుత్వఉద్యోగులు ఉపాధ్యాయులు పదవి విరమణ వయస్సు గతంలో ఏబై ఎనిమిది సంవత్సరాలు ఉండేది. తర్వాత అరవై సంవత్సరాలుగా మార్చారు. ఆర్టీసీబస్ డ్రైవర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న డ్రిల్ మాస్టర్లలను ఏబై సంవత్సరాలకే రిటైర్ చేస్తే సరిపోతుంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఆలోచనాశక్తిని హరించకూడదు

భారతదేశ ఆర్థిక ముఖచిత్రం గత కొన్ని ఏళ్ళలో ఊహించని మార్పులకు లోనైంది. గతంలో వాటా మార్కెట్ అంటే కేవలం నిపుణులకు లేదాసంపన్నులకు మాత్రమే పరిమితమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల చరవాణి ఉన్న ప్రతి ఒక్క రూపెట్టుబడిదారులుగా మారిపోతున్నారు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో ఆర్థికమార్కెట్లల్లోకి ప్రవేశిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం మంచి పరిణామమే అయినప్పటికీ, వాటా వ్యాపారం అనేది ఒకగంభీరమైన పెట్టుబడి ప్రక్రియ నుండి మారిపోయి ఒక సరదా ఆటలా రూపాంతరం చెందడం ఆందోళన కలిగించే అంశం. ఈధోరణి వల్ల యువతలో విశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణ లాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది. సాంకేతికత పనిని సులభతరం చేయాలి తప్ప ఆలోచనా శక్తిని హరించకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఎవరి జీవితం వారి చేతుల్లోనే..

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడివరకు జీవన శైలి వ్యాధుల భారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండేఅని. తాత ముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీ మారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినే ఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటికాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్య పానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిరుప్రాయంలోనే ప్రాణాంతకమైన జబ్బులతో అకాల మరణం పాలు చేస్తున్నాయి. మనం చేస్తున్నతప్పులను ఎవరైనా సరిదిద్దుకొమ్మని చెప్పినా వినేస్థితిలోలేము. ఎవరి జీవితం, ఆరోగ్యం వారి చేతిలోనే ఉంది. దవాఖానలో, మందులలోకాదనీ గుర్తించాలి.

- డా.తండు మురళీ మోహన్, హైద్రాబాద్

## పార్లమెంటును కదిలించిన పుస్తకం!

జనరల్ మనోజ్ ముకంద నరవనే రాసిన బుక్ పార్లమెంట్‌ను కుదిపేసింది. బడ్జెట్‌పైన చర్చ కంటే బుక్ పైన చేర్చ ఎక్కువ జరిగింది. అయితే ఆ బుక్ ప్రింట్ కాలేదని ప్రభుత్వం ప్రచురణ సంస్థ చెప్పడం హాస్యపదం. ఎందుకంటే పెంగ్విన్ చేసిన మొదటి ప్రకటనలో అంశాలు ఇలాఉన్నాయి. ఎవరైనా పుస్తకంలోని అంశాలు ఎక్కడయినా ఊటంకిస్తే అది కాపీరైట్స్ చట్ట ఉల్లంఘన అవుతుంది అనేది ఆ ప్రకటన సారాంశం. అయితే బుక్ ప్రింట్ కానప్పుడు ఇలాంటి ప్రకటన ఎందుకు వచ్చింది.

- భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సోషల్ మీడియా వరమా! శాపమా?

సోషల్ మీడియా నెట్‌వర్కింగ్‌కు ప్రధాన ఆదాయం ప్రకటనల ద్వారా సమకూరుతుంది. ప్రకటనల ద్వారా వీటి ఆదాయం బాగా పెరిగింది. సోషల్ నెట్‌వర్క్ ఖాతాలో 5.6 బిలియన్లకు పైగా వినియోగదారులున్నారు. సోషల్ మీడియా వరమా? శాపమా? అనే సంశయం కలుగక మానదు. వర్తమాన సమాజంలో నెలకొంటున్న అస్తవ్యస్త పోకడలను చూస్తే ఈ సందేహం సహేతుకమే. మన పంచేంద్రియాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు చట్రంలో ఇరుక్కు పోయాయి. ఎక్కడున్నా మన ఆలోచనలు మొబైల్ ఫోన్ స్క్రీన్ మీదే కేంద్రీకరింపబడుతున్న మాట కాదనలేం. యువతలో పెరిగిన సోషల్ మీడియా ప్రభావం నైతిక పతనం వైపుపరుగులు పెట్టిస్తున్నది. సామాజిక మాధ్యమాల్లో లోపిస్తున్న సంస్కారం సమాజానికి హానికరంగా మారింది.



సుంకవల్లి సత్తిరాజు

పుస్తక పఠనం ఆధునిక తరానికి భారంగా మారింది. చరవాణి సర్వస్వంగా మారింది. జ్ఞానానికి నిలయాలైన గ్రంథాలయాలు పాఠకులు లేక వెలవెల బోతున్నాయి. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్, ఎక్స్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫాంలు ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రాచుర్యం పొంది, కోట్లాది మంది ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సాంకేతిక విప్లవం జనబాహుళ్యంలోకి చొచ్చుకు వచ్చింది. వర్తమాన ప్రపంచంలో సోషల్ మీడియా గురించి ఎంత చెప్పినా తక్కువే. జన్‌జి లాంటి ఉద్యమాలతో ప్రభుత్వాలను కూలగొట్టిన చరిత్ర సోషల్ మీడియాదే అని చెప్పక తప్పదు. గూగూల్ సెర్చ్ ఇంజన్‌ను ప్రపంచవ్యాప్తంగా నేటికీ 90శాతం మంది ప్రజలు అనుసరిస్తున్నారు. గూగూల్‌కు ప్రత్యామ్నాయంగా అనేక సెర్చ్‌ఇంజన్లు అందుబాటులోకి వచ్చాయి. డక్‌డక్ గో, స్టార్ట్ పేజ్, బ్రేవ్ సెర్చ్, బింగ్ డాట్ కామ్, చాట్ జిపిటి వంటి వ్యవస్థలు పుట్టు కొచ్చాయి. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సమాచార శోధనలో సరికొత్త విప్లవం సృష్టించింది. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ, కోట్లాది మంది యువతను బానిసలుగా మార్చింది. సోషల్ మీడియా ఒక వ్యసనంగా రూపాంతరం చెందింది. ఈ కారణంగానే సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, స్క్రీన్ టైమ్ తగ్గించుకోవాలని, పిల్లలను చరవాణికి దూరంగా ఉంచాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు. 16 సంవత్సరాల లోపు వయసు గల వారికి సోషల్ మీడియాను దూరం చేస్తూ ఆస్ట్రేలియా ఒక అరుదైన నిర్ణయం తీసుకుని అమలు చేయడం సముచితమే అయినా, ఇది ఆచరణలో విఫలం కాక తప్పదు. ఇటీవల లోక్‌సభలో తెలుగు దేశం పార్టీ 16 సంవత్సరాలలోపు వయసు గల వారికి సోషల్ మీడియా నిషేధించాలని ఒక ప్రైవేటు బిల్లు ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాదన ఉద్దేశ్యం మంచిదే అయినా ఇది ప్రైవేటు బిల్లు కాబట్టి లోక్‌సభలో దీనికి తగిన ప్రాధాన్యత లభించబోదు. నేడు సోషల్ మీడియాను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ. ఇంత బహుళ ప్రాచుర్యం పొందిన సోషల్ మీడియాను సుమారు 69 శాతం మంది వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. 80 శాతం పైగా అమెరికన్లు సాంఘిక మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారు. చైనాలో 100 కోట్లమంది సోషల్ మీడియా యూజర్లున్నారు. 30 సంవత్సరాల లోపు వయసు గల సుమారు 58శాతంమంది టిక్ టాక్ ఉపయోగిస్తున్నారు. చైనాలో ఫేస్‌బుక్ యూజర్ల సంఖ్య మిలియన్ల సంఖ్యలో ఉంది. అయితే ఇతర దేశాల్లో దీని వినియోగం ఎంతో అధికం. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వ్యాపారాభివృద్ధికోసం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం, ఉపాధి అవకాశాల కోసం, కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడం కోసం ఉపయోగపడుతున్నది. తమ ప్రతిభ కేవలం నాలుగు గోడల మధ్య నలిగిపోకుండా ప్రపంచానికి పరిచయం చేయడం కోసం చాలా మంది సాంఘిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ధనార్జన చేస్తున్నవారు కోకొల్లలు. అవకాశాల కోసం ఎదురు చూసే వారికి సోషల్ మీడియా ఒక కొంగుబంగారం. స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు ప్రతీ రోజు సగటున సుమారు 4గంటలకు పైగా సమయం వెచ్చిస్తున్నాడు. ప్రతీ నెలలో సుమారు 70-75 గంటల సమయాన్ని సోషల్ మీడియా యాప్స్‌కు వెచ్చిస్తున్నారు. సుమారు 500కోట్ల జనాభా అనగా ప్రపంచ జనాభాలో సుమారు 62శాతం మంది ప్రజలు సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉన్నారు. ప్రతీ రోజు బిలియన్ల సంఖ్యలో ప్రపంచంలోని



పలువురితో ఆత్మీయంగా కలిసే అవకాశాన్ని సోషల్ మీడియా సుసాధ్యం చేస్తున్నది. యాపిల్ ఐఫోన్ సోషల్‌మీడియా జాతకాన్ని ఓ మలుపు తిప్పింది. ఇప్పుడు దాదాపు అన్ని బ్రాండెడ్ ఫోన్లలో వివిధ అప్లికేషన్లు యూజర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్ ద్వారా లభిస్తున్న రెవిన్యూలో సగానికిపైగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లదే. యు.ఎస్‌లో ఫేస్‌బుక్, యూట్యూబ్‌ఇన్‌స్టాగ్రాం హవా నడుస్తున్నది. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టిక్‌టాక్, వాట్సప్, స్నాప్‌చాట్, ట్విట్టర్, పిన్ టెరెస్ట్, లింక్డ్‌ఇన్‌లు బాగాప్రాచుర్యం పొందాయి. ఒకప్పుడు మన అభిప్రాయాలను వేరొకరితో పంచుకోవడానికి, మనల్ని మనం ఇతరులకు పరిచయం చేసుకోవడానికిమనం వ్రాసే పుస్తకాలు, పత్రికా వ్యాసాలు, మనం పాల్గొనే సమావేశాలు, ప్రసంగాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే వర్తమానంలో వీటితో పెద్దగా అవసరం లేదు. ప్రతిభఉన్నా లేకపోయినా ఇష్టమైన రీతిలో అడ్డదిడ్డమైన పోస్టులు పెట్టడం, వీడియోలు పోస్టుచేయడం, అనవసరమైన గొడవలతో రచ్చచేయడం వాటిని ఆస్వాదించే జనం పెరగడం చూస్తున్నాం. ఎవరికివారు సోషల్ మీడియా సామ్రాజ్యానికి రారాజుల్లా వెలిగి పోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలను సృష్టించి, తమ వ్యాపారాలను బిలియన్ల కోట్ల డాలర్లకు పెంచేసుకుంటూ కుబేరులుగా మారిపోయిన వారిని ఊహించుకుంటూ, మన సమయాన్ని వృథా చేస్తున్నాం. రోజూ జిబిల కొద్దీ డేటాను కొనుగోలు చేసి, అవసరం లేకున్నా మన ఖర్చులను పెంచేసుకుంటున్నాం. ఒకప్పుడు కారు చౌకగా లభించిన మొబైల్ డేటా నేడు విపరీతంగా పెరిగింది. అపరిమితమైన వాయిస్ కాల్స్ నేడు ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి. సెల్‌ఫోన్ ఖర్చులు సామాన్య ఫోన్ వినియోగ దారుల, స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దూరాన్ని దగ్గరచేసి, టెక్నాలజీ సహాయంతో ప్రపంచాన్ని మన చెంతకు చేర్చి, మన అభిప్రాయాలను, మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన ఆచార వ్యవహారాలను మిగతా ప్రపంచానికి దగ్గర చేసే సోషల్ మీడియా నేడొక అవసరంగా మారింది. సాంఘిక మాధ్యమాలను వినియోగించడానికి మనకొక ఎలక్ట్రానిక్ పరికరం అవసరం. అది కంప్యూటర్‌కావచ్చు. ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కావచ్చు లేక ట్యాబ్, మొబైల్ కావచ్చు. ఏదిఏమైనా నేటి కాలానికి అత్యంత సౌకర్యవంతమైన సాంకేతిక సాధనంగా మొబైల్ జన హృదయాలను దోచుకుని, మనల్ని ఒక అద్భుతమైన ప్రపంచానికి తీసుకుపోయింది. మొబైల్ జీవితంలో ఒక విడదీయరాని సంబంధంగా, ఒక వ్యాపకం మారిపోయింది. ఈ సంవత్సరం ప్రారంభానికి ప్రపంచంలో 6 బిలియన్లమంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారని ఒకఅంచనా. ఇది ప్రపంచ జనాభాలోసుమారు 67 శాతంగా ఉంది. ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శత విధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఇన్‌స్టా గ్రాం యూజర్లు ప్రపంచ వ్యాప్తంగా 3 బిలియన్లుగా అంచనా వేసారు. ఇండియాలో దీని సంఖ్య సుమారు 392 మిలియన్లు. ఇండియాలో ఫేస్‌బుక్ యూజర్లు 58 కోట్ల వరకు ఉండవచ్చు. ఫేస్‌బుక్ (మెటా యాజమాన్యం) గతంలోనే వాట్సాప్, ఇన్ స్టాగ్రాంలను కొనుగోలు చేసింది. ఫేస్‌బుక్ 2025 వ సంవత్సరంలో దాదాపు 200బిలియన్ డాలర్ల ఆదాయాన్నిఆర్జించింది. ప్రపంచంలో ట్విట్టర్ నెలవారీ యూజర్ల సంఖ్య 600 మిలియన్లుదాటింది. అలాగే సోషల్ మీడియాలో గేమింగ్ బాగా ప్రజాదరణ పొందింది. వీటికి సంబంధించిన అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. సోషల్ మీడియా నెట్‌వర్కింగ్‌కు ప్రధాన ఆదాయం ప్రకటనల ద్వారా సమకూరుతుంది. ప్రకటనల ద్వారా వీటి ఆదాయం బాగా పెరిగింది. సోషల్ నెట్‌వర్క్ ఖాతాలో 5.6 బిలియన్లకు పైగా వినియోగదారులున్నారు. సోషల్ మీడియా వరమా? శాపమా? అనే సంశయం కలుగక మానదు. వర్తమాన సమాజంలో నెలకొంటున్న అస్తవ్యస్త పోకడలను చూస్తేఈ సందేహం సహేతుకమే. మన పంచేంద్రియాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపుచట్రంలో ఇరుక్కు పోయాయి. ఎక్కడున్నా మన ఆలోచనలుమొబైల్ ఫోన్ స్క్రీన్ మీదే కేంద్రీకరింపబడుతున్న మాట కాదనలేం. యువతలో పెరిగిన సోషల్ మీడియా ప్రభావం నైతిక పతనం వైపుపరుగులు పెట్టిస్తున్నది. సామాజికమాధ్యమాల్లో లోపిస్తున్నసంస్కారం సమాజానికి హానికరంగా మారింది. •

# దివ్యాంగులకు సమాన హక్కులవసరం

తరిగోపుల నారాయణస్వామి

మన సమాజంలో దివ్యాంగ వ్యక్తుల జీవితం ఇంకా నిరంతర పోరాటంగానే కొనసాగుతోంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి న్యాయస్థానాల వరకు వికలాంగుడు అడుగుపెట్టిన ప్రతి చోటా అతడిని తక్కువ చూపుతో చూడటం, అనుమానంతో వ్యవహరించడం ఒక వ్యవస్థాగత వివక్షగా మారింది. వికలాంగుడిని మాటలతో దూషించడం, శారీరక లోపాన్ని ఎగతాళి చేయడం, అవమానించడం మానవత్వానికి విరుద్ధమే కాకుండా చట్టపరంగా శిక్షార్హమైన నేరమని చాలా మందికి ఇంకా తెలియదు. భారతదేశ పార్లమెంట్ 2016లో తీసుకొచ్చిన వికలాంగుల హక్కుల చట్టం దివ్యాంగులను దయతో చూడాల్సిన వర్గంగా కాకుండా సమాన హక్కులు కలిగిన పౌరులుగా గుర్తించింది. ఈ చట్టం ప్రకారం వికలాంగులపై ఏ రూపంలో వివక్ష చూపినా, వారి గౌరవాన్ని భంగపరిచినా, వారి హక్కులను అడ్డుకున్నా శిక్షలు తప్పవని స్పష్టంగా పేర్కొంది. అయినప్పటికీ వాస్తవంగా చూస్తే గ్రామాలు, కార్యాలయాల్లో ఈ చట్టానికి భయపడే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగ ఉద్యోగులు లేదా సేవల కోసం వచ్చిన దివ్యాంగ పౌరులు ఎదుర్కొనే పరిస్థితి మరింత బాధాకరం. దరఖాస్తులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం, ఫైళ్లను పక్కన పెట్టడం, పదే పదే తిరగమంటూ మానసికంగా వేధించడం ఈ చట్టం ప్రకారం నేరాలే అయినా, వాటిపై చర్యలు అరుదుగా కనిపిస్తున్నాయి. వికలాంగ ఉద్యోగిని అతడి లోపాన్ని చూపిస్తూ అవమానించడం, పనిభారం పేరుతో వేధించడం, ప్రమోషన్లు లేదా బదిలీల్లో వివక్ష చూపడం కూడా చట్టవిరుద్ధమే. అలాంటి సందర్భాల్లో సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు, జరిమానాలు, అవసరమైతే జైలుశిక్షలు విధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. దివ్యాంగుల ఆస్తుల విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరం. దివ్యాంగుడని తెలిసినా అతడి భూమిని అక్రమంగా ఆక్రమించడం, బెదిరించడం, దౌర్జన్యం చేయడం తరచుగా జరుగుతోంది. వికలాంగుల ఆస్తులపై దురాక్రమణ జరిగితే ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని, వేగంగా పోలీస్ కేసులు నమోదు చేసి బాధితుడికి న్యాయం అందించాలని 2016 చట్టం స్పష్టం చేస్తోంది. దివ్యాంగుడి భూమిని ఆక్రమించిన వారిపై జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అధికారం ఈ చట్టం ప్రభుత్వానికి ఇచ్చింది. అయినా గ్రామస్థాయిలో ఈ శిక్షలు అమలవుతున్న దాఖలాలు చాలా తక్కువగా ఉన్నాయి. దివ్యాంగులు ఫిర్యాదు చేస్తే వారినే ప్రశ్నించడం, రాజీకి ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధమే కాకుండా మరో రకమైన మానసిక వేధింపుగా మారుతోంది. దివ్యాంగుల హక్కులను పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా, రాష్ట్ర స్థాయి యంత్రాంగం ఎంతవరకు చురుకుగా పనిచేస్తోంది అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. చట్టం ప్రకారం వికలాంగులపై జరిగే ప్రతి వివక్ష నేరమే అది వ్యక్తి చేసినా, ప్రభుత్వ ఉద్యోగి చేసినా, సంస్థ చేసినా శిక్ష తప్పదు. అయినా సమాజంలో ఆ భయం ఇంకా ఏర్పడలేదు. దివ్యాంగుల హక్కులు సంక్షేమంగా కాకుండా మౌలిక హక్కులుగా చూడాలని చట్టం స్పష్టం చేసినా, అమలులో మాత్రం ఇంకా దయా దృష్టికోణమే కొనసాగుతోంది. దివ్యాంగుడిని సహాయం కోరే వ్యక్తిగా కాకుండా హక్కులు కోరే పౌరుడిగా గుర్తించినప్పుడే చట్టం జీవం పోసుకుంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ యంత్రాంగం ఈ చట్టంపై పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండటం అత్యవసరం. దివ్యాంగులపై జరిగే ప్రతి వేధింపుకు స్పష్ట మైన శిక్షలు అమలైతేనే సమాజంలో మార్పువస్తుంది. చట్టాలు ఉన్నాయనే గర్వం సరిపోదు అవి బాధితుల జీవితాల్లో కనిపించాలి. దివ్యాంగులపై వివక్ష చూపిన ప్రతి వ్యక్తి శిక్షకు గురయ్యే రోజు వచ్చినప్పుడే సమానత్వం నిజమవుతుంది. •

# సంఘాలు,సభ్యత్వాలెన్నో.. సంక్షేమం శూన్యం!

నల్ల రవి కుమార్

ఆంధ్రప్రదేశ్లో ఉపాధ్యాయ సంఘాల సంఖ్య నలభైకి పైగా ఉంది. కానీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కనిపిస్తున్న ఫలితం మాత్రం నామమాత్రం. ఒకప్పుడు హక్కుల కోసం పోరాడిన సంఘాలు, నేడు సభ్యత్వాలు, ఫండ్లు, ఈవెంట్లు, సన్మానాల చుట్టూ తిరిగే సంస్థలుగా మారాయన్న విమర్శ ఉపాధ్యాయ వర్గం నుంచే వినిపిస్తోంది. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు సుమారు లక్షన్నర మంది మాత్రమే ఉంటే, నాలుగు పెద్ద సంఘాల్లో ప్రతి సంఘం సభ్యత్వం లక్ష దాటిపోతుండటం ఆశ్చర్యకరం. అన్ని సంఘాల సభ్యత్వాలను కలిపితే ఐదు లక్షలు దాటుతున్నాయి. ఇది గణాంకాల వింత మాత్రమే కాదు వ్యవస్థ లోపానికి ప్రత్యక్ష నిదర్శనం. ఈ పరిస్థితిలో ఉపాధ్యాయులకు ఏ ఒక్క సంఘంతోనూ నిజమైన అనుబంధం ఉండటం లేదు. సభ్యత్వం ఉంది కానీ ఉద్యమ స్ఫూర్తి లేదు. అందుకే ఆధార్ నెంబర్ లింక్ చేసి ఒక ఉపాధ్యాయుడు – ఒక సంఘం" విధానం అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సర్వీస్‌రూల్స్-1962 అమలే ప్రజాస్వామ్యానికి పునాది. ఈరూల్ ప్రకారం, కనీసం 25 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్నప్పుడే ఏ సంఘానికైనా గుర్తింపు ఇవ్వాలి. కానీ ఈ నిబంధన నేటి పరిస్థితుల్లో పూర్తిగా విస్మరించబడుతోంది. ఈ రూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించి, ఎన్నికల ఆధారంగానే ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి. అప్పుడు ఆ ఎన్నికల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సంఘాలకు మాత్రమే సభ్యత్వం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. మిగిలిన సంఘాలను రిజిస్ట్రేటేడ్ అసోసియేషన్‌గా మాత్రమే పరిగణించాలి. సభ్యత్వమే ప్రాతినిధ్యానికి సూచిక అన్నట్టు వ్యవహారం నడుస్తున్నప్పుడు, ఎన్నికలలో ప్రజాస్వామ్యం ఎక్కడ? నాయకత్వం దశాబ్దాల తరబడి పాతుకుపోయి, సంఘాలు వ్యక్తుల చుట్టూ తిరుగుతున్నాయి. ఏ ఉపాధ్యాయ సంఘంలోనూ దళిత వర్గాల వారిని రాష్ట్ర స్థాయి ప్రధాన నాయకత్వంలోకి ఎదగనివ్వకపోవడం ఒక చేదు నిజం. జిల్లాల స్థాయిలోనూ ఇదే దుస్థితి కొనసాగుతోంది. ఈ నిరాకరణ వల్లే, తమ సంక్షేమం కోసం దళిత వర్గాలకు చెందిన ఉపాధ్యాయులు కుల సూచిక నామాలతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిజానికి 1962 నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే ఆ నిబంధనలు స్పష్టంగా కులం, మతం, తెగ ఆధారంగా సంఘాలు ఏర్పడకూడదు అని చెబుతున్నాయి. కుల సంఘాల ఉద్భవానికి కారణం ఉపాధ్యాయులే కాదు ప్రధాన సంఘాల్లో ప్రజాస్వామ్య నాయకత్వం లేకపోవడమే. చాలా సంఘాల్లో ఎన్నికలకు కోరమ్‌ఉండదు. ఇది ఆత్మపరిశీలన చేయాల్సిన అంశం. సభ్యత్వ ఫీజులు, జనరల్ ఫండ్, బిల్డింగ్ ఫండ్, వార్షిక



సభలు, రాష్ట్రస్థాయి ఈవెంట్లు ఇవన్నీ నిర్వహణకు చూపే ఉత్సాహం, ఉపాధ్యాయుల మౌలిక సమస్యలపై కనిపించడం లేదు. సన్మానాలు, సత్కారాలు, ప్రశంసాపత్రాలకు నాయకత్వం అలవాటు పడిపోయింది. సాధారణ ఉపాధ్యాయుడు సోషల్ మీడియా మాయలో ఉన్నాడు. ఉద్యమాల స్థానంలో ఫ్లెక్సీలు, వేది కలు, ఫోటోలు మాత్రమే మిగులుతున్నాయి. పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు అమలులోఉన్న చట్టాలు వేరుగా ఉండగా, గవర్నమెంట్ టీచర్లతో యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ చట్టబద్ధంగా సాధ్యం కాదన్న నిజాన్ని సంఘాలు ఉపాధ్యాయులకు చెప్పడం లేదు. అసలు రూల్స్ వస్తే వచ్చే ప్రమోషన్‌తో ప్రయోజనం ఒక ఇంక్రిమెంట్ మాత్రమే. వాటి వల్ల వచ్చే ప్రమోషన్లు కూడా రాష్ట్ర వ్యాప్తంగా 500 దాటక పోవచ్చు. ఒక ఇంక్రిమెంట్ విలువ జీతంలో సుమారు 2.5 శాతం మాత్రమే ఉంటుంది. కానీ ఒక డీఏ పెరుగుదలే 3శాతానికి మించి ఉంటుంది. ఈ వాస్తవాలను గురించి ఆలోచించే నిజాయితీ సంఘాలకు కనిపించడం లేదు. స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్-డిగా ప్రమోషన్ పొందిన కొందరు, మహిళా ఉపాధ్యాయులకు కనీసం చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వడానికి కూడా ఇష్టపడటం లేదు. కార్యాలయ పనికి అంతరాయం కలగకుండా ఉంటుందని భావించినప్పుడే సెలవుఇవ్వాలనే నిబంధనను కుంటిసాకుగా చూపి మహిళా టీచర్లకు నరకం చూపిస్తున్నారు. సంవత్సరం పొడుగునా బోధన, పరీక్షలు, ఆన్లైన్‌లో మార్కుల అప్లోడ్ ఉండే స్కూల్స్‌లో పనికి అంతరాయం లేకుండా ఎలాసాధ్యం. పై అధికారులకు తెలియజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసిన వాస్త వాన్ని ప్రధానోపాధ్యాయులు విస్మరిస్తున్నారు. ఇలాంటి వారురేపు ఉన్నతాధికారులుగా ప్రమోషన్లు పొందితే, సాధారణ ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతవరకు కృషి చేస్తారన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగులుతోంది. ఇన్కమ్ ట్యాక్స్ ఈఫైలింగ్, పిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, జిఐఎస్‌లోన్లు, ఎన్‌పిఎస్ పార్టియల్ విత్డ్రాయల్స్ ఇవి ఉపాధ్యాయుల వ్యక్తిగత పనులు ,బాధ్యతలు. వాటికి సహాయం చేయడాన్నే సంఘాలు గొప్పసేవగా ప్రచారం చేసుకోవడం వల్ల, ఉపాధ్యాయుల్లో స్వీయ బాధ్యత తగ్గిపోతోంది. ఉపాధ్యాయ సంఘాల్లో పెరుగుతున్న కుల భావన ఉపాధ్యాయ వృత్తి గౌరవానికి, విద్యా వ్యవస్థకు ప్రమాదకరం. ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడవ్వాల్సిన స్థితిలో, కుల సమీకరణాల బందీగా మారడం ఆలోచనీయ పరిణామం. ఉపాధ్యాయ సంఘాలు ఆత్మపరిశీలన చేసుకోకపోతే, అవి ఉపాధ్యాయ సంక్షేమానికి కాకుండా కేవలం సంఘ సంస్కృతికే పరిమి తమవుతాయి. 1962 నిబంధనల ప్రకారం ఎన్నికలు, కనీసం 25 మంది సభ్యత్వం లేకుండా గుర్తింపు వద్దు, ఒక ఉపాధ్యాయుడు - ఒక సంఘం, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కు పరిమిత గుర్తింపు, ప్రజాస్వామ్య, సమానత్వ నాయకత్వం ఇవే ఉపాధ్యాయ ఉద్యమాన్ని మళ్లీ సరైన దారిలో నడిపించగల మార్గాలు. లేకపోతే సంఘాల సంఖ్య పెరుగుతుంది. సమస్యలు మాత్రం అలాగే మిగులుతాయి. •




# ఎఐలో రూ.18లక్షల కోట్ల పెట్టుబడులు

## ప్రపంచ టెక్ దిగ్గజాలు, ఇన్వెస్టర్లు భారత్ వైపే చూస్తున్నారు..

### 'డీప్‌టెక్ ఫండింగ్' కోసం క్యూకడుతున్న పారిశ్రామికవేత్తలు: కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

### అట్టహాసంగా మొదలైన ఎఐ సమ్మిట్ ఎక్స్‌పో

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** రెండేళ్ల కాలంలోనే దేశంలోకి రూ.18లక్షల కోట్ల భారీ పెట్టుబడులు రానున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ ఎఐ సదస్సువేదికగా ప్రకటించారు. మంగళవారం దిల్లీలోని భారత్ మండపంలో అట్టహాసంగా ప్రారంభమైన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఎక్స్‌పో వేదికగామాట్లాడిన మంత్రి ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ దిగ్గజాలు, ఇన్వెస్టర్లు ఇప్పుడు భారత్ వైపే చూస్తున్నారని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల నుంచి భారత్‌పై ప్రధానంగా మూడు రకాల ఆసక్తులు కనిపిస్తున్నాయి. మొదటిది నేరుగా భారీ పెట్టుబడులు పెట్టడం. రానున్న రెండేళ్లలో 200 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నాం. రెండోది డీప్ టెక్ ఫండింగ్. వెంచర్ క్యాపిటలిస్టులు భారతీయ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టడానికి క్యూ కడుతున్నారని మూడోది భారతీయ ఆవిష్కరణలు లెక్కకుమించి ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. మన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోందని మంత్రి పేర్కొన్నారు. రూ. 20,000కోట్ల పెట్టుబడులు ఖరారయ్యాయని, ఇవి వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో కార్యరూపం దాలుస్తాయని తెలిపారు. భారతదేశం సాధించిన డిజిటల్ విప్లవం గురించి మంత్రి వివరిస్తూ ప్రధాని మోడీ నాయకత్వంలో మనం నిర్మించుకున్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అద్భుతమని, దీనివల్ల ఏఐ టెక్నాలజీ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. జనాభా ప్రాతిపదికన సమస్యలను పరిష్కరించడానికి మన వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోంది. అందుకే గ్లోబల్ సీఈఓలు మన దేశంలోని డీప్ టెక్ స్టార్టప్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. సాంకేతికత ఎంత మంచిదో, డీప్‌ఫేక్స్ అంత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో, దానిపై మంత్రి స్పందించారు. సమాజంలో డీప్‌ఫేక్స్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మన పిల్లలను, సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రస్తుతం ఉన్న నిబంధనలు సరిపోవు. మరింత కఠినమైన రెగ్యులేషన్స్ అవసరం. దీనిపై పార్లమెంట్‌లో ఏకాభిప్రాయం తీసుకురావాలని మంత్రి చెప్పారు. నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్, మెటా (ఫేస్‌బుక్), ఎక్స్ వంటి సంస్థలు కచ్చితంగా భారత రాజ్యాంగానికి, చట్టాలకు లోబడి పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వయసుఆధారిత ఆంక్షలు విధించే దిశగా పరిశ్రమ వర్గాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సదస్సులో భారత్ తన సొంత ఏఐ మోడల్స్‌ను ప్రదర్శించింది. మన దేశీయ మోడల్స్ ప్రపంచస్థాయి ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోవు. గ్లోబల్ బిగ్ మోడల్స్‌తో (చాట్ జీపీటీ, జెమినై వంటివి) ఇవి పోటీ పడుతున్నాయి. ఐఐటీ బాంబే కన్సార్టియం, సర్వం ఏఐ, టెక్ మహీంద్రా వంటి 12 సంస్థలు భారతీయ డేటాసెట్స్ ఆధారంగా వీటిని రూపొందించాయి. ఏఐ మిషన్ 2.0లో భాగంగా వీటికి భారీ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వైష్ణవ్ తెలిపారు. ఈ సమ్మిట్‌కు వచ్చిన స్పందన చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఏఐ సమ్మిట్‌లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. ఇప్పటివరకు 3 లక్షల మందికి పైగా యువకులు, పరిశోధకులు, విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. సెషన్లన్నీ హౌస్ ఫుల్ అవుతున్నాయి. దేశవ్యాప్తంగా యువతలో ఒక కొత్త ఎనర్జీ కనిపిస్తోందని అన్నారు. ఈ సమ్మిట్‌లో పాలసీ మేకర్లు, గ్లోబల్ ఇండస్ట్రీ లీడర్లు, ఇన్వెస్టర్లు, ఇన్నోవేటర్లు ఒకే వేదికపైకి వచ్చారు. గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీఈ సదస్సులో ప్రారంభోపన్యాసం చేయనున్నారు. అందరికీ అందుబాటులో ఉండే ఏఐ అభివృద్ధిపై భారత్ విజన్‌ను ప్రధాని ప్రపంచానికి చాటి చెప్పనున్నారు.



## బంగ్లా కొత్త ప్రధానిగా తారిక్ రెహమాన్ ప్రమాణం

### 25 మంది మంత్రులు, 24 మంది సహాయమంత్రులతో కేబినెట్

**ఢాకా, ఫిబ్రవరి 17:** బంగ్లాదేశ్‌లో కొత్త రాజకీయ అధ్యాయం మొదలైంది. దేశ 11వ ప్రధాన మంత్రిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిక్ రెహ్మాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించడంతో ఆయన ప్రధాని పీఠాన్ని అధిష్టించారు. 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధాని కావడం విశేషం. సుమారు ఏడాదికాలంలో బంగ్లాదేశ్‌లో పెచ్చుమీరిన హింసకు ఇకపై తెరపడుతుందన్న ఆశాభావం వ్యక్తం అవుతోంది. హిందూమైనార్టీలపై జరుగుతున్న హింసాత్మకదాడులకు పుల్‌స్టాప్ పడాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మంగళశారం ఢాకాలోని జాతీయ పార్లమెంట్ సౌత్ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్, తారిక్ రెహ్మాన్‌తో ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు 50 మంది సభ్యుల మంత్రివర్గం కూడా ప్రమాణం చేసింది. ఈ కేబినెట్‌లో 25 మంది మంత్రులు, 24 మంది సహాయ మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్‌లు ఉన్నారు. తొలిసారి ఎన్నికైన వారితో పాటు పలువురు కొత్త ముఖాలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. పార్లమెంట్ సభ్యులుగా బీఎన్‌పీకి చెందిన 209 మంది ఎంపీలు ప్రమాణం చేశారు. రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణ పత్రంపై సంతకాలు చేయడానికి పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వారు నిరాకరించారు. తాము కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాలేదని, అందుకే ఆ ప్రమాణాన్ని స్వీకరించబోమని బీఎన్‌పీ నేత సలావుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు. బీఎన్‌పీ వైఖరిని నిరసిస్తూ జమాత్‌ఎఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ) లతో కూడిన 11 పార్టీల కూటమి తొలుత ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కొద్దిసేపటికే ఈ రాజకీయ డ్రామాకు తెరపడింది. జమాత్ నేతృత్వంలోని కూటమి, స్వతంత్రులు, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్, ఎన్‌సీపీ ఎంపీలు వేర్వేరుగా ప్రమాణం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏఎంఎం నసీర్ ఉద్దీన్ కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణం చేయించడం గమనార్హం. ఈనెల 12న 299 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకోగా, రాడికల్ ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్‌ఎఇస్లామీ 68 స్థానాల్లో విజయం సాధించింది. రెండు చోట్ల గెలిచిన తారిక్ రెహ్మాన్, బోగ్రా6 స్థానాన్ని వదులుకుని, ఢాకా17 ఎంపీగా ప్రమాణం చేశారు. గత 18 నెలలుగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. భారత్ పర్యటనకు రావలసిందిగా ఓం బిర్లా ఆహ్వానించారు. బంగ్లాదేశ్‌లో కొలు వుదీరిన నూతన ప్రభుత్వానికి ఆయన భారత్ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముంబయి తీరంలో మూడు ఇరాన్ నౌకల స్వాధీనం



**ముంబయి, ఫిబ్రవరి 17:** అంతర్జాతీయ ఆంక్షలను ఉల్లంఘిస్తూ భారత జలాల్లో అక్రమంగా చమురు రవాణా చేస్తున్న మూడు భారీ ట్యాంకర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమెరికా ఆంక్షల జాబితాలో ఉండి, ఇరాన్‌తో సంబంధాలున్న ఈ నౌకలను ముంబై తీరానికి సుమారు 100 నాటికల్ మైళ్ల దూరంలో అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం వాటిని ముంబై నౌకాశ్రయానికి తరలించారు. స్టెల్లార్ రూబీ, ఆస్ఫాల్ట్ స్టార్, అల్ జఫ్జియాగా గుర్తించిన ఈ నౌకలు, అధికారుల కళ్లుగప్పేందుకు తరచూ తమ గుర్తింపును మార్చుకుంటున్నట్లు తేలింది. సముద్రం మధ్యలోనే ఒక నౌక నుంచి మరో నౌకకు చమురును బదిలీ (షిప్‌టుషిప్ ట్రాన్స్‌ఫర్) చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఆంక్షల నుంచి తప్పించుకోవడానికే విదేశాల్లో ఉన్న యజమానులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. భారత్‌అమెరికా సంబంధాలు మెరుగుపడుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను తగ్గించుకోవడానికి అంగీకరించిన వెంటనే, అమెరికా భారత వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ సంబంధిత నౌకలపై భారత్ కఠినంగా వ్యవహరిస్తోందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ మూడు ట్యాంకర్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఇరాన్‌కు చెందిన నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ ఘటనతో అప్రమత్తమైన భారత కోస్ట్ గార్డ్ తీరప్రాంత గస్తీని కట్టుదిట్టం చేసింది. ప్రస్తుతం 55 నౌకలు, 12విమానాలతో నిరంతర నిఘా కొనసాగిస్తోంది.



## ఎప్‌స్టీన్‌తో నాస్నేహంలో దాచుకోవాల్సిందేమీలేదు..

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 18:** అమెరికానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎప్ స్టీన్ ఫైల్స్ సృష్టించిన సంచలనం తెలిసిందే. దేశాధినేతలు, మాజీలు, ప్రపంచ కుబేరుల పేర్లు బయటపడడంతో, వారితో ఎప్ స్టీన్ కు ఉన్న రహస్య స్నేహాన్ని ఈ ఫైల్స్ బయటపెట్టాయి. ఎప్ స్టీన్ సొంత ద్వీపంలో మహిళలపై జరిగిన ఘోరాలను వెలికితీశాయి. ఈ ఫైల్స్ లో అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ పేరు పలుమార్లు ప్రస్తావనకు రావడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంలో ఎప్పటికప్పుడు ట్రంప్ వివరణ ఇస్తూ వస్తున్నారు. తాజాగా మరోమారు ఎప్ స్టీన్ ఫైల్స్ వ్యవహారంపై ఆయన స్పందించారు. జెఫ్రీ ఎప్ స్టీన్ తో తన స్నేహం విషయంలో దాచుకోవాల్సిన రహస్యాలు ఏవీ లేవని తేల్చిచెప్పారు. తాను ఎలాంటి తప్పుడు పనులు చేయలేదని వివరణ ఇచ్చారు. ఈ విషయంలో తనకు కోర్టు కూడా క్లీన్ చీట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఎప్ స్టీన్ ఫైల్స్ బయటపెట్టింది తమ ప్రభుత్వమేనని ట్రంప్ చెప్పారు. ఎప్ స్టీన్ డెమోక్రాటిక్ పార్టీ సభ్యుడని, ఆయనతో రిపబ్లికన్లకు ఎలాంటి రహస్య బంధాలు లేవని స్పష్టం చేశారు. మాజీ అధ్యక్షుడు క్లింటన్ సహా పలువురు డెమోక్రాటిక్ నేతలకే ఎప్ స్టీన్ తో రహస్య బంధాలు ఉన్నాయని, ఈ విషయం అందరికీ తెలిసిందేనని ట్రంప్ చెప్పుకొచ్చారు.

## సలీమ్‌ఖాన్‌కు అస్వస్థత: లీలావతి ఆసుపత్రికి తరలింపు



**ముంబయి, ఫిబ్రవరి 17:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ తండ్రి సలీమ్ ఖాన్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయన్ను లీలావతి ఆసుపత్రిలో చేర్పించారు. వృధాప్య సమస్యలతోపాటు ఇటీవలి కాలంలో తరచూ వైద్యపరీక్షలు కూడా చేయించుకున్నారు. గత ఏడాది నవంబరులోనే సలీమ్ ఖాన్ 90వ పుట్టినరోజు వేడుకలు రుపుకున్నారు. తొలుత హిందీసినిమాల్లో సహనటుడుగా వ్యవహరించిన సలీమ్‌ఖాన్ 1950 ప్రాంతంలోనే ముంబయికి మకాం మార్చారు. ఆయన నటనా కెరీర్‌పరిమితే అయితే రచనా పటిమతో ఆయన వెలుగులోకి వచ్చారు. 1960లలో సలీమ్‌ఖాన్ జావేద్ అఖ్తర్‌తో కలిసి సలీమ్ జావేద్‌గా బహుముఖ ప్రాచుర్యం పొందారు. 1971, 1982 మధ్య కాలంలో వాణిజ్యపరంగా అనేక విజయవంతమైన సినిమాలకు స్క్రిప్ట్‌రాసారు. అందాజ్, సీతా ఔర్‌గీతా, జంజీర్, యాదోంకి బారాత్, దీవార్, షోలే, త్రిశూల్, డాన్, కాలాపత్తర్ వంటి సినిమాలు బాక్సాఫీస్ హిట్‌గా నిలిచాయి. అమితాబ్ వంటి నటుల కెరీర్‌నుసైతం మలుపు తిప్పాయి. భాగస్వామ్యం ముగించి 1980నుంచి సలీమ్‌ఖాన్ స్వతంత్రంగా సినిమాలకు కథలు రాసారు.

## ఆ కుర్చీకి రాహుల్ గాంధీ అనర్హులు: నవజ్యోత్‌కౌర్ సిద్ధూ



**చైన్నై, ఫిబ్రవరి 17:** కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన పంజాబ్ మాజీ ఎమ్మెల్యే నవజ్యోత్ కౌర్ సిద్ధూ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీలో ఏం జరుగుతుందో తెలియని వ్యక్తి నాయకత్వ పదవిలో కూర్చో వడానికి అనర్హుడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డుతున్నారనే ఆరోపణలతో ఏఐసీసీ పంజాబ్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ భూపేష్ బఘేల్, ఈనెల 6న నవజ్యోత్ కౌర్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. పంజాబ్ సీఎం కావాలంటే రూ.500 కోట్ల సూట్‌కేస్ అవసరమంటూ ఆమె గత ఏడాది డిసెంబర్‌లో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మొదట సస్పెండ్ చేసి, ఆ తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసు కున్నారు. మంగళవారం కోయంబత్తూరులో మీడియాతో మాట్లాడిన ఆమె రాహుల్ వాస్తవ పరిస్థితులకు దూరంగా ఒక స్వయం నిర్మిత స్వర్గంలో బతుకుతున్నారని విమర్శించారు. మీ కింద ఏం జరుగుతుందో మీకు తెలియకపోతే, క్షమించండి మీరు ఆ కుర్చీకి అర్హులు కారని ఆమె వ్యాఖ్యానించారు. రాహుల్ చుట్టూ ఉన్న కోటరీ ఎన్నికల టికెట్లను ముందుగానే అమ్మేసుకుంటోందని, నిజాయతీపరుల మాట వినే సమయం ఆయనకు లేదని ఆరోపించారు. బహిష్కరణ అనంతరం సోషల్ మీడియాలో రాహుల్‌ను ఉద్దేశించి పప్పు అంటూ వివాదాస్పద పోస్ట్ చేసిన కౌర్, ప్రధాని మోదీ పనితీరును ప్రశంసించడం గమనార్హం. అయితే, తన భార్య వ్యాఖ్యలు, బహిష్కరణపై కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న ఆమె భర్త నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఇప్పటివరకు మౌనంగానే ఉండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## ఇమ్రాన్‌కు మెరుగైన చికిత్స అందించాలి..

### పాక్‌ప్రభుత్వానికి అంతర్జాతీయ క్రికెటర్ల అల్టిమేటమ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** జైలు జీవితం గడుపుతున్న ఇమ్రాన్ కంటిచూపు 85శాతం కోల్పోవడంతో ప్రభుత్వవైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్వదేశంలోనే కాకుండా విదేశాల నుంచి కూడా పాక్‌ప్రభుత్వానికి విజ్ఞప్తులు పెరుగుతున్నాయి. తాజాగా భారత్‌క్రికెటర్లు కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్ సహా 14 మంది అంతర్జాతీయ మాజీ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రభుత్వం, ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు సంతకాలతో కూడిన ఒక పిటిషన్ పంపించారు. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ రావల్పిండి జైలులో ఉన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందన్న క్రమంలో మెరుగైన వైద్య చికిత్స అందించాలని వారు ఈ లేఖలో కోరారు. ఇమ్రాన్ ఖాన్ కుడి కన్ను చూపు 85 శాతం కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. రావల్పిండి జైల్లో ఉన్న సిబ్బంది ఆయన పట్ల అమానవీయంగా ప్రవర్తి స్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జైలు గదిలో సుదీర్ఘ కాలంగా ఒంటరిగా ఉండటంతో కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని సమాచారం. పాకిస్థాన్ సుప్రీంకోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఇవి వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీంకోర్టు ఆయనకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఈ అంతర్జాతీయ మాజీ కెప్టెన్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ ఖాన్ కు చట్టపరంగా అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని వారు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు రాసిన లేఖపై గ్రెగ్ చాపెల్, బెలిండా క్లార్క్, మైఖేల్ అథర్టన్, నాజర్ హుస్సేన్, సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, ఇయాన్ చాపెల్, అలన్ బోర్డర్, మైఖేల్ బ్రియర్లీ, డేవిడ్ గోవర్, కిమ్ హ్యూస్, క్లైవ్ లాయిడ్, స్టీవ్ వా, జాన్ రైట్ సంతకాలు చేశారు. పాకిస్థాన్ మాజీ కెప్టెన్లు ఎవరూ ఈ పిటిషన్‌పై సంతకం చేయకపోవడం గమనార్హం. గత వారం, వసీం అక్రమ్, వకార్ యూనిస్, షాహిద్ అఫ్రిది సహా పలువురు పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియా ద్వారా ఇమ్రాన్‌కు సరైన వైద్య సంరక్షణ అందించాలని అధికారులను కోరారు.

## సంక్షిప్తంగా..


### వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాలు: కన్నడ నటి ఫిర్యాదు

**బెంగళూరు, ఫిబ్రవరి 17:** వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాలు అమర్చి, అదృశ్యాలతో తనను బ్లాక్‌మెయిల్ చేశారంటూ ఓ కన్నడ నటి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం ఇటీవల బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో సెలబ్రిటీ విమెన్ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. మూడురోజులపాటు జరిగిన ఆ మ్యాచ్‌లకు నటి హాజరయ్యారు. ఆ టోర్నీలో భాగంగా రెండోరోజు స్టేడియంలోని రెస్ట్ రూమ్‌ను ఉపయోగించారు. అక్కడ ఎవరో రహస్యకెమెరాలు పెట్టి, అశ్లీల వీడియోలు తీశారు. ఈ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆ విషయం తెలిసింది. డబ్బు ఇవ్వకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులు వచ్చాయి అంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

### సందర్శకులకు క్షమాపణలు చెప్పిన కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఎఐ ఇంపాక్ట్ సదస్సులో సరైన సౌకర్యాలు లేకపోవడంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలిరోజు సందర్శకులు భారీగా రావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ క్యూలైన్లు, ప్రవేశ ఆలస్యంతో ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై కేంద్ర ఐటిమంత్రి అశ్విన్ వైష్ణవ్ స్పందిస్తూ సదస్సుకు హాజరైన వారికి క్షమాపణలు చెప్పారు. సదస్సు సజావుగా సాగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఎఐసమ్మిట్. ఈ రోజు 70వేల మంది ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. సోమవారం జరిగిన సమిట్‌లో ఎవరైనా సమస్యలు ఎదుర్కొనిఉంటే దానికి ప్రభుత్వం తరఫున క్షమాపణలు కోరుతున్నాం. మీ అభిప్రాయాలను మాతోపంచుకోండి. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి మాబృందం అన్నిచర్యలు తీసుకుంటోందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.



### ఢిల్లీ హైకోర్టులో ఇళయరాజాకు ఝలక్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరాలు దశాబ్దాలుగా సినీ ప్రపంచాన్ని, అభిమా నులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఆయన సొంత పాటలపై హక్కుల కోసం జరుగుతున్న న్యాయస్థానాల్లో పోరు ఇప్పుడు కీలకంగా మారింది. ఢిల్లీ హైకోర్టు తాజాగా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఇళయరాజాకు ప్రతికూలంగా మారాయి. 1976 నుంచి 2001 మధ్య కాలంలో ఇళయరాజా సంగీతం అందించిన 134 సినిమాల ఆడియో హక్కులు ప్రముఖ ఆడియో సంస్థ సరిగమకే చెందుతాయని కోర్టు స్పష్టం చేసింది. నాటి చిత్ర నిర్మాతలు ఈ హక్కులను శాశ్వతంగా సరిగమకు అమ్మేశారని, కాపీరైట్ చట్టం ప్రకారం ఇళయరాజాకు యాజమాన్య హక్కులు లేవని జస్టిస్ తుషార్ రావు గెడేలా తీర్పు ఇచ్చారు. ఈ వివాదం ఎప్ ఇనియా పొన్ నిలవే వంటి ఆల్‌టైమ్ హిట్ సాంగ్‌తో మొదలైంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు ఇళయరాజా అనుమతులు ఇవ్వగా సరిగమ సవాల్ చేసింది. నిర్మాత వద్ద వేతనం తీసుకుని కంపోజ్ చేసిన పాటలపై హక్కులు నిర్మాతకే చెందుతాయి. ఈ క్రమంలో ఆ హక్కులు సరిగమకు బదిలీ అయ్యాయని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై అప్పీల్ చేసే అవకాశాన్ని ఇళయరాజాకు కోర్టు కల్పించింది.

### నటుడు కమల్‌హాసన్ పార్టీకి టార్చ్‌లైట్ గుర్తు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రముఖ సినీ నటుడు కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) రాబోయే పుదుచ్చేరి ఎన్నికల్లో పోటీ చేయడం కోసం భారత ఎన్నికల సంఘం బ్యాటరీ టార్చ్‌లైట్ గుర్తును కేటాయించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్‌ఎం పార్టీ టార్చ్‌లైట్ గుర్తుతో బరిలోకి దిగనుంది. తమకు టార్చ్‌లైట్ గుర్తు వచ్చిం దని, ఈ గుర్తుపై పుదుచ్చేరిలో పోటీ చేస్తామని పార్టీ ఎంఎన్‌ఎం పార్టీ మీడియా విభాగం ప్రక టించింది. తమిళనాడులో జరగనున్న ఎన్నికల కోసం ఇంతకుముందే టార్చ్‌లైట్ గుర్తును ఎన్నికల సం ఘం కేటాయించింది. ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజ కీయ పార్టీలు గుర్తుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఇటీవల కోరిన విషయం తెలిసిందే.

### పుత్రశోకంతో దంపతుల ఆత్మహత్య

**నయారాయ్‌పూర్, ఫిబ్రవరి 17:** కుమారుడు మరణించాడన్న పుట్టెడు దుఃఖాన్ని తట్టుకోలేక ఓ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. తమ కుమారుడు లేని ఈ లోకంలో తాము ఉండలేమంటూ సూసైడ్ నోట్, వీడియో సందేశం రికార్డు చేసి ప్రాణాలు తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జంజ్‌గిర్‌చంపా జిల్లాలో వెలుగుచూసిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా కలకలంరేపింది. దర్దేయి గ్రామానికి చెందిన కృష్ణ పటేల్ (48), రమాబాయి పటేల్ (47) దంపతులకు ఆదిత్య పటేల్ (21) అనే ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు. 2024లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆదిత్య మరణించాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లోని వేప చెట్టుకు ఒకే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.


### బెయిల్ వచ్చినా జైలులోనే రాజ్‌పాల్ యాదవ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** చెక్‌బౌన్స్ కేసులో తిహార్‌జైలులో ఉన్న నటుడు రాజ్ పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవాఈరం మధ్యంతరబెయిల్ మంజూరు చేసినప్పటికీ ఇంకా అతడు జైలులోనే ఉన్నాడు. బెయిల్‌కు సంబంధించి డాక్యుమెంట్ వర్క్ పూర్తి కాకపోవడంతో రాజ్‌పాల్ యాదవ్ జైలులోనే ఉండాల్సి ఉంటుంది. రాజ్‌పాల్ యాదవ్ రూ.9కోట్ల చెక్ బౌన్స్ కేసులో ఇటీవల ఢిల్లీ పరిధి, తిహార్ జైలులో లొంగిపోయాడు. అతడికి బాలీవుడ్ సినీ ప్రముఖులు, పలువురు రాజకీయనాయకులు సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో కొంతనగదు జమఅయింది. ఇదే సమయంలో అతడి మేనకోడలు వివాహం జరగాల్సి ఉండగా అతడు ఈ పెళ్లికి హాజరయ్యేందుక మధ్యంతర బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.

## ప్రియురాలిని చంపేసి ఆత్మలతో మాట్లాడాలని యత్నం

### ఇండోర్‌లో వెలుగుచూసిన శాడిస్టు ప్రియుడి బాగోతం



**ఇండోర్, ఫిబ్రవరి 17:** పెళ్లి విషయంలో గొడవ జరగడంతో క్షణికావేశంలో తన ప్రియురాలిని చంపేశాడో ప్రియుడు. కోపం చల్లారాక తన ప్రియురాలితో మాట్లాడాలని భావించి, తన ఆత్మను పిలవాలని అనుకున్నాడు. తనకు తాంత్రిక విద్యలు రాకపోయినప్పటికీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి ప్రియురాలి ఆత్మను పిలిచేందుకు యత్నించాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇండోర్‌లోని ద్వారకపూరి ప్రాంతంలోని ఓ ఫ్లాట్‌లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఈనెల 13వ తేదీన ఇరుగుపొరుగువాసులు పోలీసులకు సమాచారం అందించారు. ఫ్లాట్ తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా నగ్నంగా బెడ్‌పై పడి ఉన్న యువతి మృతదేహాన్ని గుర్తించారు. మెడ చుట్టూ తాడుతో బిగించినట్లుగా ముద్రలు కనిపించాయి. యువతిని గొంతు నులిమి హత్య చేసినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. యువతి హత్యకు ముందు ఆమెపై లైంగిక దాడి చేశాడని ఆ తర్వాత తాడుతో కాళ్లు, చేతులు కట్టేసి గొంతు నులిమి చంపేసినట్లుగా అనుమానిస్తున్నారు. మరోవైపు యువతి తండ్రి తన కూతురు కనిపించడం లేదని ఈనెల11వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 10వ తేదీన ఆమెను ఇండోర్ కలెక్టరేట్ సమీపంలో దింపి వెళ్లానని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని తెలిపారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఆమె ఫోన్ నుంచి నాన్నకు చెప్పండి నేను ఇంటికి రానని ఓ మెసేజ్ కుటుంబసభ్యులకు వచ్చింది అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని చెప్పారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ద్వారకపూరి ప్రాంతంలో ఆమె మృతదేహం కనిపించింది. మృతదేహం లభించిన ఫ్లాట్‌ను యువతితో కలిసి చదువుకున్న పీయూష్ ధామ్మోడియా అనేయువకుడిదిగా పోలీసులు గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీ సులు ముంబైలో అతన్ని పట్టుకున్నారు. పీయూష్‌ను విచారించగా వాళ్లిద్దరూ కొంత కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలిపాడు. తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని పేర్కొన్నాడు. ఈ క్రమంలో రీసెంట్‌గా గొడవ జరగడంతో క్షణికావేశంలో చంపేశానని అనంతరం భయంతో ఇండోర్ నుంచి పారిపోయినట్లుగా చెప్పాడు. హత్య అనంతరం భయంతో నిందితుడు మహారాష్ట్రలోని పన్వేల్‌కు వెళ్లి హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. హత్య అనంతరం తన ప్రియురాలితో మాట్లాడేందుకు ఆత్మను పిలవాలని అతను ప్రయత్నించాడని పేర్కొన్నారు. ఇందుకోసం యూట్యూబ్‌లో ఆత్మలను పిలిచే విధానాలపై వీడియోలు చూసి, ప్రయత్నించాడు. యువతిఇతరులతో మాట్లాడుతున్నదని పీయూష్ అనుమానించే వాడని దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. ఇద్దరి వ్యక్తిగత వీడియోలు కాలేజీ వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ అయ్యాయని యువతి వాట్సాప్ స్టేటస్‌గా కూడా వీడియోలను అప్‌లోడ్ చేసినట్లుగా గుర్తించారు. దీనిపై ఇండోర్ డీసీపీ కృష్ణలాల్ చందానీ మాట్లాడుతూ.. నిందితుడిని ముంబైలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. వారి పెళ్లిపై ఇరు కుటుంబాలు అభ్యంతరాలు తెలపడంతో పాటు, యువతిపై పీయూష్ అనుమానం పెంచుకోవడంతో తరచూ గొడవలు జరిగేవని వాటివల్లే హత్య చేసి ఉంటాడని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజీ, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.



# నరసాపురం బైపాస్ కేసులో సుప్రీం కీలక తీర్పు

## ● ఎన్‌హెచ్ 216 బైపాస్‌కు తొలగిన న్యాయపరమైన అడ్డంకులు ● ఫలించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కృషి

నరసాపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: నరసాపురం పట్టణ ప్రజల దశాబ్దాల కల అయిన ఎన్ హెచ్ 216 బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఉన్న ప్రధాన న్యాయపరమైన అడ్డంకి తొలగిపోయింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం బైపాస్ పనులపై ఒక భూయజమాని దాఖలు చేసిన పిటిషన్‌ను గౌరవ సుప్రీంకోర్టు కొట్టివేసింది. మొత్తం 22.17 కిలోమీటర్ల పొడవున్న ఈ బైపాస్ రోడ్డులో ఇప్పటికే 96 భూసేకరణ పూర్తయ్యింది. కేవలం 750 మీటర్ల (3.38) భూమికి సంబంధించి మాత్రమే గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2023లో టెండర్లు పిలవగా, ల్యాండ్ ఓనర్ కోర్టును ఆశ్రయించారు. గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ నేషనల్ హైవే అథారిటీకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే, ఆ తీర్పుపై పిటిషనర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడంతో గత రెండేళ్లుగా ఈ కేసు పెండింగ్‌లో ఉంది. జిల్లా అభివృద్ధి ధ్యేయంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపారు. ఆయన ఢిల్లీలో అధికారులు, అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి తోపాటు సీనియర్ న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశమై అందరినీ సమన్వయం చేశారు. దీంతో సెప్టెంబర్ 2025లో ఈ కేసు మొదటిసారిగా విచారణకు వచ్చింది. అప్పటినుంచి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ సీనియర్ న్యాయవాదులు, అధికారులతో పలుమార్లు ఈ కేసు పురోగతిపై చర్చలు జరిపారు. కేంద్రమంత్రి తీసుకున్న ఈ చొరవతో కేసు త్వరగా విచారణకు పూర్తి చేసుకొని మంగళవారం సుప్రీంకోర్టులో తుది తీర్పు వెలువడింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పిటిషనర్ అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వ్యక్తిగత అభ్యంతరాల కంటే మెజారిటీ ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నరసాపురం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటివరకు ఉన్న న్యాయపరమైన ఇబ్బందులు తొలగిపోయాయని,త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని స్థానిక నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# పలాసలో ఏప్రిల్‌కు ఆర్‌ఓబి పూర్తి

## ● జూన్ నుండి కేంద్రీయ విద్యాలయ తరగతులు ● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం శ్రీకాకుళం జిల్లాలోని పలాస పట్టణంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 9 గంటలకు పలాస చేరుకున్న కేంద్ర మంత్రి తొలుత రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వంతెన పనులను సమీక్షించారు. ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి ప్రస్తుత స్థితిని ఆరా తీశారు. పనుల్లో ఆలస్యం జరుగుతోందని, రేయింబవళ్ళు పనులు జరగాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. రైల్వే వంతెనతో పాటు ఆనుకుని సర్వీసు రోడ్డు పనులు కూడా వేగంగా జరపాలని తెలిపారు. అనంతరం అక్కడి నుండి పలాసలోని నెమలికొండ ప్రాంతాలలో త్వరలో నిర్మాణం జరగనున్న కేంద్రీయ విద్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భవనాలు నిర్మాణం జరిగే తీరును ప్రాజెక్టు రిపోర్టు ద్వారా కేంద్ర మంత్రికి కలెక్టర్, ఆర్డీవో వివరించారు. పాఠశాలకు అనుసంధానం అయ్యే రోడ్లు, ఇతర మౌళిక వసతులను ఆరా తీశారు. అక్కడి నుండి పలాస పట్టణంలోని రైల్వే కాలనీలో బారక్ భవనాలను పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరం తరగతులను ఈ భవనాలు నుండి జరపాలని నిర్ణయించిన నేపథ్యంలో రైల్వే అధికారులతో గదుల అప్పగింతపై అనుమతుల సమస్యను పరిష్కరించారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ ఏడాది తరగతులు పక్కగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. పలాస పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వాసుల ఎన్నో ఏళ్ల కల అయిన, పలాస ఆర్ఓబి ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా నిర్మాణం జరుగుతుండటం ఆనందంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. భారతీయ రైల్వే, జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ఆర్‌ఓబి పూర్తయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయని అన్నారు. అలాగే పలాసలో ఏర్పాటు కానున్న కేంద్రీయ విద్యాలయానికి తాజా వివరాలను వెల్లడించారు. రాబోయే విద్యా సంవత్సరం నుండే తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి బారెక్ భవనాలకు సంబంధించిన అనుమతుల సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈ పాఠశాల ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, రెవెన్యూ, రైల్వే అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

### పలాస అభివృద్ధికి 'శక్తిత్రయం'

పలాస కాశీబుగ్గ నియోజకవర్గ భవిష్యత్తును బంగారు బాట పట్టించేందుకు ముగ్గురు నాయకులు 'శక్తిత్రయం'గా ముందుకు సాగుతున్నారు. కేంద్ర మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు అందిస్తున్న అండ, ఎమ్మెల్యేగా గౌతు శిరీష చేస్తున్న అవిశ్రాంత పోరాటం, వారికి వారధిగా నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అందిస్తున్న సహకారం. ఈ త్రిముఖ వ్యూహంతో పలాస అభివృద్ధి నేడు పరుగులు పెడుతోంది. నియోజకవర్గ ప్రజలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నది ఎమ్మెల్యే గౌతు శిరీష ఆశయం. ఆ ఆశయ సాధన కోసం ఆమె చేసిన నిరంతర కృషి ఫలితంగానే పలాసకు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సూది కొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతినిధిగా, నియోజకవర్గ సమన్వయకర్తగా యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆశయాలను క్షేత్రస్థాయిలో ముందుకు నడిపిస్తూ, ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రికి వివరించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేని సమయాల్లో కూడా, నియోజకవర్గ బాధ్యతలను తన భుజాలపై వేసుకొని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వెంకన్న చౌదరి వ్యవహరిస్తున్న తీరు ఆయన చిత్తశుద్ధికి, బాధ్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

పలాస ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి సమస్య పరిష్కారం ఈ ముగ్గురు నాయకుల సమష్టి విజయానికి ప్రబల నిదర్శనం. భార్యాభర్తలైన శిరీష, వెంకన్న చౌదరిలు నియోజకవర్గాన్ని తమ కుటుంబంలా భావించి అహర్నిశలు శ్రమిస్తుంటే, వారికి పెద్దన్నలా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అండగా నిలవడం పట్ల పలాస కాశీబుగ్గ ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ త్రయం నాయకత్వంలో తమ ప్రాంతం అభివృద్ధికి కొత్త చిరునామాగా మారుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# స్థానిక భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలి

## - ఫ్యాబ్ ఏఐ ఎడ్యుటెక్ డైరెక్టర్ రొమానా క్రోపిలోవా

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: మధ్య ఆదాయ దేశాల్లో విద్యలో తీసుకొచ్చిన కొన్ని ఏఐ సాధనాలు విఫలమవుతున్నాయని ఫ్యాబ్ ఏఐ ఎడ్యుటెక్ డైరెక్టర్ రొమానా క్రోపిలోవా తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంప్యాక్ట్ సమ్మిట్‌లో ఆమె మాట్లాడుతూ గత రెండేళ్లలో 10 వేల యాప్‌ల వరకు వచ్చాయి. ప్రాథమిక పెడగాగి పరీక్షల్లో 70% వరకు విఫలమవుతున్నాయి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉండడం లేదు. కొన్ని ఏఐ టూల్స్ సాధారణ కంటెంట్‌లను మాత్రమే అందిస్తున్నాయి. ఫ్యాబ్ ఏఐలో వందల ఏఐ యాప్‌లను మదింపు చేశాం. ఏఐ టూల్స్ బహుబాషలకు అనుకూలంగా ఉండాలి. భారత్‌లో అనేక భాషలు ఉన్నాయి. ఆంగ్ల భాషకు అనుకూలంగా ఉన్న ఏఐ ట్యూటర్ గ్రామీణ విద్యార్థుల్లో 60% మందికి ఉపయోగపడడం లేదు. మేము స్థానిక భాషల మధ్య సులభంగా తర్జుమా జరిగేలా మోడల్స్‌ను రూపొందించాం. ఇన్నోవేషన్ ల్యాబ్‌లు ఉండాలి. కానీ ,తరగతి గదే ప్రధానమైన అభ్యసన కేంద్రం అని తెలిపారు. ఏఐని ఉపయోగించుకుంటూ టైమ్ ఆధారిత రక్షిత జోన్ల విధానాన్ని అమలుచేసే రెడ్‌లైన్ ప్రాజెక్టుపై ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో నోరా అనే విద్యార్థి ప్రజలంటేషన్ ఇచ్చారు. ఇది రహదారులపై రద్దీని అంచనా వేస్తూ 30 నిమిషాల ముందే తల్లిదండ్రుల్ని అప్రమత్తం చేస్తుంది. ఢిల్లీలో డైనమిక్ ట్రాఫిక్ సిగ్నల్, టైమింగ్, ఐఓటి సెన్సర్లు, జీపీఎస్ ఇంటిగ్రేషన్‌తో పనిచేస్తుంది. దీని ద్వారా పిల్లల్ని త్వరగా పాఠశాలలకు తీసుకెళ్లవచ్చు. ట్రాఫిక్ రద్దీ 60% తగ్గించవచ్చు. అత్యవసర వాహనాలు 2.5రెట్లు వేగంతో పాఠశాలలకు చేరుకోవచ్చు. వాహనాల నుంచి వెలువడే శబ్ద కాలుష్యాన్ని 40% తగ్గించవచ్చు. పిల్లల భయం లేకుండా పాఠశాలలకు వెళ్లొచ్చు. ఈ విధానంపై తల్లిదండ్రుల నుంచి 85% సంతృప్తి వ్యక్తమైందని నోరా వివరించారు.



# స్మార్ట్ మీటర్లపై అపోహాలు వద్దు

## 'కరెంటోళ్ళ జనబాట'లో ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

తిరుపతి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహాలు వద్దని ఎస్పీడీసీఎల్ సిఎండిశివశంకర్ లోతేటి వివరించారు. విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా కొనసాగుతున్న 'కరెంటోళ్ళ జనబాట' కార్యక్రమంలో భాగంగా ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం తిరుపతి జిల్లాలోని రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్న రెడ్డప్ప, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చలపతితో కలిసి బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కొత్తపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో విద్యుత్ పునర్వ్యవస్థీకరణ పంపిణీ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద పూర్తయిన పనులను పరిశీలించారు. విద్యుత్ సరఫరా తీరుపై వినియోగదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం సిఎండి లోతేటి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకునేందుకు వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల ఉపయోగాలను వినియోగదారులకు వివరించారు. భవిష్యత్తు స్మార్ట్ మీటర్లదేనని స్పష్టం చేశారు. అలాగే రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చని సూచించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పించేందుకు విద్యుత్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిఎండి శివశంకర్ తెలిపారు.



# ప్రకృతి వ్యవసాయంతో లాభాలపంట

## పశ్చిమ గోదావరి జిల్లా కొనితివాడ యువ రైతు చవ్వాకుల రవికుమార్ విజయగాథ

భీమవరం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, కొనితివాడ గ్రామానికి చెందిన యువ రైతు చావుకుల్ల రవికుమార్ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి ఆదర్శ రైతుగా నిలుస్తున్నారు. సుమారు 8 సంవత్సరాలుగా ప్రకృతి పద్ధతుల్లో సాగు చేస్తూ, తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించి గ్రామంలోని ఇతర రైతులకు ప్రేరణగా మారారు. రసాయనిక వ్యవసాయంతో పెరుగుతున్న ఖర్చులు, నేల సారశక్తి తగ్గిపోవడం, కుటుంబ ఆరోగ్య సమస్యలు వంటి కారణాల వల్ల రవికుమార్ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లారు. గ్రామంలోనే జీవామృతం వాడుతూ మంచి ఫలితాలు పొందిన రైతులను చూసి ఆసక్తి కలిగి, వ్యవసాయ శాఖ శిక్షణా శిబిరాల్లో పాల్గొని సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, జీవామృతం తయారీ, బహుళ పంటల సాగు, పశుపోషణ అనుసంధానం వంటి అంశాల్లో అవగాహన పొందారు. అనంతరం చిన్న స్థాయిలో ప్రారంభించి, ప్రస్తుతం పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వరి, మునగ, బెండ, వంకాయ, టమోటా, కాబేజీ, క్యాలీఫ్లవర్, పసుపు, కంద, పాలకూర, గోంగూర, కొత్తిమీర వంటి పలు కూరగాయలు పంటలను బహుళ పంటల విధానంలో రవికుమార్ సాగు చేస్తున్నారు. విత్తన శుద్ధి కోసం బీజామృతం, పంటల పోషణకు ద్రవ మరియు ఘన జీవామృతం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి సహజ ద్రావణాలను వినియోగిస్తున్నారు. అలాగే బ్లూ ట్రాప్స్, లింగాకర్షక బుట్టలు వంటి పద్ధతులతో సహజ పురుగు నియంత్రణ చేపడుతున్నారు. ప్రస్తుతం సుమారు 1.5 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, తన ఎన్‌పిఎం షాప్ ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకం చేస్తూ 2024-25 సంవత్సరంలో మొత్తం రూ.2,15,250 ఆదాయం పొందగా, నికర లాభం రూ.1,71,750 సాధించారు. ఖర్చులు తగ్గడం, నేల ఆరోగ్యం మెరుగుపడటం, పంట నాణ్యత పెరగడం వంటి ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. నేలలో జీవజాలం పెరగడం, నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడడం వల్ల పంటలు ఆరోగ్యంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మార్కెటింగ్ విషయంలో రవికుమార్ నేరుగా వినియోగదారులకు ఉత్పత్తులను అందించే విధానాన్ని అనుసరిస్తున్నారు. రైతు బజార్లు, కిసాన్ అంగడులు, వాట్సాప్ గుంపులు, వ్యక్తిగత పరిచయాల ద్వారా ప్రకృతి పద్ధతిలో పండించిన వరి, కూరగాయలు, ఇతర ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తుల వల్ల వినియోగదారుల విశ్వాసం పెరిగి, స్థిరమైన మార్కెట్ ఏర్పడింది. భవిష్యత్తులో స్వంతంగా ప్రకృతి ఉత్పత్తుల స్టోర్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.గ్రామ స్థాయిలో "ఉత్తమ రైతు"గా, చౌదరి చరణ్ సింగ్ అవార్డ్ పొందిన



రవికుమార్ ఇతర రైతులకు కూడా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ప్రేరణనిస్తున్నారు. "రసాయనిక వ్యవసాయం నేల జీవాన్ని తగ్గిస్తే, ప్రకృతి వ్యవసాయం భూమికి మళ్లీ జీవం ఇస్తుంది. నా కుటుంబ ఆరోగ్యం, నేల ఆరోగ్యం మెరుగుపడటమే నా పెద్ద విజయంగా భావిస్తున్నాను" అని ఆయన అన్నారు. ప్రకృతి వ్యవసాయం తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత గల పంటలను అందించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని రవికుమార్ విజయగాథ మరోసారి నిరూపిస్తోంది.



# నేటి నుంచి కొల్లేటి పెద్దింట్లమ్మ జాతర

## తెలంగాణ బోనాల తరహాలో మొక్కులు

ఏలూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త బ్యూరో: ఆంధ్రప్రదేశ్ మానవ సరోవరంగా పిలుచుకునే కొల్లేరు సరస్సు మధ్యలో కొలువున్న కొల్లేటి మహా పట్టమనిషి పెద్దింట్లమ్మ జాతర ఈరోజు ప్రారంభం కానుంది. ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోటలో పూర్వ వేంగి చాళుక్యుల కాలం నుంచి పూజలు అందుకుంటున్న పెద్దింటి అమ్మవారు కొల్లేటి పెద్దింట్లమ్మగా ప్రాచుర్యం చెందారు. ప్రతి యేటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకు జరగనున్న ఈ జాతరలో జిల్లా నుంచే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది ప్రజలు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఈనెల 18వ తేదీ నుంచి మార్చి మూడు వరకు అమ్మవారి జాతర (తీర్థం) నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే చలువ పందిళ్లు ఏర్పాటు చేయగా దాతల సాయంతో నిర్మించిన అతిపెద్ద అనివేటి మండపం ఆకర్షణీయంగా మారింది. కొల్లేటి సరస్సు మధ్యలో కోట దెబ్బపై పెద్దింట్లమ్మవారు తొమ్మిది అడుగుల ఎత్తులో విశాల నేత్రలతో వీరాసన భంగిమలు భక్తులకు దర్శనమిస్తారు. కాలంతో పాటు కొల్లేటి కోటలు మాయమైనప్పటికీ అమ్మవారి విగ్రహం చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. పెద్దింట్లమ్మ వారిని కృష్ణాజిల్లా ఏలూరు జిల్లా పశ్చిమగోదావరి జిల్లా వారు తమ కులదైవంగా ఆరాధిస్తారు. తెలంగాణ బోనాల తరహాలో కొల్లేరు పెద్దింట్లమ్మ వారికి భక్తులు బోనాలు సమర్పిస్తారు. తెలంగాణలోని ఉజ్జయిని మహంకాళి, మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, సమ్మక్క సారక్కలకు బోనాలు సమర్పించినట్లు అమ్మవారికి కూడా ఏడు కావిళ్ళలో అమ్మవారికి నైవేద్యంగా పసుపు, కుంకుమ, నెయ్యి, వేప, రొట్టెలు నిమ్మకాయలు, పానకం, కల్లుతో పెద్దింట్లమ్మ దేవస్థానంకు తీసుకువస్తారు. ఆలయానికి మూడు మైళ్ళ దూరంలోని గోకర్ణేశ్వరపురంలో గోకర్ణేశ్వర స్వామిని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారితో అంగరంగ వైభవంగా కళ్యాణం జరిపిస్తారు. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులను అమ్మవారికి చెల్లిస్తారు. ఈ జాతర కోసం మూడు జిల్లాల నుంచి కొల్లేటికోటకు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో అధికారులు భక్తుల సౌకర్యార్థం వంట ప్రాంగణాలు కోనేరులో నీరు వంటి సదుపాయాలు కల్పించారు.



# చక్రతీర్థ స్నానాలకు పటిష్ట పోలీసు బందోబస్తు

## - భక్తులకు అసౌకర్యం లేకుండా సమగ్ర ప్రణాళిక : ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లాలో జలుమూరు మండలంలో బుధవారం జరగనున్న శ్రీ శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం వారి చక్రతీర్థ స్నానాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. సుమారు 1000 మంది అధికారులు, సిబ్బందితో ప్రశాంతంగా ఉత్సవం నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయబడిందని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి శ్రీముఖలింగం ఆలయం, వంశధార నది మార్గం, స్నానాలు జరిగే ప్రదేశాన్ని కాలినడక ద్వారా సందర్శించి తుది ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులకు పలు ముఖ్య సూచనలు చేశారు. చక్రతీర్థ స్నానాల రోజున స్వామివారి ఉత్సవ విగ్రహాలు వెళ్లే మార్గం, నదిలో స్నాన ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణం, రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాలు, కంట్రోల్ రూమ్ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ఇరువైపులా భారీ రోపు పార్టీలు ఏర్పాటు చేసి, భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బుధవారం జరిగే చక్రతీర్థ స్నానాలకు లక్ష మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తూ, ఆ మేరకు భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇందుకోసం సుమారు వెయ్య మంది సివిల్, ఏ ఆర్, స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా అండ్ ఆర్డర్, హోంగార్డ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. పోలీసు, రెవెన్యూ మరియు ఆలయ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించబడింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ పరిశీలనలో అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, సహాయ (ట్రైనీ) కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీలు వివేకానంద, షేక్ షాహబాజ్ అహ్మద్, లక్ష్మణరావు, గోవిందరావు, శేషాద్రి తదితర పోలీసులు పాల్గొన్నారు.



# 'హనుమాన్'తో మానవ-వన్యప్రాణుల సంఘర్షణ పరిష్కారం

## - అటవీ శాఖ వినూత్న కార్యక్రమం

తిరుపతి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: అటవీప్రాంతం వదలి జనావాసాల్లోకి వన్యప్రాణులు, జంతువులు సంచారం పెరిగిపోతుండటంతో మనుషుల ప్రాణాలను కాపాడటానికి 'హనుమాన్' పేరుతో అటవీశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఈ కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీ నుండి 28 వరకు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. మానవ వన్యప్రాణుల సంఘర్షణ సమస్యను పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీ శాఖ కొత్తగా వినూత్న 'హనుమాన్' అనే కార్యక్రమాన్ని చేపడుతోందని అటవీశాఖ అధికారి సాయిబాబా తెలిపారు. అటవీశాఖలోని ఆయా ప్రాంతాల్లోని ఆ శ్రేణిలో ఉన్న రేంజ్ అధికారి నేతృత్వంలో వేగవంతమైన ప్రతిస్పందన బృందాలు ఏర్పాటు చేశారు. తిరుపతి సర్కిల్‌లో తిరుపతి, పనపాకం, భాకరాపేట, శ్రీకాళహస్తి, ఏర్పేడుతోబాటు పుత్తూరు రేంజ్‌లలో మానవవన్యప్రాణుల సంఘర్షణను పరిష్కరించడానికి రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేస్తారు ప్రతి బృందంలో ఒక సెక్షన్ ఆఫీసర్, ఒక బీట్ ఆఫీసర్, ఇద్దరు ఫారెస్ట్ వాచర్లు/ప్రొటెక్షన్ వాచర్లు, అటవీశాఖ రేంజర్ నేతృత్వంలో ఒక ప్రొటెక్షన్ వాచర్ ఉంటారు. మానవ వన్యప్రాణుల సంఘర్షణ కాల్‌లపై ఈ రాపిడ్ రెస్పాన్స్ బృందాలకు ఒక నెల పాటు పనిచేసే అంబులెన్స్ అందించబడుతుందన్నారు. సభ్యులు/ వాచర్లకు పరిస్థితులను ఎలా నిర్వహించాలనేది గ్రామాలలో అవగాహన కల్పించడంపై శిక్షణ ఇవ్వబడుతుందని డిఎఫ్ఒ సాయిబాబా వివరించారు. వాహనంతో పాటు వాకీటాకీలు అందిస్తారు. మంగళవారం జరిగిన ప్రయోగాత్మక పరిశీలనలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానంపై ప్రచారం శూన్యం!

## - అవగాహన కల్పించడంలో టిటిడి అధికారులు నిర్లక్ష్యం



తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యం లో తిరుపతిలో 2021 అక్టోబర్‌లో ప్రారంభిం చిన పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యసేవలు ఇంతింతైవటుదింతై అనే చందంగా విస్తరించాయి. ఈ హృదయాలయంలో గుండె మార్పిడి శస్త్రచికిత్సలతోపాటు గుండె శస్త్ర చికిత్సలు కూడా చేయడం వైద్యరంగంలో ప్రత్యేకతను సంతరించుకుంది. గుండె సమస్య లతో పోరాడుతున్న చిన్నపిల్లలకు ఆశాకిరణం గా, పెద్దలకు కూడా గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. టిటిడి ఆధ్వర్యంలోని ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ నిధులతో ఈ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదువేల వరకు గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించగా 30లోపు గుండె మార్పిడి శస్త్రచికిత్సలు హృదయాలయం వైద్యులు విజయవంతంగా చేశారు. సుమారుగా 20లక్షలు రూపాయలు వ్యయమయ్యే ఈ గుండె శస్త్రచికిత్సలను టిటిడి పద్మావతి హృదయాలయంలో పేదలకు పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. 13నెలల చిన్నారికి గుండె మార్పిడి శస్త్రచికిత్స, గుండెల చిన్నరంధ్రాలున్నా విజయవంతంగా శస్త్రచికిత్సలు చేశారు. ఇవన్నీ కూడా అవయవదానం క్రింద దాతలు చూపిన మార్గమే కారణాలు. అయితే తిరుపతిలో టిటిడి నిర్వహిస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో దానం చేసే గుండె, కాలేయం, ఊపిరితిత్తులు వంటి అవయవదానంపై అవగాహన, ప్రచారం నిర్వహించడంలో టిటిడి అధికారులు వైఫల్యం చెందారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2023వరకు ఈ ఆస్పత్రికి అవసరమైన గుండె మార్పిడి శస్త్రచికిత్సలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి మాత్రమే దాతలు ముందుకు వచ్చారు. అయితే మరింతగా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అవయవదానం చేయడంలో టిటిడి చొరవ చూపడం లేదనేది వ్యాఖ్యలు. 2023లోనే అవయవదానంపై టిటిడి విస్తృత ప్రచారం కల్పించేందుకు అప్పటి టిటిడి బోర్డు నిర్ణయించింది. అయితే ఆ దిశగా కార్యాచరణ అమలు చేయలేకపోయింది. తిరుపతిలో అవయవాలను మార్పిడి చేసే అత్యుత్తమ వ్యవస్థ తిరుపతి స్విమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉండటం, పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో గుండె శస్త్రచికిత్సలు, మార్పిడి వంటి చికిత్సలు విజయవంతంగా వైద్యులు నిర్వహిస్తుండటం జరుగుతోంది. ప్రాణాపాయస్థితిలో (మరణానికి దగ్గరగా) ఉన్న రోగులనుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ వంటి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చే దాతల్లో అవగాహన కల్పించి వారి నుండి అవయవాలను స్వీకరించేలా చూడాలని నిర్ణయించారు. ఎవరైనా అవయవాలను దానంచేస్తే అవసరమైన వారికి కొత్తజీవితాన్ని ప్రసాదించవచ్చని నినాదంతో అప్పట్లో అధికారులు వెల్లడించారు. అయితే అవయవదానంపై అవగాహన కల్పించడంలో ఇప్పటికీ నిర్లక్ష్యం, వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తిరుమల పర్యటనలో సిఎం చంద్రబాబునాయుడు కూడా అవయవదానంపై మరింత అవగాహన పెంచాలని టిటిడి అధికారులకు సూచించారు. అయితే ఆ దిశగా చర్యలు మాత్రం తీసుకోవడంలేదు. టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా చేస్తుండటంతో దాతల నుండి కూడా సహకారం అందుతోంది. ఒక మనిషినుండి దానంచేసే అవయవాలు కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, క్లోమం, కళ్ళు వంటివి ఉన్నాయి. మనిషి బ్రతికున్నపుడే కిడ్నీలు దానం చేయవచ్చని, కొన్ని కేసుల్లో బ్రెయిన్‌డెడ్ తరువాత దానం చేసే అవయవాలు సేకరించి అవసరమైన రోగులకు మార్పిడి చేయవచ్చు. ఇందుకోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటుచేసి ఆయా అవయవాలను ఆస్పత్రులకు త్వరితగతిన తరలింపుకు ప్రభుత్వం కూడా మార్గం సుగమం చేస్తుంది. వయస్సుతో సంబంధం లేకుండా అవయవాల ఆరోగ్యంపై ఆధారపడి దానం చేయవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో అవయవదానంపై అవగాహన కల్పించడానికి టిటిడి అధికారులు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

## బిల్ గేట్స్, బిల్ క్లింటన్‌ల రాకతో ఏం లాభం?




కుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: రాష్ట్రానికి మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, బిల్ క్లింటన్‌ల రాకతో ఏమీ లాభం లేదని కేంద్రమాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. మంగళ వారం కుప్పం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు బిజెపితో జతకట్టారని రెండు కేంద్ర బడ్జెట్‌లలో రాష్ట్రానికి ఏమేర నిధులు వచ్చాయో తెలపాలన్నారు. రాష్ట్రంలోని 12 బస్టాండుల స్థలాలు, తిరుపతి విమానా శ్రయం వద్ద ఉన్న మూడువేల ఎకరాల భూములను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించాలని చూడడం భావ్యం కాదన్నారు. ఎపి బడ్జెట్‌లో ఒబిసిలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. ఫైనాన్స్ కార్పోరేషన్లు ఉన్నా వాటికి నిధులు మంజూరు చేయలేదన్నారు. కుప్పంలో ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. కుప్పానికి విమానాశ్రయం అవసరమా అని ప్రశ్నించారు. సమావేశంలో తిరుపతి సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సమీ ఉల్లా పాల్గొన్నారు.



## ఘనంగా శ్మశాన కొళ్లై పూజలు

కుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: కుప్పం పట్టణంలో స్మశాన కొళ్లై పూజలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాటారు కులస్తులు శ్రీ అంగాళ పరమేశ్వరి అమ్మవారి ఉత్సవాన్ని కొత్తపేటనుంచి స్థానిక స్మశాన వాటిక వరకు మేళతాళాలు, డప్పుల హోరుమధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్మశాన వాటికలో ఏర్పాటుచేసిన స్మశాన కొళ్లై పూజలకు జనం భారీ ఎత్తున హాజరయ్యారు. స్మశానంలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహ ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దక్ష సంహారణ కార్యక్రమం జరిగింది. కాగా ఈ ప్రతిమ మట్టిని తీసుకునేందుకు జనం పోటెత్తారు. కాగా స్మశాన కొళ్లై సందర్భంగా మహిళా భక్తులు ఎముకలు నోట కరచుకుని ఒళ్లు గగుర్పాటు కలిగించారు. ఈ సందర్భంగా దెయ్యాలు, భూతాలు పట్టినవారికి వాటిని వదిలించే కార్యక్రమం చేపట్టారు. పలువురు భక్తులకు అమ్మవారి పూనకం రావడం జరిగింది. స్మశాన కొళ్లై పూజలను తిలకించేందుకు కుప్పం పరిసర ప్రాంతాలనుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అలాగే గంగాపురంలో సైతం స్మశాన కొళ్లై పూజలను ఘనంగా జరిపారు.

## చిన్నారులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి

### - వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆందోళన

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ప్రభుత్వానికి కనిపించడం లేదని, దీనిపై అసెంబ్లీలో ప్రశ్న అడిగితే హోంశాఖ మంత్రి సమాధానం చెప్పలేదని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాల యంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అఘాయిత్యాలకు సంబంధించిన ప్రశ్న ఉత్పన్నం కాదని చెబితే మదనపల్లిలో ఏడేళ్ల చిన్నారిని హత్యచేసి డ్రమ్‌లో కుక్కితే ప్రభుత్వానికి కనిపించడం లేదని అన్నారు. రాష్ట్రంలో రౌడీలు లేకుండా చూస్తానంటున్న సిఎం చంద్రబాబు.. మహిళలను చులకనగా మాట్లాడే వారిని అసెంబ్లీలో తన పక్కన కూర్చోబెట్టుకుంటున్నారని అన్నారు. నేరస్తులందరూ క్యాష్‌ను రాజేష్ ద్వారా పంపిస్తున్నారని పేర్కొన్నారు. శివరాత్రిలోనూ వైసిపి ప్రభలను కట్టకుండా పోలీసులు అడ్డుకుని లైట్లు తీయించేశారని తెలిపారు. నియంత పోకడలు ఎల్లకాలం సాగవని, ప్రతిపక్షంలో ఉండి జీతాలు తీసుకున్న ఎమ్మెల్యేల వివరాలు అడిగితే స్పీకర్ బెదిరించారన్నారు. ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్‌దేనని అన్నారు.



కర్పూరి ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న బిసి నేతలు

## బిసిల రిజర్వేషన్లకు ఆద్యుడు కర్పూరి ఠాగూర్

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: భారతదేశంలో తొలిగా కాంగ్రెసేతర పార్టీ నుంచి ముఖ్యమంత్రి అయిన ఘనత బీహార్ మాజీ ముఖ్యమంత్రి భారతరత్న కర్పూరి ఠాకూర్‌కు చెందుతుందని, అదేవిధంగా ఓబిసిలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత కులాల వారికి కూడా రిజర్వేషన్ ఇవ్వాలని తొలిగా ప్రతిపాదించిన ఘనత కూడా ఆయనకే చెందుతుందని రిటైర్డ్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం.రవీంద్రనాథ్ బాబు వ్యాఖ్యానించారు. కర్పూరి ఠాగూర్ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నవ్యాంధ్ర రాజధానిగా పేరుగాంచిన విజయవాడ నగరంలో కర్పూరి ఠాగూర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. నగర బిసి సంఘం సీనియర్ నాయకులు దాలిపర్తి ధన్వంతరి, సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు బ్రహ్మయ్య, సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్కాపురం కనకారావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పొట్లూరి వెంకటేశ్వరరావు, సంక్షేమ సంఘం నాయకులు రిమ్మనపుడు బ్రహ్మేశ్వర రావు, కనుపర్తి జానకిరావు, తెన్నేటి ప్రకాశరావు, తెన్నేటి సోము తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ జడ్జి ఉత్తర్వులపై దామోదరనాయుడు అప్పీల్

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా తన నియామకాన్ని రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డాక్టర్ టి.దామోదరనాయుడు దాఖలు చేసిన రెండు అప్పీళ్లపై హైకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పూర్తిస్థాయి వాదనలు వినకుండా సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని పేర్కొంది. పదవీవిరమణ చేసిన అధికారులను పునర్నియమించడం వల్ల అర్హులైన అధికారులకు అన్యాయం జరుగుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. సింగిల్ జడ్జి తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సైతం అప్పీలు దాఖలు చేసిందని అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పడంతో అన్ని అప్పీళ్లను కలిపి విచారిస్తామంటూ ఈ నెల 24కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన దామోదరనాయుణ్ని తిరిగి నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక సీఎస్ గతేడాది ఆగస్టు 6న జీవో 285ని జారీ చేశారు. దానిని రద్దు చేయాలని కోరుతూ ఏపీ పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పాముల సత్యకుమారి, ఆ శాఖలోని వివిధ సంఘాల అధ్యక్షులు సీహెచ్‌ఎస్ కృష్ణారావు, కె.సత్యనారాయణ, టి.జయప్రకాశ్ హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి దామోదరనాయుడి నియామకాన్ని తప్పుపడుతూ గత నెల 29న తీర్పిచ్చారు. ఈ తీర్పుపై దామోదరనాయుడు దాఖలు చేసిన అప్పీళ్లు సోమవారం ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి.

# రూ.194 కోట్లతో 100 కొత్త పిహెచ్‌సి భవనాల నిర్మాణం

**● 976 పిహెచ్‌సి భవనాలకు రిపేర్లు చేపట్టాం ● వైద్యసేవల బలోపేతానికి 2500 డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది నియామకం ● వ్యక్తి ఆధారిత సేవల కోసం సంజీవనిని సిఎం తీసుకొచ్చారు ● శాసన మండలిలో మంత్రి సత్యకుమార్ వెల్లడి**



విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో రూ. 194 కోట్ల వ్యయంతో 100 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పిహెచ్‌సిలు) భవనాల నిర్మాణం జరుగుతోందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 1144 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సిలు) పనిచేస్తున్నాయని, వాటికి సొంత భవనాలున్నాయని మంత్రి తెలిపారు. 100 కొత్త పీహెచ్సీల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. శాసన మండలిలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు సంబంధించి పలువురు సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. గ్రామీణ పేదలకు విస్తృతమైన వైద్య సేవల్ని అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్ని పటిష్టం చేశామన్నారు. 976 పిహెచ్సీ భవనాలకు పూర్తి స్థాయిలో రిపేర్లు చేపట్టామన్నారు.

**త్వరలో 110 మంది డాక్టర్ల నియామకం:** గ్రామీణ ప్రాంతాల్లో 1144 పీహెచ్‌సిలు, పట్టణ ప్రాంతాల్లో 560 యుపిహెచ్‌సీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల్ని మరింత చేరువ చేసేందుకు ఇటీవల 2500 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిని నియమించామని, మరో 110మంది డాక్టర్లను త్వరలో నియమించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి సభకు తెలిపారు. వ్యక్తి ఆధారంగా (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు) ముందస్తు ఆరోగ్య సంరక్షణా చర్యల్ని (ప్రివెంటివ్ హెల్త్ కేర్) చేపట్టాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంజీవని కార్యక్రమాన్ని తీసుకొచ్చారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కావాల్సిన సిబ్బంది నియామకానికి టాటా ఎండితోనూ, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం గేట్స్ ఫౌండేషన్ తోనూ ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుందన్నారు. సంజీవని కార్యక్రమం అమలులో భాగంగా సిబ్బంది అందరికీ శిక్షణ ఇచ్చామన్నారు. కొత్తగా 19 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశాం. పీహెచ్సీల్లో అవకాశం ఉన్నచోట శిక్షణ పొందిన డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ ప్రసవాల్ని నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రసవాలు చేసేందుకు అల్ట్రా స్కాన్లు, టిఫా స్కాన్ల అవసరము టుందని, 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సిహెచ్‌సిల్లో) ఇవి జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డును డిజిటలైజ్ చేయాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబిడిఎం) యూనిక్ ఐడిని కూడా క్రియేట్ చేస్తున్నామన్నారు. 25 నెలల్లో 19 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశామని మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. పిహెచ్సీల్లో డయాలసిస్ సెంటర్లు లేవని, సిహెచ్సీల్లోనే ఉన్నాయని మంత్రి సభకు వివరించారు.

## గంట ఆలస్యంగా ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు మంగళవారం గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. సాంకేతిక సమస్య తలెత్తడంతో 9గంటలకు ప్రారంభం కావాల్సిన సభను ఆలస్యంగా ప్రారంభించారు. ఈ అంశంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ... సాఫ్ట్ వేర్ సమస్యే దీనికి కారణమని చెప్పారు. టెక్నికల్ సమస్య వచ్చినప్పుడు ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. వైసీపీ వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారని... గతంలో ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవని... ఇప్పుడు వైసీపీ వాళ్లు వెనక నుంచి గుంతలు తవ్వే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సభకు హాజరుకాని వైసీపీ సభ్యుల గురించి మాట్లాడుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత విధులను సక్రమంగా నిర్వహించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని అన్నారు. సభకు రాకుండా జీతభత్యాలు తీసుకోవడం సరికాదని చెప్పారు. విధులకు హాజరుకాని ఉద్యోగులకు జీతం కట్ చేస్తారని... ఆ నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. చాలా దేశాల్లో రీకాల్ విధానం ఉందని... మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని స్పీకర్ తెలిపారు. సభ్యులు అసెంబ్లీకి రావడమే కాదు..సభలో ఎన్ని గంటలు, నిమిషాలు కూర్చున్నారో కూడా ఈ వ్యవస్థ ద్వారా నమోదవుతోందని తెలిపారు.

## నేటి నుంచి శనగల కొనుగోళ్లు

### - 15 రోజుల లోపు రైతులకు నగదు: మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి



విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తప్రతినిధి: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ అనుమతితో రబి సీజన్ 2025-26లో పండించిన శనగలను ఎన్ఎఎఫ్ఇడి, ఎన్‌సిసిఎఫ్‌ల ద్వారా 94,500 మెట్రిక్ టన్నుల శెనగల కొనుగోళ్లకు ధర మద్దతు పథకం (పిఎస్ఎస్) అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుండి మంగళవారం ఆదేశాలు అందాయని, నేటి నుంచి సిఎం ఎపిపి ద్వారా అన్ని జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఉన్న డిఎల్‌పిసిలు కొనుగోళ్లను పర్యవేక్షిస్తాయని, అవసరమైన మార్గదర్శకాలను ఇప్పటికే జారీ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ తదితర శాఖల సమన్వయంతో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు. పిఎసిఎస్, ఎఫ్‌పిఓలు, స్వయం సహాయక సంఘాలు వంటి విశ్వసనీయ ఉపఏజెన్సీలను రంగంలోకి దింపి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సీజన్‌లో సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగల సాగు జరిగిందని, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉన్నట్లు మంత్రి వివరించారు. రైతులు తమ ఉత్పత్తిని సమీప ఱఱఱఱలలో నమోదు చేసుకోవాలని, దిలీ తిశిశి ద్వారా షెడ్యూల్ ప్రకారం కొనుగోళ్లు చేపడతామని తెలిపారు. కొనుగోలు చేసిన శనగలను సిడబ్ల్యూసి/ ఎస్‌డబ్ల్యూసి గోదాముల్లో నిల్వ చేస్తామని, రైతులకు చెల్లింపులు 15 రోజుల లోపు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.






## మిలన్ 2026కు ముందస్తు విన్యాసాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: విశాఖ సాగరతీరం ఐఎఫ్ఆర్, మిలాన్ 2026 సంసిద్ధమయింది. భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం ఈ వేడుకలను వీక్షించబోతున్నారు. ఆమెతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఫ్లీట్ రివ్యూలో పాల్గొనున్నారు. మంగళవారం ఉదయం ఇప్పటికే 75 దేశాల నుండి వచ్చిన యుద్ధ నౌకలు సముద్రంలో లంగర్ వేసుకుని ఉన్నాయి. వాటిని అధికారుల కుటుంబాలు వీక్షించారు.

మంగళవారం సాయంత్రం ముందస్తు ఎక్స్ సైజ్ నిర్వహించారు. యుద్ధ వాతావరణాన్ని తలపించే విధంగా విన్యాసాలు చేశారు. తూర్పు నౌకాదళం విశాఖలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కోసం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యింది. యుద్ధ నౌకలు, సబ్‌మైరెన్లతో పాటు భారత్‌కు చెందిన యుద్ధ నౌకలు, సీకింగ్స్, హెలికాప్టర్లు ఐఎఫ్ఆర్, మిలాన్‌లో భాగస్వామ్యం అయ్యాయి. అదే విధంగా భారీ యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌తో పాటు భారతీయ నావికాదళ చరిత్రని గుర్తు చేసేలా రూపొందించిన ఐఎన్ఎస్‌వీ కౌండిన్య ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా శివరాత్రి బ్రహ్మోత్సవాల పూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం పాత యాగశాలలో జరిగిన పూర్ణాహుతి ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ ఆధ్వర్యంలో వైదిక కమిటీ వేద పండితులు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాలతో అగ్నిదేవునికి ఆహుతులు సమర్పించారు. యజ్ఞ ఫలాన్ని భక్తులందరికీ సిద్ధంపజేస్తూ, లోక కల్యాణం కోసం జరిపారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఇఒ వికె సీనా నాయక్ దంపతులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూర్ణాహుతి అనంతరం మల్లేశ్వర స్వామి వారి మెట్ల మార్గం గుండా కృష్ణా నది వరకు స్వామి వారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. దుర్గా ఘాట్ వద్ద పవిత్ర కృష్ణా నదిలో వసంతోత్సవం, ఆపై అవభృతోత్సవం (చక్ర స్నానం) భక్తిశ్రద్ధలతో జరిగాయి. చివరగా ధ్వజారోహణం (పవిత్ర ధ్వజపటాన్ని దించడం)తో ఈ మహా వేడుకలు సంపూర్ణమయ్యాయి. ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, స్థానాచార్యులు వి.శివప్రసాద్ నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది. మల్లేశ్వర స్వామి వారి నామస్మరణతో కృష్ణా తీరం మార్మోగాయి.



## పట్టుకున్న పెద్దపులిని వదిలేశారు!

### - మెడలో రేడియా కాలర్ కట్టి పాపికొండల వద్ద విడిచిపెట్టారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: తూర్పుగోదావరి జిల్లాను హడలెత్తించిన పెద్దపులినీ పాపికొండల వద్ద విడిచిపెట్టారు. తూర్పుగోదావరి జిల్లాలో పట్టుబడిన పెద్దపులిని విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జూకు తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు. ఆరోగ్యంగా ఉందని వైద్యులు తేల్చిన తర్వాత పులిని రోడ్డు మార్గంలో తీసుకెళ్లి పాపికొండలు అడవుల్లో వదిలేశారు. అంతేకాదు అటవీశాఖ అధికారులు పులికి రెడియో కాలర్ ఏర్పాటు చేశారు.. దాని ద్వారా పులి కదలికల్ని గుర్తిస్తారు. పెద్దపులి వారం పాటూ సంచరించి జనాలు టెన్షన్ పెట్టింది. తూర్పుగోదావరి జిల్లాలో తిరగడంతో జనాలు వణికిపోయారు. చివరికి పులి కూర్మాపురంలోని ఓ పాత ఇంట్లోకి చొరబడింది. వెంటనే అటవీశాఖతో పాటూ పుణె నుంచి వచ్చిన టీమ్, రెస్క్యూ టీమ్‌లు పులికి మత్తు ఇంజెక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ఆ పాత ఇంట్లో నుంచి బయటకు వచ్చి వరి పొలాల్లోకి వెళ్లింది. అక్కడి నుంచి వెళ్లి ఓ పశువుల పాకలోకి చేరింది. టీమ్‌లు ఆ పాకకు సమీపంలోనే ఉన్నారు. పులి కదలికల్ని గమనిస్తూ మత్తు ఇంజెక్షన్ గన్‌తో రెడీగా ఉన్నారు.. ఆ తర్వాత పులి గేదెలపై దాడికి ప్రయత్నించింది. ఆ తర్వాత పులి బయటకు రావడంతో గన్ సాయంతో మత్తు ఇంజెక్షన్‌ను ఇచ్చారు.. పులి కొద్ది దూరంలోనే చెరువు దగ్గర పడిపోయింది. ఆ తర్వాత పులిని బోనులో బంధించి రాజమహేంద్రవరం తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడి నుంచి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ వైద్యం అందించి తాజాగా పాపికొండలు అటవీ ప్రాంతంలో వదిలేశారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పోలీసుల దాడులు

తిరుపతి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. తిరుపతి బైరాగిపట్టెడ పద్మావతి పార్క్ సమీపంలో ఆన్‌లైన్ క్యాసినో, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.7,48,000లు నగదు, ఒక ల్యాప్‌టాప్, నాలుగు మొబైల్ ఫోన్లు, 4 పేటిఎం కోడ్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.భక్తవత్సలం పర్యవేక్షణలో తిరుపతి ఈస్ట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్ఐలు ఓ.రామస్వామి, జి.ప్రసాద్, క్రైమ్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి ముద్దాయిలను అరెస్టు చేశారు. నిందితులు ఎస్.విన్. ఎక్స్ఛేంజ్, కింగ్ ఎక్స్ఛేంజ్ వంటి యాప్‌ల ద్వారా అమాయక ప్రజలను ఆకర్షించి క్యాసినో, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ కమిషన్ రూపంలో అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గత సంవత్సరం నుండి ఈ కార్యకలాపాలు కొనసాగిస్తూ అనేక మంది ప్రజలు లక్షల రూపాయలు నష్టపోయినట్లు తెలిసింది. పరారీలో ఉన్న మరికొంతమంది నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా పోలీసులు హెచ్చరిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్ యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకర అలవాటు అని పేర్కొంటూ ప్రజలు, ముఖ్యంగా యువత, క్రింది జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా వచ్చే "ఈజీ మనీ" లేదా "గుర్తింపు లేని బెట్టింగ్ లింకులు"ను నమ్మవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల మొబైల్ వినియోగాన్ని పర్యవేక్షిస్తూ, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి.

### ఓబుళాపురం గనుల కుంభకోణం కేసు

## ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మీకి 'సుప్రీం'లో చుక్కెదురు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: ఉమ్మడి ఎపి హయాంలో వెలుగు చూసిన ఓబుళాపురం గనుల (ఓఎంసి) కుంభకోణం కేసుకు సంబంధించి సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మీకి సుప్రీం కోర్టులో చుక్కెదురయ్యింది. ఈ కేసుకు సంబంధించి ఆమె దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను సు ప్రీం కోర్టు కొట్టి వేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయమై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. ఓఎంసి కేసులో క్యాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి అక్రమాలకు దారులు తెరిచారని, ఇందులో నాటి గనుల శాఖ కార్య దర్శిగా వున్న శ్రీలక్ష్మీ కీలకంగా వ్యవహరించారని ఈ కేసును విచారిస్తున్న సిబిఐ వాదించింది. ఈ క్రమంలోనే శ్రీలక్ష్మీ పదవీలో వున్నంతకాలం ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని సిబిఐ తరపు న్యాయవాది సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చారు. సిబిఐ వాదనలతో శ్రీలక్ష్మీ తరపు న్యాయవాది విబేధించారు. ఇరుపక్షాల వాదనల తరువాత శ్రీలక్ష్మీ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టివేయడంతో పాటు హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. శ్రీలక్ష్మీ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌లో వేరే కేసుగా భావించి స్టే ఇచ్చామని, ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నా మని జస్టిస్ ఎం.ఎం సుందరేష్ ధర్మాసనం పేర్కొంది. తాము గతంలో పొరపాటున ఇచ్చిన స్టేను నిందితులు తమకు అనుకూలంగా వాడుకున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ట్రయల్ కోర్టులో విచారణ కొనసాగించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

## మెడికో అనుమానాస్పద మృతి

అనంతపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ చదివే మోహన్ అనే విద్యార్థి మంగళవారం సాయంత్రం చనిపోయాడు. మోహన్ మృతికి సంబంధించి కారణాలు తెలియరావడం లేదు. అనంతపురం మెడికల్ కళాశాలలో చదివే 8 మంది విద్యార్థులు స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ చేయడానికి గార్లదిన్నె ప్రాంతానికి వెళ్ళినట్లు తెలుస్తోంది. స్విమ్మింగ్ పూల్‌లో మోహన్‌కు తలకు బలమైన గాయం తగలడంతో స్విమ్మింగ్ పూల్ వద్దే అపస్మారక స్థితిలోకి వెళ్ళినట్లు తెలుస్తోంది. ఆ తరువాత తీవ్ర గాయాలతో ఉన్న మోహన్‌ను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోకి వచ్చే సమయానికే మోహన్ మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు చెబుతున్నట్లు సమాచారం. మోహన్ మృతితోవైద్య కళాశాలోని విద్యార్థుల్లో విషాదం నెలకొంది. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మోహన్ మృతితో మార్కాపురంలోని బంధువుల్లో విషాదం నెలకొంది. ఈ సంఘటన జరిగిన వెంటనే మార్కాపురంలో మోహన్ తల్లిదండ్రులు అనంతపురం బయలుదేరారు. ఇదిలా వుండగా మోహన్ మృతికి సంబంధించి అనుమానాలున్నాయని, రెండు రోజుల క్రితం మోహన్‌ను ఇంటికి తీసుకెళ్ళాలని కబురు పెట్టినట్లు మార్కాపురంలోని మోహన్ బందువులు చెబుతున్నట్లు తెలియవచ్చింది. ఈ ఘటనపై గార్లదిన్నె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబ్లీ ఉద్యోగి బికె మునిరాజా అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపి అసెంబ్లీ ఉద్యోగి బీకే మునిరాజాని విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. అతడికి విజయవాడ కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. మైనర్ బాలికపై అత్యాచార యత్నం, లైంగిక దాడులు, కుల దూషణలు, బెదిరింపులు, బలవంతపు వసూళ్లు, బ్లాక్ మెయిల్, ఫోర్జరీ కేసులో మునిరాజాని పోలీసులు అరెస్టు చేశారు. తల్లీ, కూతుళ్లను రెండేళ్లుగా లైంగికంగా, ఆర్థికంగా మునిరాజా వేధించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అలాగే తూనికలు, కొలతల శాఖలో వసూల్ రాజాగా మునిరాజా ప్రసిద్ధి గాంచినట్లు పోలీసులు తెలిపారు.

## రికార్డు స్థాయిలో కోటయ్య స్వామి ఆదాయం

గుంటూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి 2026 మహాశివరాత్రి సందర్భంగా రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. భక్తులు సమర్పించిన హుండీ కానుకలు, ఇతర సేవల ద్వారా సుమారు రూ1.95 కోట్ల ఆదాయం వచ్చింది. దీనితో పాటు కోటయ్య స్వామికి 3 గ్రాముల బంగారం,250 గ్రాముల వెండి భక్తులు సమర్పించారు. గత ఐదేళ్ల ఆదాయంతో పోలిస్తే ఈ సంవత్సరం అత్యధికంగా నమోదైంది. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు 2022లో రూ. 1.69 కోట్లు, 2023 లో రూ. 1.73 కోట్లు ,2024 ఏడాదిలో రూ. 1.63 కోట్లు, గత ఏడాది 2025లో రూ. 1.77 కోట్లు ఆదాయం రాగా ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ. 1.95 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ శివరాత్రి ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనిత వంగలపూడి స్వామివారికి పట్టువస్త్రలు సమర్పించారు. సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు కోటయ్యను దర్శించుకున్నట్లు సమాచారం.

## బంగారు ఉంగరం కోసమే హత్య

చిల్లకూరు (నెల్లూరు), ఫిబ్రవరి 17, ప్రభాతవార్త: చిల్లకూరు మండలం రెట్టపల్లిలో 13వ తేదీన జరిగిన రమణా రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన నిందితుడు పసుపులేటి శ్రీనివాసులును అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ శేఖర్ బాబు చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నిందితుడు శ్రీనివాసులు బంగారు ఉంగరం కోసమే రమణా రెడ్డిని హత్య చేసినట్లు తెలిపారు.

జామాయిల్ కర్రతో తలపై కొట్టి హత్యకు పాల్పడ్డాడని, హత్య అనంతరం మృతుడి చేతికి ఉన్న ఉంగరాన్ని తీసుకొని గూడూరులో ఉన్న ఓ పాన్ బ్రోకర్ దుకాణంలో 30 వేల రూపాయలకు కుదువ పెట్టినట్లు తెలిపారు. నిందితుడు ఆటో నడుపుకుంటూ పందులు మేపేవాడని, చెడు వ్యసనాలకు బానిసై బంగారం కోసం రమణారెడ్డిని అంతమొందించినట్లు వెల్లడించారు.

మృతుడు రమణారెడ్డి గేదెల మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ప్రతిరోజు లాగే గేదెలు మేపుకునేందుకు వెళ్లి మరలా ఇంటికి తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరుసటి రోజు ఉదయం గ్రామం సమీపంలోని జామాయిల్ తోటలో శవమై కనిపించాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి క్లూస్ టీం సహాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు గ్రాముల ఉంగరం కోసం వ్యక్తిని హత్య చేశాడు అన్న వార్త ఇటు స్థానికులకు, నిత్యం బంగారం వేసుకునే వారిని భయభ్రాంతులకు గురిచేసింది. ఈ సమావేశంలో ఎస్సై సురేష్ బాబు, సిబ్బంది ఉన్నారు.

# ఉత్కంఠతో ముగిసిన జనగామ మున్సిపల్ ఎన్నిక!

**- లాటరీపద్ధతిలో ఎంపిక - చైర్‌పర్సన్ సీటు కాంగ్రెస్ కైవసం - వైస్‌చైర్మన్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక**




**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** జనగామ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఉత్కంఠభరితంగా ముగిసింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్రపోటీ నెలకొనడంతో సభ్యుల ఓటింగ్ సమానంగా నమోదైంది. మొత్తం 30మంది కౌన్సిలర్లతోపాటు రెండు ఎక్స్ అఫిషియో ఓట్లతో 16ఓట్లు కాంగ్రెస్‌కు, 16ఓట్లు బీఆర్ఎస్‌కు రావడంతో పరిస్థితి తారాస్థాయికి చేరింది. సమాన ఓట్లు రావడంతో ఎన్నికల అధికారులు రాష్ట్ర మున్సిపల్ చట్టం ప్రకారం లాటరీ పద్ధతిని అనుసరించారు. ఉత్కంఠభరిత వాతావరణంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో అదృష్టం ఎవరివైపు నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. చివరికి లాటరీలో వచ్చిన ఫలితం ఆధారంగా చైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్ పార్టీకి చెందిన కడకంచి బాలమణి కైవసం చేసుకోగా, వైస్‌చైర్మన్ పదవిని బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థి భూష పర్వతాలు కైవసం చేసుకున్నారు. కాగా, లాటరీ పద్ధతిలో కూడా ఇరుపార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నిక కావడంపట్ల ఒకింత ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**- నినాదాలతో హోరెత్తిన సభామందిరం..:** ఓటింగ్ ఫలితాలు ప్రకటించిన వెంటనే ఇరువర్గాల నాయకులు గట్టిగా నినాదాలు చేస్తూ తమ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకదశలో పరస్పర వాగ్వాదాలు తీవ్రరూపం దాల్చడంతో హాల్‌లో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపుతప్పే సూచనలు కనిపించడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. భారీ బందోబస్తు ఏర్పాటుచేసి హాల్‌లోకి అనుమతులు ఉన్నవారినే అనుమతించారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూకూడా కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి క్రమంగా అదుపులోకి వచ్చింది.

**- లాటరీతో నిర్ణయం..:** సమాన ఓట్ల నేపథ్యంలో ఎన్నికల అధికారులు చట్టప్రకారం లాటరీ విధానాన్ని అమలుచేశారు. ఈసందర్భంగా ఉత్కంఠభరిత వాతావరణంలో నిర్వహించిన లాటరీలో విజేతను నిర్ణయించడంతో గెలిచిన వర్గం సంబరాలు జరుపుకోగా ఓడిన వర్గం ఒకింత అసంతృప్తి వ్యక్తంచేసింది. కాగా, ఓటింగ్ జరిపే విధానంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓటింగ్‌లో స్వతంత్ర అభ్యర్థి మంజుల మద్దతు తెలుపుతూ చేతులెత్తడంతో కాంగ్రెస్‌పార్టీకి చెందిన కౌన్సిలర్ చెంచారపు కరుణాకర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌పార్టీకి మద్దతు తెలుపుతున్న స్వతంత్ర అభ్యర్థి పాండు ఇరువురు కూడా మంజుల చేతిని ఎత్తకుండా అడ్డుకోవడంతో హాల్‌లో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. ఈనేపథ్యంలో ఇరుపార్టీలకుచెందిన కౌన్సిలర్ అభ్యర్థుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశంచేసి వారికి నచ్చచెప్పి శాంతింపచేశారు. అనంతరం నిర్వహించిన లాటరీ పద్ధతిలో కాంగ్రెస్ అభ్యర్థి చైర్‌పర్సన్‌గా ఎన్నిక కాగా, బీఆర్ఎస్ పార్టీ మద్దతు దారుడు వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**- రాజకీయాల్లో కీలకమలుపు..:** ఈ పరిణామం జనగామ పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది.

సమాన బలం ఉన్న రెండు ప్రధాన పార్టీల మధ్య జరిగిన పోరు భవిష్యత్‌లో పట్టణ రాజకీయ

సమీకరణాలపై ప్రభావం చూపనుంది. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నికల లాటరీ విధానం ప్రజల్లో కూడా ఆసక్తి, చర్చలకు దారితీసింది. మొత్తానికి జనగామ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక ఉత్కంఠ, ఉద్రిక్తత, పోలీసు

బందోబస్తుతో హైడ్రామాగా మారి పట్టణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా నిలిచింది.

# పెండింగ్ ప్రాజెక్టులపై నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి

**ఈ యేడాది బడ్జెట్‌లో ఇరిగేషన్‌శాఖకు పెరగనున్న కేటాయింపులు**

**బడ్జెట్ ప్రతిపాదనలపై నీటిపారుదల మంత్రి ఉత్తమ్ నేడు కీలక సమీక్ష**

**హైదరాబాద్, ఫిబ్రవరి17, ప్రభాతవార్త:** పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న మూడేళ్ల స్వల్పకాలంలోనే పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి తెలంగాణ రైతులకు సాగునీటి కొరత తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన వ్యయాన్ని అంచనా వేసే పనిలో నీటిపారుదల శాఖ అధికారులు బిజీగా ఉన్నారు. అదే సమయంలో ఈ ఏడాది ఈ ఏడాది (2026-27) రాష్ట్ర బడ్జెట్‌లో ఇరిగేషన్‌రంగానికి కేటాయింపులు పెరగనున్నాయి. ఇరిగేషన్‌శాఖ సైతం దాదాపు రూ. 80 వేల కోట్లకు పైగా అంచనాలను తయారుచేసినట్లు సమాచారం. ఈ ఏడాది బడ్జెట్‌లో తెలంగాణ సాగునీటిరంగానికి కేటాయింపుల ప్రతిపాదనలతోపాటు పెండింగ్ ప్రాజెక్టుల వ్యయ అంచనాలపై ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం ఈఎన్‌సీ రమేష్‌బాబుతోపాటు ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి భట్టి విక్రమార్క సైతం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌తోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ప్రధానంగా తమ్మిడిహట్టి దగ్గర నిర్మించే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు రూ. 11,000 కోట్లు, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు మూడున్నర వేల కోట్లు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులకు రూ. 6,300 కోట్లు కావాలని తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ రమేష్‌బాబు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టును టేకప్ చేస్తామని, ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా నిధులను కొరతున్నందున ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాపై నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతున్నది. గత బడ్జెట్లో నీటిపారుదల ప్రాజెక్టులకు రూ. 22 వేల కోట్లు కేటాయించిన విషయం విధితమే. గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులను, వడ్డీలను తీర్చడానికి కూడా కొంత ఉపయోగించాలనే ఉద్దేశంతో ఎక్కువ కేటాయింపుల్ని కోరుతున్నట్లు సమాచారం.

## పంచాయతీలకు తీపికబురు - రూ.250కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,ఫిబ్రవరి17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తాజాగా పంచాయతీలకు రూ. 250 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా రెండో విడతగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ. 387 కోట్లను విడుదల చేసింది. గ్రామాల్లో మౌళిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీటి సదుపాయాలు, రహదారుల మెరుగుదల వంటి పనులకు ఈ నిధులు వెచ్చించాలని సూచించింది. వాస్తవానికి 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి సుమారు రూ. 3వేల కోట్లు రావాల్సి ఉంది.

# 2028 ఎప్‌సెట్‌లో సిలబస్ మార్పు

**ఈ యేడాది ఇంటర్ సిలబస్ మారుతున్నందున.. రెండేళ్ల తరువాత ఎప్ సెట్ సిలబస్‌లో మార్పు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** తెలంగాణలో ఎప్‌సెట్‌కి సంబంధించి సిలబస్‌ను 2028లో మార్పు చేయనున్నట్టు ఎప్ సెట్ - 2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటిసంవత్సరంలో సిలబస్‌మార్చుతున్నందు 2027-28 విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిలబస్‌లో మార్పు చేయనున్నారు. 2028 ఎప్‌సెట్‌లోమారినఇంటర్‌సిలబస్‌తోఎప్‌సెట్‌నునిర్వహించనున్నారు.

# సిఎం ప్రజావాణిలో 354 దరఖాస్తులు

**ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చిన కల్వకుంట్ల కవిత**

**వీసా ఇప్పిస్తామంటూ మోసం చేసారని ప్రవాసి ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు**




సిఎం ప్రవాసి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

**బేగంపేట ఫిబ్రవరి 17,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 354దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 111దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 35దరఖాస్తులు, ఇందిరమ్మఇండ్ల కోసం 132దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణీకి 01దరఖాస్తు అందాయి.సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి.స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్,ఏసీపీ ఉమేందర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం సీఎం ప్రజావాణీకి వచ్చి పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు అందజేసారు. వీసా ఇప్పిస్తామని మోసం చేసారని బాధితుల ఫిర్యాదు. ఎట్రిక్ నెట్వర్క్ సొల్యూషన్స్ అనే కంపెనీ అమెరికాలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి ఆరు లక్షల చొప్పున 46మంది దగ్గర డబ్బులు వసూలు చేసారని,

మూడు సంవత్సరాలు అవుతున్నా ఎలాంటి వీసా ప్రాసెసింగ్ చేయకపోగా డబ్బులు వెనక్కి ఇవ్వమంటూ అడిగితే బెదిరిస్తున్నారని,ఈ విషయంలో ప్రభుత్వం తరుపున తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మంగళవారం సీఎం ప్రవాసీ ప్రజావాణీ రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందించి ఫిర్యాదు చేసారన్నారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో .. పార్టీ లైన్ దాటిన కౌన్సిలర్లు, నేతలపై బిజెపి రాష్ట్ర నాయకత్వం ఆగ్రహం

ఇప్పటికే మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లపై వేటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాన్ని దిక్కరించి ఇతర పార్టీలకు మద్దతు పలికిన కమలనాథులపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం క్రమశిక్షణా చర్యలకు సిద్ధమవుతోంది. పార్టీ లైన్ దాటిని వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో పలువురు బీజేపీ కౌన్సిలర్లు పార్టీ ఆదేశాలను పక్కనపెట్టి ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటు వేసినట్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం గుర్తఇంచింది. ఈ క్రమంలోనే సోమవారం మెట్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన 18వవార్డుకు చెందిన మీనా, సుఖేందర్‌గౌడ్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. కాంగ్రెస్‌కు ఓటు వేసిన బీజేపీ కౌన్సిలర్లను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించింది. అధికారికంగాపొత్తులు లేకపోయినా స్థానిక నేతలే సొంత నిర్ణయాలు తీసుకుని ప్రత్యర్థివర్గాలకు మద్దతు ఇచ్చినట్టు బీజేపీ నాయకత్వం గుర్తించింది. క్రాస్ ఓటింగ్‌పై పూర్తి విచారణ జరపాలని పార్టీ నేతలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశించినట్టు సమాచారం. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ నియామకంలో విప్ జారీ చేశాక కూడా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన బీజేపీ కౌన్సిలర్లపై కచ్చితంగా చర్యలు ఉంటాయని రాంచందర్‌రావు స్పష్టం చేస్తున్నారు. కాగా.. కరీంనగర్‌కార్పోరేషన్‌తోపాటు నారాయణపేట్ , భైంసా మున్సిపాలిటీలపై బీజేపీ జెండా ఎగిరింది. నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో పార్టీ అత్యధిక స్థానాలు దక్కించుకున్నా మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంపీ అరవింద్ పెద్దగా ప్రయత్నాలు చేయలేదని పార్టీ సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 49 వార్డులకు బీజేపీ 21 వార్డులు గెలుచుకున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్, స్వతంత్రుల మద్దతుతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మొత్తంగా తెలంగాణ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటలను కైవసం చేసుకుంది. భైంసాలో ఇండిపెండెంట్‌కు మద్దతు ఇచ్చింది. అయిదు మున్సిపాలిటీల్లో బీజేపీ వైస్ ఛైర్మన్ పదవులను దక్కించుకుంది. వైస్‌ఛైర్మన్ పదవులను దక్కించుకున్నచోట్ల (ఆమన్‌గల్, జిన్నారం, నర్సాపూర్, అలియాబాద్, ఎల్లంపేట) బీజేపీ.




నిరాహార దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్

# కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలుఅమలుచేయాలి

**- మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ డిమాండ్**

**తెలంగాణ కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో నిరాహారదీక్ష**

**ధర్నాచౌక్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేయాలని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిధిగా హాజరై, శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో కల్లుగీత కార్పోరేషన్‌కు ఐదు వేల కోట్లు కేటాయించి, గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 4వేల పెన్షన్ అందచేయాలని, మరణించిన కల్లుగీత కార్మికుని కుటుంబానికి పది లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీకేజికేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన కల్లుగీత కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలని, భర్త చనిపోతే, భార్యకు వెంటనే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్లుగీత సొసైటీలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వం సొసైటీకి 20లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాలలో సొసైటీలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పాలని, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటుచేయాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని కోరారు. ఈ దీక్షా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాయకులు లెల్లెల బాలకృష్ణ, గిరాజన సంఘం నాయకులు శ్రీరాం నాయక్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు, కేవీపీఎస్ నాయకులు, వివిధ జిల్లా నుంచి తరలి వచ్చిన కల్లుగీత కార్మికసంఘాల నేతలు పాల్గొన్నారు.

# 20న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరాహారదీక్షలు, నిరసన ప్రదర్శనలు

**బిసిల రిజర్వేషన్‌లు పెంచకుండా ఎన్నికలకు వెలుతున్నందుకు బిసి సంఘాల హెచ్చరిక**

**సైఫాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకపోతే ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరాహారదీక్షలు, నిరసనలు చేపడతామని 14 బిసి సంఘాలు హెచ్చరించాయి. బిసిలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారని, తమ తడఖా చూపిస్తామని, రాష్ట్రంలో మంత్రులను తిరగనీయబోమని, యుద్ధమే కొనసాగుతుందని సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా ఈ నెల 23న నోటిఫికేషన్ వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం నాడిక్కడ 14 సంఘాల బిసి నాయకులు ఒక హోటల్‌లో సమావేశమైనారు. ఈ సందర్బంగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఒక ఏడాది కాలంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని 100 సార్లుకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, న్యాయ పోరాటాలు కూడా చేస్తున్నామని, రాష్ట్ర బంద్ కూడా కొనసాగించామని, కాని ప్రభుత్వం పట్టించుకోకుండా, ఉద్యమాలను గుర్తించకుండా గుడ్డిగా, బలవంతంగా, అన్యాయం చేస్తూ ముందుకు వెళుతున్నదని ఆరోపించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, ఉద్యమం బిసి వాదమని, ప్రజల్లోకి వెళతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పలు రాష్ట్రాలు బిసిలు ఆ రాష్ట్రాల ప్రజా ప్రతినిధులను రాష్ట్రంలో తిరగనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మన రాష్ట్రానికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహిస్తుందని ఆయన ప్రశ్నించారు. కోర్టులో ఉన్న కేసు వంద శాతం బిసిల పక్షాన ఉందని రాజ్యాంగ బద్దంగా, న్యాయబద్ధంగా కేసు గెలుస్తామని ఆయన దీమా వ్యక్తం చేశారు.

# జెఇఇ మెయిన్‌లో సత్తా చాటిన ఎస్సీ గురుకుల విద్యార్థులు

**ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించిన మంత్రి అడ్లూరి, సెక్రెటరీ కృష్ణ ఆదిత్య**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** సోమవారం ప్రకటించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)మెయిన్-2026 మొదటి విడత పరీక్షల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గురుకుల సొసైటీ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య అభినందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్యా అవకాశాలను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోమని విధంగా దివీని విద్యార్థులు మరోసారి నిరూపించారని తెలిపారు..గౌలిదొడ్డి సీవోఈ కళాశాలకి చెందిన వై. నవదీప్ 98.39 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలువగా, సత్య స్వరూప్ 97.99, యశ్వంత్ 95.70, ఎం. మహేష్ 95.18, ఎస్. రాజు 94.83 పర్సంటైల్‌లు సాధించారు. గౌలిదొడ్డి బాలికల సీవోఈ నుంచి కే. శ్రీ వర్ష 94.64, వి. మంజుల 92.25 పర్సంటైల్‌లు సాధించి విశేష ప్రతిభను ప్రదర్శించారు. వనపర్తి జిల్లా మదనాపురం సీవోఈ నుంచి పి. సూర్యనారాయణ అనే విద్యార్థి 94.03 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. సీవోఈ కేంద్రాల నుంచి మొత్తం 26 మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కుపైగా, 109 మంది విద్యార్థులు 80 పర్సంటైల్‌కుపైగా, 236 మంది విద్యార్థులు 70 పర్సంటైల్‌కుపైగా ఫలితాలు సాధించారన్నారు. గత సంవత్సరం కట్‌ఆఫ్‌ను పరిగణనలోకి తీసుకుంటే సుమారుగా 337 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షకు అర్హత సాధించినట్లు వివరించారు. రాబోయే జేఈఈ మెయిన్ రెండో విడత, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు మరింత మెరుగైన ప్రతిభ కనబరిచేలా ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గురుకుల సొసైటీ విద్యార్థులు కనపరిచిన ప్రతిభపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సొసైటీ సెక్రెటరీ కృష్ణ ఆదిత్యతోపాటు గురు కులాల ప్రిన్సిపాల్స్‌ను, టీచర్లను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. గురు కులాల్లో విద్యా ప్రమాణాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యవసాయరంగంలో డిజిటల్ విప్లవం

**రైతుల కోసం భారత్ విస్తార్ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్**

**జైపూర్‌లో ప్రారంభించిన కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్**

**హైదరాబాద్,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** వ్యవసాయంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చేందుకు కేంద్రప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది. ఈ క్రమంలో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అన్నదాతల కోసం ఓ ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. భారత్ విస్తార్ పేరుతో కేంద్రం ఈ డిజిటల్ సేవలను అందుబాటులోకీ తీసుకొచ్చింది. తాజా భారత్ విస్తార్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌నుదేశంలోని రైతులందరికీ సేవలు అందించేలా రూపొందించింది. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రైతులు ఒకే కాల్‌తో ఏ సమాచారాన్ని అయినా తెలుసుకోవచ్చు. ఈ మేరకు మంగళవారం జైపూర్‌లోని దుర్గాపుర స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. వ్యవసాయంలో డిజిటల్ విప్లవం తీసుకురావడంలో ఈ భారత్ విస్తార్‌ను చారిత్రాత్మక అడుగుగా అభివర్ణించారు. పంట ఆధారిత శాస్త్రీయ సలహాలు, ధరల వివరాలు, వాతావరణ సమాచారాన్ని అన్నదాతలు తెలుసుకోవచ్చన్నారు. డిజిటల్ ఇండియా దార్శనికతను గ్రామీణ ప్రాంతాలను విస్తరించేందుకు ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడనుందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, వ్యవసాయమే కాకుండా పశు పోషణ దిశగా రైతులను ముందుకు నడిపించనున్నట్లు తెలిపారు. రైతులు తమకు అవసరమైన ప్రతీ సమాచారాన్ని ఇందులో తెలుసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఈ సేవలను ఉపయోగించుకుని లబ్ది పొందాలని పిలుపునిచ్చారు. తమ సొంత భాషలోనే ఈ ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌పై సేవలు పొందవచ్చన్నారు. దేశంలోని రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ఇప్పటికే అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. రైతులను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు వారికి తోడ్పాటు అందిస్తోంది. అనేక కార్యక్రమాలను అన్నదాతల కోసం ప్రవేశపెడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ విస్తార్ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు.

# ఉస్మానియాలో మరో అరుదైన శస్త్ర చికిత్స

**కడుపులోకి రాడ్ దిగిన వ్యక్తిని కాపాడిన వైద్యులు**



ప్రమాదవశాత్తు కడుపులోకి రాడ్ దిగిన వ్యక్తిని కాపాడిన ఉస్మానియా వైద్యులు

**గోషామహల్,ఫిబ్రవరి 17ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుండి కింద పడి కడుపులోకి రెండు రాడ్లు దిగిన వ్యక్తికి శస్త్రచికిత్సను విజయ వంతంగా పూర్తి చేసిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు.వివరాలోకి వెళ్లితే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం,అలుగోలు గ్రామానికి చెందిన అత్కరి శ్రీనివాస్(50)ఈనెల కూలీ పని నిమిత్తం జహిరాబాద్ మండలంలోని ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో పని కోసం వెళ్లాడు.కాగా ఉదయం 11గంటల సమయంలో మొదటి అంతస్థు నుండి గ్రౌండ్ ప్లోర్‌లోకి ప్రమాదవశాత్తు కింద పడటంతో గ్రౌండ్‌ని పిల్లర్లకు ఉన్న రాడ్లపై పడటంతో శ్రీనివాస్ కడుపులోకి దిగాయి. దీంతో 108 సిబ్బంది శ్రీనివాస్‌ను అదే రాత్రి 8గంటల సమయంలో ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.దీంతో క్యాజువాలిటి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి జనరల్ సర్జరీవిభాగానికి తరలించారు.జనరల్ సర్జరీ విభాగం వైద్యులు రోగినిఇ పూర్తిగా పరిశీలించి అన్ని వైద్య పరీక్షలను నిర్వహించి అనంతరం జనరల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్ బాధితుడి పరిస్థితి పరిశీలించారు.డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అదే రోజు రాత్రి 11గంటలకు ఆపరేషన్ థియేటర్‌కు తరలించి ఎమర్జెన్సీ లాపరాటమీ శస్త్ర చికిత్సను తన వైద్య బృందం,అనస్థీషియా హెచ్.డి.ఓ డాక్టర్ అభిమన్యుసింగ్, వైద్య బృందంతో కలిసి సుమారు 5గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించి కడపులో ఉన్న రెండు రాడ్లను విజయవంతంగా తొలగించారు.కాగా రోగి శ్రీనివాస్‌కు రెండు రాడ్లు కడపులోకి దూసుకుపోవడంతో పెద్ద ప్రేగు,చిన్న ప్రేగు,రక్తనాళాలు దెబ్బతిన్నాయి.వాటిని సరి చేస్తూ చికిత్స క్లిష్ట పరిస్థితిలో పూర్తి చేశారు.రెండు రాడ్లు పెద్ద రక్తనాళాన్ని తాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని హెచ్.ఓ.డి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్ తెలిపారు.ప్రైవేట్ ఆసుపత్రిలోఅయితే సుమారుగా 10లక్షల రూపాయలు అవుతాయన్నారు.

# నేడు హైదరాబాద్‌కు చేరుకోనున్న 3వ దమ్మ యాత్ర

**యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించనున్న బౌద్ధబిక్షువులు**

**యాత్రకు స్వాగతం పలకనున్న పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ థాయిలాండ్, భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు చేపట్టిన చారిత్రాత్మక 3వ దమ్మ పాదయాత్ర హైదరాబాద్‌కు చేరుకోనుంది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు నగరంలోని ఐమ్యాక్స్ పక్కన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు యాత్ర చేరుకోనుంది. ఈ పవిత్ర దమ్మ యాత్రకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాగతం పలకనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రముఖులు పాల్గొంటారు. గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, కరుణ సందేశాలను చాటిచెప్పే లక్ష్యంతో సాగుతున్న ఈ పాదయాత్ర కర్ణాటకలోని సిద్ధార్థ బుద్ధ విహార్ నుంచి ప్రారంభమైంది. సుమారు 400 కిలోమీటర్లకు పైగా కాలినడకన సాగే ఈ యాత్ర మార్చి 1న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం చేరుకోనుంది. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం, భిక్షువులు హుస్సేన్ సాగర్‌లోని చారిత్రాత్మక బుద్ధ విగ్రహాన్ని దర్శించుకుంటారు. థాయ్‌లాండ్‌కు చెందిన ప్రాసోంగ్‌శాక్ కోవిడో నేతృత్వంలో, గగన్ మాలిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 18 సాయంత్రం పాదయాత్ర మహాబోధి బుద్ధ విహార్‌కు చేరుకోనుంది, భిక్షువులు ఫిబ్రవరి 19 వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఉప్పల్, ఇబ్రహీంపట్నం, కొండమల్లేపల్లి మీదుగా ప్రయాణించి మార్చి 1న బుద్ధవనం వద్దకు యాత్ర చేరుకోనుంది. ఈ పాదయాత్ర ప్రపంచ శాంతిని ప్రోత్సహించే ఒక గొప్ప ఆధ్యాత్మికసాంస్కృతిక ఘట్టమని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు.

# ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలి

**సనత్‌నగర్ టిమ్స్ పనులను పర్యవేక్షించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్ పనులను మంత్రి మంగళవారం పరిశీలించి, అక్కడే సమీక్ష నిర్వహించారు. మెడికల్, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఆర్ అండ్ బీ శాఖల ఉనతాధికారులతో టిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అగ్నిమాపకశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా ఓపీ, ఫార్మసీ కౌంటర్లు ఉండాలని అధికారులకు సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ యంత్రాలను మంత్రి పరిశీలించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, అందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి దామోదర్ అధికారులను ఆదేశించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని మంత్రి సూచించారు. సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జేఎండీ మయాంక్ మిట్టల్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పాల్గొన్నారు.

# ఆరోగ్య క్షేమ రికార్డు యాప్




**ఆధార్ కార్డు దగ్గర నుంచి బ్యాంక్ అకౌంట్ వరకూ అన్నీ మన ఫోన్‌లో డిజిటలైజేషన్ చేసుకుని పెట్టుకుంటాం. కానీ ఆరోగ్య సమాచారాన్ని మాత్రం రిపోర్డుల రూపంలో కాగితాలకే పరిమితం చేసేస్తాం. ఈ పద్ధతినే మార్చాలనుకున్నారు. డాక్టర్ సరోజ్ గుప్తా. మెడికల్ రికార్డుల నిర్వహణకి ఎంఇఆర్ (మై డిజీ రికార్డు) అనే పేరుతో యాప్‌ను రూపొందించి,.**

రిపోర్టులను ఆన్‌లైన్ చేస్తున్నారు. మన దేశంలో వైద్యులు లేకో, ఆసుపత్రులు లేక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం లేదు. సరైన మెడికల్ రిపోర్టులు నిర్వహించే ప్రమాదాలు జరుగుతున్నాయి అంటారు సరోజ్ గుప్త. విదేశాల్లో మనదేశంలో అనేక స్టార్టప్‌ల్నీ నడిపిస్తున్నారు. విదేశాల్లో రెండు దశాబ్దాలకు పైగా వైద్యరంగంలో ఉన్న సరోజ్ మన దేశంలో ప్రతి ఒక్కరూ డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహిస్తే మంచిది. ఈ పద్ధతి ఇక్కడ కొత్తగా ఉండొచ్చు కానీ, విదేశాల్లో ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారు. అనారోగ్య వివరాలు, మందుల జాబితా అన్నీ డిజిటల్ చేస్తే వైద్య సేవలు సులభం అవుతాయి. అందుకే మన దేశంలో ఈ ఎండీఆర్(మై డిజీ రికార్డు) యాప్‌ను రూపొందించారు. దీంట్లో కుటుంబ సభ్యుల వివరాలు, ఎవరికి ఏ సమస్య ఉందో అన్నీ డిజిటల్ రికార్డుల రూపంలో భద్రంగా ఉంటాయి అని సరోజ్ అంటున్నారు. ఏంటి డిజిటల్ రికార్డు..... దేశంలో వైద్య సేవలు మిగిలిన దేశాలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. మన దేశంలో జనాభా ఎక్కువ. అభివృద్ధి చెందుతున్న దేశం పెరుగుతున్న జనాభాకు మెరుగైన వైద్య సేవలు అందించడం చాలా కష్టం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా లేవు. పల్లెల్లో ఆర్థికంగా వెనకబడి కొందరు ఆరోగ్యాన్ని నిరక్ష్యం చేస్తే... ఇంకొందరు సరైన అవగాహన లేక ఆలస్యం చేస్తున్నారు. దీనితో మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎప్పటికోగానీ బయటపడటం లేదు. కొంతమందికి ఇవి వారసత్వంగానూ రావొచ్చు.. ఎప్పటికోగానీ బయటపడటం లేదు. కొంతమందికి ఇవి వారసత్వంగానూ రావొచ్చు. అలాంటప్పుడు ఈ మెడికల్ డేటా ఉపయోగపడుతుంది. ఆసుపత్రిలో ఏ మందులు వాడుతున్నారు? అని అడిగితే ఎర్ర బిళ్ల, నీలం రంగులో ఉన్న ట్యాబ్లెట్ వేసుకుంటున్నా అని చెప్పగలరు తప్ప టాబ్లెట్ పేరు, ఎంత ఎంజీ వంటివాటిపై అందరికీ అవగాహన ఉండదు. అంతేకాదు, కొందరికి కొన్ని మందులు అలర్జీలు కలిగిస్తాయి. అలాంటి వివరాలన్నీ ఈ మై డిజీ రికార్డులో నమోదు చేసుకోవచ్చు. దీనికి ఐడీ నంబర్తోపాటు పాస్వర్డ్ ఉంటుంది. ఒకసారి మొబైల్‌లో యాప్‌లో లాగిన్ అయ్యి రోగి బయోడేటా, అనారోగ్య వివరాలు, వాడే మందుల పేర్లు. వాటి ఫొటోలతో సహా పొందుపరుచుకోవచ్చు. చదువుకోలేని వారికోసం ఫేస్ లాకర్ కూడా ఉంటుంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అభా (ఏబీహెచ్ఈ) కార్డుతో దీన్ని అనుసంధానం చేసేందుకూ అనుమతి వచ్చింది. ఇప్పటి వరకు నలభై వేలమంది ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వీళ్లంతా ఈ యాప్ మెడిసిన్ రిమైండర్లు, ఫ్యామిలీ హెల్త్ డేటా అంతా భద్రపరుచుకుని ప్రాణాలు కాపాడుకుంటున్నారు. దీన్ని ప్రజలకు ఇంకా చేరువ చేయాలి అని సరోజ్ గుప్తా. □

## నోటికి హితవు.. పోషకాలకు నెలవు !

**ఉసిరి కాయలతో ఊర గాయ, రోటిపచ్చడి, పప్పు, రసం ఏది చేసినా వారెవా అని పిస్తుంది. పుల్లపుల్లటి ఆమ్లాతో వంటలు రుచి కాదు ఆరోగ్యం కూడా. ఉసిరిలో ఎన్ని గుణాలున్నాయో చూడండి...**

1. పోరు ఎ, సి, ఇ విటమిన్లు, ఐరన్, క్యాల్షియం, సోడియం, పీచు, ప్రొటీన్లతో ఆమ్లా మంచి పోషకాహారం.
2. చుండ్రు, వెంట్రుకలు చిట్లడం, రాలడం, పిన్న వయసులోనే జుట్టు తెల్లబడటం వంటి సమస్యలకు చెక్ పెట్టినట్లవుతుంది. కుదుళ్లు గట్టిపడి కురులు ఒత్తుగా, నల్లగా ఉంటాయి.
3. చర్మం పొడిబారదు, ముడతలు పడదు. ముఖానికి మెరుపు వస్తుంది. వయసు మీదపడినట్లవాడు.
4. కొలెస్ట్రాల్ స్థాయి, రక్తపోటు అదుపులో ఉంటాయి. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది.
5. మధుమేహం నియంత్రణల్లో ఉంటుంది.
6. శరీరంలో చేరిన మలినాలు, వ్యర్థాలు తొలగుతాయి.
7. వీటిలోని ఎవిటమిన్ కంటిచూపును మెరుగుపరుస్తుంది.
8. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. సి విటమిన్ అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
9. జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. మలబద్ధకం, కడుపుబ్బరం తగ్గుతాయి.
10. ఎముకలు, దంతాలకు పటుత్వం వస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నం దున జలుబు, జ్వరం వంటి వైరల్‌ఫెక్షన్‌లు, కొన్ని రకాల క్యాన్సర్ లను నిరోధించినట్ల వుతుంది. 1. హాయిగా నిద్ర పడుతుంది. 12. ఆమ్లాతో ముఖ్వాస్, మురబ్బా, జామ్, జ్యూస్, మిఠాయి, సబ్జీ, రైతా, కడీ, క్యాండీ, ఫ్రెస్, ఖట్టా మీఠా, పులిహోర, చాక్లెట్లు, చాయ్. ఇలా ఎన్నెన్నో వెరైటీలు చేయొచ్చు. ఒంట్లో నలతగా ఉన్నప్పుడు ఏవీ రుచించవు. అలాంట ప్పుడు వేడి అన్నంలో కాస్తంత ఉసిరి కారం నెయ్యి కలిపి తింటే నోటికి హితవుగానూ ఉంటుంది. అనారోగ్య లక్షణాలు మటుమాయమవుతాయి. □



## అవాంఛిత రోమాలా?



**'చపాతీ పిండితో... అవాంఛిత రోమాలు మాయం'...** ఈమధ్య ఇన్‌ఫ్లుయెన్సర్లు అందరూ చెబుతున్న చిట్కా ఇది. ఇంట్లోనే చేసుకునే సులువైన చిట్కా కదా... అందరూ పాటిస్తున్నారు. దీంతో ఇది కాస్తా వైరలైంది. నాలుగు చెంచాల గోధుమపిండికి పావుచెంచా పసుపు, స్పూను వెన్న లేదా నెయ్యి, తగినన్ని పాలను కలిపి ముద్దలా చేసుకోవాలి. శుభ్రం చేసుకున్న ముఖానికి ఈ ముద్దతో మృదువుగా రుద్దుతూ వెళితే చాలు. గోధుమపిండి, పసుపు స్క్రాబ్ల పనిచేస్తూనే.. అవాంఛితరోమాలను తొలగిస్తాయి. పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మానికి ఆరోగ్యాన్నిస్తూనే యాక్నేని తగ్గిస్తాయి. పాలల్లోని లాక్టిక్ యాసిడ్, వెన్న/ నెయ్యి పోషణనివ్వడంతోపాటు తేమనూ అంది స్తాయి. ఎన్ని లాభాలో కదా! ఇంకేం ప్రయత్నించేద్దాం అనుకుంటున్నారేమో! కొన్నింటిని గమనించుకోవాలి. నిపుణులు అంటున్నారు. గోధుమపిండి సహజ స్క్రాబ్ల పనిచేస్తుందన్న మాట వాస్తవమే కానీ... సున్నిత చర్మతత్వం ఉన్నవారు దీన్ని తరచూ వాడితే సమస్యలనూ తెచ్చిపెడుతుంది. పసుపులోని ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ పోరాడతాయి. అయితే కొందరికి ఇది పడదు. దురద, అలర్జీలకు కారణమవుతుంది. తేమనందించే వెన్న, నెయ్యి.... యాక్నే ఉండేవారికి అవి మరింత పెరిగేలా చేస్తాయి. కాబట్టి, వీటిని గమనించుకోండి. తరవాతే ప్రయత్నించండి. □

## మాట్లాడటానికి తడబడుతున్నారా?



కెరియర్లో ఎదగా లంటే... ప్రతిభ ఒక్కటే సరిపోదు. లక్షణాలూ కావాలి. అందులో ధైర్యంగా నలుగురిలో మాట్లాడ టం కూడా ఒకటి. చాలామంది స్నేహి తులు, సహోద్యో గులతో చక్కగా మాట్లాడుతారు. కానీ, సమావేశాల్లో మాట్లాడాల్సి వచ్చినప్పుడు, ఏదైనా ప్రాజెక్టుని వివరించాల్సి వచ్చినప్పుడు మాత్రం తడబడతారు. అలాకాకుండా ఆత్మవిశ్వాసంతో మాట్లాడి అందరి మెప్పు పొందాలంటే... మీకీ చిట్కాలు ఉపయోగపడతాయి.

✦ బాగా మాట్లాడాలంటే ముందు బాగా వినడం నేర్చుకోవాలి. అప్పుడే మంచి వక్తలు కాగలుగుతారు. స్టేజీమీద నిలబడే విధానం, పలికించే హావభావాలు అన్నీ సహజంగా ఉండాలి. ఏదైనా చిన్న అంశం తీసుకుని అద్దం ముందు మాట్లాడుతూ సాధన చేయండి. అప్పుడు భయం పోతుంది. ✦ ఏ అంశంపై మాట్లాడాలనుకుంటే ముందు దానిపై పట్టు తెచ్చు కోండి. చెప్పాల్సిన విషయాలన్నీ ప్రాధాన్యత ఉండాలి రాసుకోండి అప్పుడు ఏవీ మర్చిపోకుండా ఉంటారు. అయితే, మన మాటల్ని వినేవారు మెచ్చా లంటే.. అవి సీరియస్గా ఉండకూడదు. అందుకే చక్కటి ఇవ్వండి. ప్రశ్నలు సంధించండి. ఇవన్నీ మీకో ప్రత్యేక గుర్తింపు తెస్తాయి. □

## ఫాల్గుణ మాసం

శిశిర రుతువు చలిగా లులకు వీడ్కోలు పలుకుతూ, ప్రకృతి కొత్త చిగుళ్లు తొడిగే అద్భుత కాలం ఫాల్గుణం. ఆధ్యాత్మికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా ఈ మాస ప్రాముఖ్యత అనన్యం. చంద్రమాన గణన ప్రకారం చంద్రుడు ఫల్గుణి నక్షత్రం సమీపంలో ఉండటం వల్ల ఫాల్గుణమాసం అనే పేరు వచ్చింది. సూర్యుడు కుంభరాశి వీడి మీన రాశిలోకి ప్రవేశిస్తే ఈ సమయం.. ఉత్తరాయణ పుణ్యకాలంలో ఉంటుంది. ఈ మాసం పండుగలకు పెట్టింది పేరు. ప్రతి తిథి ఒక విశేషాన్ని మోసుకొస్తుంది. తెలుగు సంవత్సరంలో ఇది చివరి నెల కావడంతో, గడిచిన ఏడాది జ్ఞాపకాలను నెమరువేసు కుంటూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలికే సంధి కాలం దీన్ని భావిస్తున్నారు. ఫాల్గుణ మాసం త్రిమూర్తుల అనుగ్రహానికి నిలయం. పురాణ కథనాలను అనుసరించి ఈ మాసంలో ఎన్నో దివ్య ఘట్టాలున్నాయి. అర్జునుడికి గల పది పేర్లలో 'ఫల్గుణుడు' ఒకటి. ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో జన్మించడం వల్ల ఆయనకు ఆ పేరు స్థిరపడింది. ధైర్య సాహసాలు కావాలనుకునే వారు ఈ నెలలో అర్జున నామ స్మరణ చేయడం ఆచారం. మాఘ బహుళ చతుర్దశి మహాశివరాత్రి రోజంతా శివ నామస్మరణ, రాత్రి జాగరణ చేయడం వల్ల మనలోని అజ్ఞానాంధకారం తొలగి జ్ఞానోదయం కలుగుతుంది. క్షీర సాగర మధనం జరిగి మహాలక్ష్మి ఉద్భవించిన పాల్గుణ పూర్ణిమను 'లక్ష్మీ జయంతి'గా వేడుక చేస్తారు. ఈ రోజు లక్ష్మీ అష్టోత్తర పఠనంతో ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. అలాగే ఫాల్గుణ పూర్ణిమ నాడు దేశమంతా సంబరాలుచేసుకునే పండుగ హోలీ. దీని వెనుక లోతైన అంతరార్థం ఉంది. శివుడి తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించిన మన్మథుడు ఈ రోజే భస్మమయ్యాడు. రంగులు చల్లుకోవడం వెనుక ప్రకృతిలోని వైవిధ్యాన్ని ఆస్వాదించాలనే ఉద్దేశ్యం కనిపిస్తుంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం ఫాల్గుణ మాసం వివాహ శుభకార్యాలకు అనుకూలమైంది. ఈ మాసంలో జరిగే వివాహాలు సుఖప్రదంగా ఉంటాయని విశ్వసిస్తారు. గృహప్రవేశాలకు, ఉపనయనాలకు కూడా ఈ మాసం శ్రేష్ఠమైంది. ఫాల్గుణం అంటే ముగింపేమీ కాదు, కొత్త పుంతలకు పునాది. మన జీవితాల్లోని కలహాలు, ద్వేషాలను హోలీ మంటల్లో నశింపచేసి, కొత్త ఆశలతో వసంత రుతువుకు సిద్ధమవ్వమని చెప్పడమే ఈ మాసం ఇచ్చే గొప్ప సందేశం. □

## కశ్మీరీ దమ్ ఆలూ



**కావలసినవి:** బేబీ పొటాటోలు అర కిలో, కశ్మీరీ కారం టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి తగినంత, సోంపు, షాజీరా పొడులు టేబుల్ స్పూన్ చొప్పున, పసుపు, డ్రై జింజర్ పౌడర్ అర స్పూన్ చొప్పున, దాల్చినచెక్క అంగుళం ముక్క, మిరియాలు 10, లవంగాలు 3, యాలకులు 2, చిక్కటి పెరుగు ముప్పావు కప్పు, నూనె 5 టేబుల్‌స్పూన్లు

**తయారీ:** బంగాళదంపల్లో కాస్త ఉప్పు వేసి ఉడికించి.. చల్లారాక పొట్టు తీసి, ఫోర్క్తో అక్కడక్కడ గాట్లు పెట్టి పక్కనుంచాలి. పెరుగును బాగా గిలకొట్టి.. అందులో కారం కలపాలి. మిరియాలు, లవంగాలు, యాలకులను మెత్తగా నూరాలి. కడాయిలో 3 టేబుల్ స్పూన్ల నూనె వేడిచేసి.. దుంపలను బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అరకిలోకు సుమారుగా 20 వరకూ వస్తాయి కాబట్టి రెండుమూడు విడతల్లో అన్నీ వేగుతాయి. ప్యాన్‌లో మిగిలిన నూనె పోసి.. దాల్చినచెక్క, సొంపు, షాజీరా ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక.. పెరుగు జోడించి కలియతిప్పు తుండాలి. అందులో పసుపు, మిరియాలు, యాలకులు, లవంగాల పొడి, బీబే పొటాటోలు, ఉప్పు, డ్రై జింజర్ పౌడర్ జతచేసి కలపాలి. మూత పెట్టి సన్న సెగ మీద సుమారు పది నిమిషాలు ఉడికించాలి. దించేసి కాస్త సోంపు పైన చల్లితే.. కశ్మీరీ దమ్ ఆలూ సిద్ధమైపోతుంది. □

---

# తెర

## 'హే బల్‌వంత్' కోసం ఎదురుచూశాను

హీరో సుహాస్



'హే బల్‌వంత్' సినిమా కోసం ఎదురుచూశాను: ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. హీరో సుహాస్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

**'హే భగవాన్' నుండి హే బల్‌వంత్ టైటిల్ మార్చడానికి కారణమేమిటి?** భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది కాబట్టి టైటిల్ మార్చాలని సెన్సారు వారు సూచించడంతో హేబల్‌వంత్‌గా మార్చాం. సినిమాలో నరేష్ క్యారెక్టర్ పేరు మార్చాం.

**ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**
చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని ఆలోచించే కుర్రాడు, నాన్న బిజినెస్‌ను టేకప్ చేయాలని అనుకుంటాడు.

**ఈ సినిమా చాలా తక్కువ వర్కింగ్ డేస్‌లో ఈ సినిమాను పూర్తి చేశారు?**
అవునండి.. నా కెరీర్‌లో సినిమా ఒకే కాగానే పూర్తిచేసి చాలా త్వరితగతిన విడుదల చేస్తున్న సినిమా ఖిహే బల్‌వంత్ఖి సినిమా కూడా ఎంతో క్వాలిటీగా ఉంటుంది.

**సినిమా ఒకే చేయడానికి కారణం?**
కథ వినగానే నచ్చింది. ముఖ్యంగా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్‌గా కనెక్ట్ అయ్యాను.

**ఈ సినిమా సుహాస్ 2.0 అనుకోవచ్చా?**
అంత పెద్ద పదాలు వాడకండి. కాకపోతే ఈ సినిమా అయితే నాకు విజయాన్ని అందిస్తుందనే నమ్మకం ఉంది.

**ప్రతి సినిమా కోసం మీ ఎఫర్ట్ పెడుతున్నారు? కానీ సరైన సక్సెస్ రాలేకపోతే ఎలా అనిపిస్తుంది?**
విజయం కోసం ఎదురు చూడటమే.. బాధగా అనిపిస్తుంది.

**హే బల్‌వంత్ పట్ల ఎలాంటి అంచనాలు ఉన్నాయి?**
ఈ సినిమాపై అందరికి నమ్మకం ఉంది. వంశీ నందిపాటి గారు మాకు ఈ సినిమాకు ఎంతో ధైర్యం ఇస్తున్నారు.

**మీకు సక్సెస్ రావాలని అందరూ కోరుకుంటున్నారు? మీరు గమనించారా?**
అందరూ మంచి యాక్టర్. మంచి సినిమా పడాలి అనే సానుభూతి అందరిలో ఉంది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను.

## 'ధర్మస్థల నియోజకవర్గం'. ఈ వారంలోనే ఫస్ట్ సింగిల్ విడుదల



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రంతో ప్రముఖ డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఓ ఐటెం సాంగ్‌తో ఎంట్రీ ఇస్తున్నారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేర్ను భాస్కర్ నిర్మిస్తోన్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రానికి సంబంధించి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా' అంటూ వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను పలకరించన ున్నారు. ఈ వారంలోనే ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేయబోతు న్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ధర్మస్థల నియోజకవర్గం చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్, సుమన్‌లతో పాటు యంగ్ హీరోస్ కూడా నటిస్తున్నారు.

## 'క్వీన్' టైటిల్ గ్లింప్స్ రిలీజ్



ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రతన్ రిషి. ఆయన గతంలో రూపొందించిన ఉత్తర, ఆర్టిస్ట్ మూవీస్ మంచి ఫిలింమేకర్‌గా పేరు తీసుకొచ్చాయి. ప్రస్తుతం తన మూడో చిత్రంగా యామినీ ఈఆర్‌తో హీరోయిన్ సెంట్రిక్ కథతో "క్వీన్" సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీలో ఎంతో స్పెషల్ గా, ఇంట్రెస్టింగ్ గా ఉండే హీరోయిన్ తండ్రి పాత్ర కోసం 90"s హీరోల్లో ఒకరిని సంప్రదిస్తున్నారు. ఈ రోజు వాలెంటైన్స్ డే సందర్భంగా "క్వీన్" సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ టైటిల్ గ్లింప్స్ చూస్తే ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని చూపించబోతున్నట్లు తెలుస్తోంది. రాళ్లమీద పేర్లతో కొన్ని ప్రేమ కథలు మిగిలిపోతాయి. తాజ్ మహల్ మీద గుర్తులుగా మరికొన్ని ప్రేమ కథలు మిగిలిపోతాయి. కానీ దేశపు మనుగడను మార్చే కొత్త శాసనంగా ఈ ప్రేమ కథ అని చెబుతూ.. భారత రాజ్యాంగం, ఆర్ టీఐ యాక్ట్, పీపుల్ సెంట్రిక్ గవర్నమెంట్ సిస్టమ్, యాక్ట్ ఆఫ్ లవ్ వంటివి చూపించడం క్వీన్ సినిమా టైటిల్ గ్లింప్స్ పై క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.

## 'నిలవే' సక్సెస్ సెలబ్రేషన్



'నిలవే' సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ హీరోయిన్ గా నటించగా, హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. POV ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. బిగ్గెస్ట్ మ్యూజికల్ లవ్ డ్రామాగా అందరి ఆదరణ అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం రామానాయుడు స్టూడియోలో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహిం చారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, గీత రచయిత చంద్రబోస్ వీడియో బైట్ ద్వారా స్పందిస్తూ బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచిందని చెబుతూ టీమ్‌ను అభినందించారు హీరో సౌమిత్ మాట్లాడుతూ ..కొత్త వాళ్లమైనా మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మూడేళ్ల కష్టమే ఈ సినిమా. రాజమౌళి గారు కూడా బాహుబల్లిని ఆడియెన్స్ ముందుకు తీసుకురావ డానికి మూడేళ్లు పట్టింది. మా నిలవే మాకు బాహుబలి లాంటిది. హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ. ప్రీతి పాత్రలో నన్ను నమ్మిన సౌమిత్‌కు థ్యాంక్స్. మొదటి చిత్రంతోనే సక్సెస్ ఇచ్చిన తెలుగు ఆడియెన్స్‌కు థ్యాంక్స్"అని చెప్పారు. దర్శకుడు సాయి కే వెన్నం మాట్లాడుతూ..మమ్మల్ని బ్లెస్ చేసిన అందరికీ థ్యాంక్స్.

## ఐటెం నంబర్‌లో అదరగొట్టిన సునీల్



మజాకో మల్లికా రిలీజ్ హైఎనర్జీ ఐటెం నంబర్‌లో అదరగొట్టిన సునీల్ క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. పుష్ప, జైలర్ వంటి చిత్రాల ద్వారా ఇప్పటికే మలయాళీ ప్రేక్షకులకు సుపరిచితుడైన తెలుగు స్టార్ సునీల్ ఈ ట్రాక్‌లో అదర గొట్టారు. ఐటెం నంబర్‌గా వచ్చిన ఈ పాటలో సునీల్ హై ఎనర్జీ డ్యాన్స్ మూమెంట్స్ హైలైట్ గా నిలిచాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ..'మజాకో మల్లికా అనే ట్రాక్‌ను వినాయక్ శశికుమార్ రాశారు. ఆనంద్ శ్రీరాజ్, భద్ర పాడారు. ఇది మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదలైంది.కాటాలన్ మే 14న భారీ పాన్ ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది. బ్లాక్‌బస్టర్ మార్కో మేకర్స్ నుంచి వస్తున్న ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు, దుషార విజయన్, కబీర్ దుహాన్ సింగ్, పుష్ప ఫేమ్ రాజ్ తరందాసు, బాలీవుడ్ నటుడు పార్థ్ తివారీ, మలయాళ నటులు జగదీష్, సిద్దిక్, వ్లాగర్‌గాయకుడు హనన్ షా, రాపర్ బేబీ జీన్, హిప్జ్నర్ వంటి భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'సెయాన్' పవర్ ఫుల్ ఫస్ట్ లుక్



వర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది. గ్రాండ్ రూరల్ కమర్షి యల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'సెయాన్' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 2026లో బిగ్గెస్ట్ ఫ్యామిలీ స్పెక్టకిల్‌గా నిలిచేలా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, వినోదాన్ని మేళవిస్తూ ఈ సినిమా రూపొందు తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శివకార్తికేయన్ డివైన్ ల్లూక్ కనిపిస్తున్నారు. ధోతి, విభూతి, రుద్రాక్షలతో సంప్రదాయానికి దగ్గరగా కని పిస్తూ, చేతిలో వంపు ఉన్న కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగిన శక్తిని సూచిస్తోంది. వెనుకన కనిపించే నెమలి రెక్కలు, చుట్టూ ఉన్న నెమళ్లు మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ పాత్రకు మిథికల్ ఆరా అందిస్తున్నాయి. ఈ చిత్రంలో శివకార్తికేయన్ పవర్‌ఫుల్, డైనమిక్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ కానుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన 'సెయాన్' 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది.

## నమీబియాతో ఢీ నేడు భారత్ మ్యాచ్

**అహ్మదాబాద్:** డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టీ20 ప్రపంచకప్‌లో ఇవాళ క్రికెట్ కూన నెదర్లాండ్స్‌తో తలపడనుది. హ్యాట్రిక్ విజయాలతో ఉన్న సూర్యకుమార్‌సేన... అహ్మదాబాద్ వేదికగా జరిగే గ్రూప్-ఎలో నెదర్లాండ్‌పై అదే జోరు కొనసాగించాలని ఉవ్విళ్ళూరుతోంది. మొదట అమెరికా, ఆతర్వాత నమీబియాపై గెలుపొందిన భారత్... మూడో మ్యాచ్‌లో దాయాది పాక్‌ను చిత్తుచేసింది. ఈమ్యాచ్‌లోనూ నెగ్గి గ్రూప్ స్టేజ్‌ను గ్రాండ్‌గా ముగించాలని చూస్తోంది.

నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌ను సూపర్8కు సన్నాహక మ్యాచ్‌గా ఉపయోగించుకోవాలని చూస్తున్న టీమిండియా తుదిజట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. రెండు డకౌట్లు చుట్టిన అభిషేక్‌ను కొనసాగించనుంది. సంజూ శామ్సన్‌ను కూడా ఆడించే ఛాన్స్ ఉంది. బౌలింగ్‌లో బుమ్రాకు రెస్ట్ ఇచ్చిఇ అర్షదీప్ సింగ్‌ను తీసుకురానుంది. అలాగే వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులో ఆడించే యోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. పాకిస్తాన్‌తో ఆడిన కుల్‌దీప్ ను తప్పించే అవకాశం ఉందని సమాచారం.

**భారత జట్టు (అంచనా):** ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, శివం దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అర్షదీప్ సింగ్.

# ప్రపంచకప్ నుంచి ఆస్ట్రేలియా నిష్క్రమణ

## ఐర్లాండ్-జింబాబ్వే మ్యాచ్ వర్షార్పణం * సూపర్-8 ఆశలు గల్లంతు

**కొలంబో:** టీ ట్వంటీ ప్రపంచకప్ నుంచి హాట్ ఫేవరెట్ ఆస్ట్రేలియా ఇంటిదారి పట్టింది. వరుణుడు దాని ఆశలపై నీళ్ల చల్లాడు. టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి అగ్రశ్రేణి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది. గ్రూప్-డిలో ఉన్న ఆస్ట్రేలియా ఇప్పటికే జింబాబ్వే, శ్రీలంక చేతుల్లో అనూహ్య పరాజయాలు పొందింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌పై మాత్రమే గెలుపుపొందింది. ఓమన్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉంది.

**ఆశలపై నీళ్లు**

పల్లెకల్‌లో ఐర్లాండ్, జింబాబ్వే మ్యాచ్‌పై ఆశలు ఆస్ట్రేలియా పెట్టుకుంది. జింబాబ్వేపై ఐర్లాండ్ గెలుపొందితే కంగారూల సూపర్8 ఆశలు సజీవంగా ఉండేవి. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచిందన్నట్లు వరుణుడు అడ్డపడ్డాడు. ఐర్లాండ్, జింబాబ్వే మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దుకావడంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ లభించింది. దీంతో జింబాబ్వే మూడు మ్యాచ్‌ల్లో అయిదు పాయింట్లతో అతిథ్య శ్రీలంకతో కలిసి సూపర్8 బెర్త్ ఖాయం చేసుకుంది. దీంతో ఓమన్‌తో మ్యాచ్ కంగారూలకు నామమాత్రంగా మారింది. ఓమన్‌పై గెలిచినా సూపర్8 చేరే అవకాశం ఉండదు. క్రికెట్‌ను రూల్ చేస్తున్న ఆస్ట్రేలియా ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో ఈవిధంగా లీగ్ స్టేజ్‌లో ఇంటిదారి పట్టడం ఇదే మొదటిసారి.



**బ్యాటింగ్‌లో ఘోరంగా ఫెయిల్**

ఏకంగా ఆరు సార్లు వన్డే ప్రపంచ ఛాంపియన్లు అయిన కంగారూలు..టీ20క్రికెట్‌లోనూ తనదైన ముద్రవేశారు. 2010లో ఫైనలిస్టు ఆస్ట్రేలియా 2021లో టీ20 ప్రపంచకప్ సాధించింది. అన్ని జట్లపై డామినేట్ చేస్తున్న ఆస్ట్రేలియా ఈసారి మాత్రం పొట్టి క్రికెట్ ప్రపంచకప్ కప్‌లో ఘోరంగా తడబడింది. మొదటి మ్యాచ్‌లో పనికూన ఐర్లాండ్‌ను ఓడించినా ఆ వెంటనే జింబాబ్వే షాకిచ్చింది. గాడిన పడుతుందని ఆశించిన అభిమానులను నిరాశపరుస్తూ తరువాతి మ్యాచ్‌లోనూ అతిథ్య శ్రీలంక చేతిలోనూ ఆస్ట్రేలియా ఓడింది. ఈ రెండుసార్లు కూడా మిచెల్ మార్ష్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో విఫలమైంది.

**స్టీవ్ స్మిత్ లేని లోటు**

జోష్ ఇంగ్లిష్, ట్రావిస్ హెడ్, కామరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినీస్ ఇలా హేమీహేమీ బ్యాట్స్‌మెన్లంతా పరుగులు సాధించడంలో విఫలమయ్యారు. ఎంతగా అంటే జింబాబ్వేపై 146 పరుగులకు, శ్రీలంకపై 181 పరుగులకు ఆసీస్ ఆలౌటైంది. మంచి జోరు మీదున్న స్టీవ్ స్మిత్‌ను పొట్టి ప్రపంచకప్‌కు ఎంపికచేయకపోవడంపై మొదటినుంచే దాడి మొదలైంది. లేటుగా మేల్కొన్న ఆసీస్ బోర్డు.. స్టీవ్ స్మిత్‌ను ఎంపికచేసినా సకాలంలో జట్టుకు అందు బాటులోకి రావపోవడం దారుణంగా దెబ్బతీసింది. మొత్తంగా ఛాంపియన్ జట్టయిన ఆస్ట్రేలియా ఈ విధంగా ఇంటిదారి పట్టడాన్ని కంగారూ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరో విధంగా ఆసీస్ ఫోబియా ఉన్న టీమిండియాకు ఇది శుభవార్తే.

## సూపర్-8 బెర్త్‌లు ఒక్కటీ మినహా ఖరారు

**ముంబై:** భారత్, శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ లీగ్ స్టేజ్ దాదాపు చివరి కొచ్చింది. సూపర్-8 బెర్త్‌లు దాదాపు ఖరారయ్యాయి. గ్రూప్-ఎ నుంచి మరోమ్యాచ్ ఉండగానే టీమిండియా సూపర్8కు చేరుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది ఋరు పాయింట్లతో ఉంది. మరోబెర్త్ పాకిస్థాన్ సొంతం కానుంది. పాక్‌పై నమీబియా గెలిస్తే మాత్రం ఆ ఛాన్స్ అమెరికాకు దక్కుతుంది. గ్రూప్-బి నుంచి అతిథ్య శ్రీలంక, జింబాబ్వే సూపర్8కు దూసుకెళ్లాయి. రెండూ జట్లకు మరో మ్యాచ్ మిగిలిఉంది. ఈగ్రూప్ నుంచి ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఓమన్ నిష్క్ర మించాయి.

గ్రూప్-సి నుంచి హాట్ ఫేవరేట్లు వెస్టిండీస్, ఇంగ్లాండ్ ఈజీగా సూపర్8కు అర్హత సాధించాయి. విండీస్ మూడు మ్యాచ్‌లు నెగ్గి ఆరు పాయింట్లతో ఉంది. మరో మ్యాచ్ మిగిలి ఉంది. ఇంగ్లాండ్ నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటి లో నెగ్గి ఆరు పాయింట్లతో ఉంది. గ్రూప్-సి నుంచి నేపాల్, ఇటలీ, స్కాట్లాండ్ ఎలిమినేట్ అయ్యాయి.

గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా ఆడిన 3 మ్యాచ్‌ల్లోనూ నెగ్గి సూపర్8కు చేరింది. రెండో జట్టుగా న్యూజిలాండ్ క్వాలిఫై అయింది. న్యూజి లాండ్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో నెగ్గింది. భారీ ఆశలతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు యూఏఈ, కెనడా టోర్నీ నుంచి నిష్క్రమించాయి.



ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్స్‌లేదంటే ఫోర్
బౌలర్ నెర్వస్ దెబ్బతీసే వ్యూహం
ఆ తర్వాత ఆకాశమే హద్దు
చూస్తున్నంతలోనే 50 లేదంటే 100
క్రీజ్‌లో ఉన్నంత వరకు బౌలర్లకు చుక్కలే
సునామీ ఇన్నింగ్‌లకు కేరాఫ్

## ఆ ఒక్కటితో మొదలుపెట్టు: సన్నీ

**అహ్మదాబాద్ :** ఈపాటికి అర్థం అయివుంటుంది అతనెవరో కాదు టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ. అతనంటే సునామీలు, మెరుపు ఇన్నింగ్స్‌లే. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉచకోత కోయడమే అతనికి తెలుసు. అలాంటి అభిషేక్ నుంచి పొట్టి ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క సునామీ ఇన్నింగ్స్‌లేదు. ఇప్పటికే టీమిండియా మూడు మ్యాచ్‌లు ఆడేసింది. అమెరికాతో, పాకిస్థాన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గోల్డెన్ డకౌట్. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు అభిషేక్ పరుగుల ఖాతా తెరవలేదు. మరోవైపు ఇషాన్ కిషన్ చెలరేగుతుంటే అభిషేక్ డీలా పడ్డాడు.

**నాటి సెహ్వాగ్‌లా...**

యువరాజ్‌సింగ్ శిష్యుడైన అభిషేక్ నాటి వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపిస్తున్నాడు. అతను ఆడిన రోజు భారత ఫ్యాన్స్‌కు పండగే. అందుకే అభిషేక్ ఎలా ఆడినా టీమ్‌సరిపెట్టుకుంటోంది. అతని సెహ్వాగ్‌లా కాకుండా తొలి బంతికే సిక్స్ కొట్టి బౌలర్ నెర్వస్ దెబ్బ తీయాలన్న ప్లాన్ పత్రిసారీ వర్కవుట్ అవడంలేదు. ఈ బలహీనతే ఒక్కోసారి ప్రత్యర్థి బౌలర్లకు వరమౌతోంది. దీన్ని వాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. అమెరికా, పాకిస్థాన్ మ్యాచ్‌లో అభిషేక్ గోల్డెన్ డక్‌కు కారణం. అంతెందుకు అభిషేక్ చివరి 7 ఇన్నింగ్స్‌ల్లో 4సార్లు డకౌటయ్యాడు. అతన్ని ప్రత్యర్థి బౌలర్లు డీకోడ్ చేశారా..అందుకే అభి విఫలమవుతున్నడా అన్న ఆందోళన ఫ్యాన్స్‌లో నెలకొంది.

**సింగిల్‌తో మొదలుపెట్టు..**

మొదటి బంతికే సిక్స్ కొట్టాలన్న ప్లాన్ ప్రతిసారీ వర్కవుట్ కాదని, సింగిల్‌తో మొదలు పెట్టాలని అభిషేక్‌కు క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సూచిస్తున్నాడు. సింగిల్ తీస్తే కాళ్లు కూడా కదులుతాయని, ఒకటి రెండు బంతులు చూసి తర్వాత నుంచి ధనాధన్ ఇనింగ్స్ ఆడాలని సజెస్ట్ చేశాడు. వచ్చిరాగానే టాప్ గేర్‌లోకి వెళ్లకుండా క్రమంగా వేగం పెంచుతూ పరుగుల వరద పారించాలని మాజీలు అభిషేక్‌కు సెలవిస్తున్నారు.

**రిథమ్‌లోనే ఉన్నాడు..**

పొట్టి ప్రపంచకప్‌కు ముందు స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన అయిదు టీ20ల సిరీస్‌లో అభిషేక్ తనదైన మార్క్ చూపాడు. మొదటి టీ20 మ్యాచ్‌లో కేవలం 35 బంతుల్లోనే 84 పరుగుల సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈసారి మూడో టీ20లో 20 బంతుల్లోనే 68 రన్స్ సాధించాడు. 14బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి తన గురువు యువరాజ్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అయిదో టీ20లోనూ దూకుడుగా ఆడి 16 బంతుల్లో 30 రన్స్ చేశాడు.

**ఒక్క ఇన్నింగ్ చాలు!**

అభిషేక్ స్ట్రయిక్ రేట్ దాదాపు 200. 40 టీ20ల్లోనే 1297 పరుగులు. 2 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు. ఏ క్రికెటర్‌కు సాధ్యంకాని స్ట్రయిక్ రేట్. అభిషేక్ గాడిలో పడేందుకు ఒక్క ఇనింగ్స్ చాలు. అదీ నమీబియాతో మ్యాచ్, అహ్మదాబాద్ వేదిక కావాలన్నది భారత ఫ్యాన్స్ ఆరాటం. అభిషేక్ గాడిన పడితే సూపర్-8లో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలే.

## కెనడా యువీ సూపర్ సెంచరీ



**చెన్నై:** టీ ట్వంటీ ప్రపంచకప్ సూపర్-8లో న్యూజి లాండ్ ప్రవేశించింది. రచిన్ రవీంద్ర, గ్లేన్ ఫిలిప్స్ హాఫ్ సెంచరీలతో ఇరగదీయడంతో క్రికెన్ కూన కెనడాపై న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 174 పరుగుల లక్ష్యాన్ని మరో అయిదు ఓవర్లు ఉండగానే అందుకుంది.

చెన్నై వేదికగా జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. ఓపెనర్ యువరాజ్ సమ్రా(65 బంతుల్లో 110రన్స్) సెంచరీతో అలరించాడు. కివీస్ బౌలర్లను దాటిగా ఎదురొంటూ బౌండరీలు, సిక్స్‌ల వర్షం కురిపించా డు. తొలి వికెట్‌కు దిల్‌ప్రీత్ బాజ్వా(36 రన్స్)తో కలిసి 116 పరుగులు, రెండో వికెట్‌కు నవ్‌నీత్‌తో కలిసి 37 రన్స్ భాగస్వామ్యం అందించాడు. యువరాజ్ ఇన్నింగ్స్‌లో 6 సిక్స్‌లు, 11 బౌండరీలు ఉన్నాయి. 174 లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ ఆరంభంలో తడబడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(6), ఫిన్ అలెన్(21) 30 రన్స్‌కే పెవిలియన్ చేరారు. ఈ దశలో రచిన్, ఫిలిప్స్ మరో వికెట్ పడకుండా కెనడా బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఇద్దరూ వేగంగా రన్స్ రాబట్టారు. ఈ క్రమంలో రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ అర్ధసెంచరీలు పూర్తి చేశారు. రచిన్ 39 బంతుల్లో 59 రన్స్, ఫిలిప్స్ 36 బంతుల్లో 76 రన్స్ చేసి న్యూజిలాండ్‌కు విజయం అందించారు. 4 మ్యాచ్‌ల్లో మూడో గెలుపుతో సౌతాఫ్రికాతో కలిసి కివీస్ గ్రూప్-డి నుండి సూపర్8కు చేరింది.

**సంక్షిప్త స్కోర్లు: కెనడా-173/4**(20 ఓవర్లలో) (యువరాజ్ 110, దిల్‌ప్రీత్ 36, మాట్ హెన్రీ 1/25, డఫీ 1/25); **న్యూజిలాండ్-176/2**(రచిన్ రవీంద్ర 59, గ్లెన్ ఫిలిప్స్ 56, ఫిన్ అలెన్ 21, డిల్లాన్ 1/42)




## రెండోరోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే..

### ప్రభుత్వ బ్యాంకులు, ఐటిరంగాల కీలక మద్దతు

**ముంబయి, ఫిబ్రవరి 17:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు కూడా లాభాలతో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలు లేనప్పటికీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 173.81 పాయింట్లు పెరిగి 83,450.96 వద్ద స్థిరపడింది. ఇక బ్రాడర్ నిఫ్టీ 42.65 పాయింట్లు లాభపడి 25,725.40 వద్ద ముగిసింది. సెషన్ మొత్తంలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగి టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. అదేవిధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ కూడా లాభాల్లో ముగిసింది. మెటల్ కౌంటర్లలో బలహీనత కారణంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ దాదాపు 1 శాతం నష్టపోయింది. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.56 శాతం చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో ఐటీసీ, బీఈఎల్, ఇన్ఫోసిస్, ఎల్‌టీ, ఏషియన్ పెయింట్స్, టైటాన్ వంటి షేర్లు 2.3 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, టాటా స్టీల్, రిలయన్స్, ఎం ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 1.5 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ 25,760-25,800 స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటుండగా, 25,550-25,600 వద్ద మద్దతు లభిస్తోంది. మరోవైపు, డాలర్ ఇండెక్స్‌లో కదలికలు లేకపోవడంతో రూపాయి 90.68 వద్ద పరిమిత శ్రేణిలో కదలాడింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడంతో సురక్షిత పెట్టుబడిగా బంగారంపై డిమాండ్ తగ్గింది. ఫలితంగా, గోల్డ్ ధర రూ. 1,500 తగ్గి రూ. 1,53,500 దిగువన ట్రేడ్ అయింది. ఐటిసి 2.34శాతం, ఇన్ఫోసిస్ 1.88శాతం, ఎల్‌అండ్‌టి 1.77శాతం నిఫ్టీలో ఎగువకు పాకాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.31శాతం, స్మాల్‌క్యాప్‌సూచీలు 0.86శాతంపెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2447 కంపెనీలు పెరిగితే 1756 కంపెనీలు క్షీణించాయి. 163 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు 62 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 68.37 డాలర్లుగా కొనసాగాయి. ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 2.59శాతంపెరిగితే ఇన్ఫోసిస్ 1.83శాతం, టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ 4.49శాతం, లూపిన్ 0.93శాతం, హైవే ఇన్‌ఫ్రా 7.39శాతండెల్హీవరీ 4.05శాతం, కెఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 5.75శాతం, హెచ్‌ఎఫ్‌సిఎల్ 4.36శాతం, కొచిన్ షిప్‌యార్డు 3.95శాతం, టివిఎస్ సప్లయిచెన్ సొల్యూషన్స్ 1.11శాతం చొప్పున పెరిగాయి.

## తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 17:** ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అమెరికా పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ అవతరించబోతున్నారు. ఈ ఏడాదిలోనే మస్క్ ఈ మైలురాయిని చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మస్క్ నికర ఆస్తుల విలువ 850 బిలియన్ డాలర్లకు చేరింది. ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్కును దాటిన తొలి వ్యక్తిగా మస్క్ సంపద ఉంది. ప్రపంచంలోని మరో ముగ్గురు అగ్రశ్రేణి కుబేరుల మొత్తం సంపద కంటే ఇది ఎక్కువ.




లారీ పేజ్ (గూగుల్) 251 బిలియన్ డాలర్లు, సెర్గీ బ్రిన్ (గూగుల్) 231 బిలియన్ డాలర్లు, మార్క్ జుకర్‌బర్గ్ (మెటా) 219 బిలియన్ డాలర్లుగా ఉంటే ఈ ముగ్గురి మొత్తం సంపద 701 బిలియన్ డాలర్లు కాగా మస్క్ ఒక్కరి సంపదే 850 బిలియన్ డాలర్లు కావడం విశేషం. మస్క్ సంపద ఇంత వేగంగా పెరగడానికి ఇటీవల జరిగిన భారీ ఒప్పందమే కీలకంగానిలిచింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎక్స్ ఏఐని స్పేస్ ఎక్స్ 1.25 ట్రిలియన్ డాలర్లతో కొనుగోలు చేసింది. విలీనమైన ఈ కొత్త సంస్థలో మస్క్‌కు 43 శాతం వాటా ఉంది. దీని విలువ సుమారు 530 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. స్పేస్ ఎక్స్/ ఎక్స్ ఏఐ వాటా 530 బిలియన్ డాలర్లు, టెస్లా వాటా(12% ), 178 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది మస్క్ ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియాలు అంచనావేస్తున్నాయి. దీనికి అదనంగా త్వరలోనే స్పేస్ ఎక్స్ సంస్థ ఐపీఓ ద్వారా సుమారు 25 బిలియన్ డాలర్లను సమీకరించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ విజయవంతమైతే, మస్క్ నికర విలువ ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది.



## నెమ్మదించిన పసిడి, వెండి ధరలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** బంగారం వెండిధరలు రెండోరోజుకూడా స్వల్పంగా తగ్గాయి. అమెరికా ఆర్థిక డేటా, ఆదేశ సెంట్రల్‌బ్యాంకు ఫండ్‌రేట్‌ల నిర్ణయాలపై ట్రేడర్లు ఎదురుచూసారు. దీనితో పెట్టుబడుల స్వర్గధామం అయిన ఈ రంగాలు కొంత హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఏప్రిల్ ఫ్యూచర్లు 0.56శాతం తగ్గి రూ.1,53,889కి చేరాయి. ఇంట్రాడే బేసిస్‌లో ఈధరలున్నాయి. అలాగే ఎంసిక్స్‌లో వెండి మార్చి ఫ్యూచర్స్ 1.18శాతం క్షీణించి కిలో రూ.2,37,064కు చేరాయి. అమెరికా ద్రవ్యోల్బణగణాంకాలు, దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలతోపాటు ముఖ్యంగా సెంట్రల్ బ్యాంకు నిర్ణయాలే కీలకం అవుతుండటంతో పసిడి, వెండిలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు వీటినే ప్రధానంగా పరిగణనలోనికి తీసుకుంటారు. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్‌గోల్డ్ ఔన్స్ ఒక్కింటికి 5వేల డాలర్ల మార్కు నుంచి దిగువకు వచ్చింది. 4992 డాలర్లుగా కొనసాగింది. వెండిధరలు కూడా 3శాతం దిగజారాయి. కామెక్స్‌లో పసిడి ఔన్స్ ఒక్కింటికి 4850 నుంచి 5100 మధ్యలోట్రేడ్ అయింది. సెంట్రల్ బ్యాంకులు కొనుగోలుచేయడం, సావరిన్‌బాండ్లవైపు ఇన్వెస్టర్లు ఆసక్తి పెంచుకోడం కరెన్సీ మార్పిడిలో హెచ్చుగతగ్గులతో ఇన్వెస్టర్లు పసిడి, వెండిపైనే దృష్టిపెట్టారు. ఇకస్పాట్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గాయి. మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది.




డా॥ కె.కె.ఆర్ గౌతమ్
ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ - ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ

దక్షిణ భారతదేశంలో ఒకే ఒక్కడు


P. Mohith
App. No 26031043291

300 / 300 MARKS
2026 IIT JEE Main (Session-1) లో
300కి 300 మార్కులు P. Mohith సాధించాడు.
ఇతను మా డా॥ కె.కె.ఆర్ పూర్వ విద్యార్థి.

ఓపెన్ కేటగిరిలో IIT అడ్వాన్స్‌లో All India Below 10 IIT ర్యాంకులు ఎవరైనా ఇన్ని సార్లు సాధించారా?
ఈ ఫలితాలతో మా పూర్వ విద్యార్థులు స్కూలు స్థాయిలో ఐఐటి ఫౌండేషన్‌లో మేమే బెస్ట్ అని నిరూపించారు.

| 2008 IIT Rank | 2011 IIT Rank | 2013 IIT Rank | 2015 IIT Rank | 2020 IIT Rank | 2021 IIT Rank | 2022 IIT Rank | 2024 IIT Rank |
|---|---|---|---|---|---|---|---|
| 7 OC | 9 OC | 7 OC | 9 OC | 2 OC | 10 OC | 6 OC | 5 OC |
| CH Dinesh | J Varun | M Viswa Virinchi | K V Vardhan Reddy | G Bhuvan Reddy | M Hrushikesh Reddy | Polisetty Karthikeya | Putti Kushal Kumar |
| HT. No 6044346 | HT. No 6078245 | HT. No 6001059 | HT. No 6037138 | HT. No 6107225 | HT. No 6045193 | HT. No 6038078 | HT. No 246150349 |

డా॥ కె.కె.ఆర్ విద్యాసంస్థల వారి
హ్యాపీ వ్యాలీ స్కూల్
ఆగిరిపల్లి (M), తాడేపల్లి(V), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.

2026 IIT JEE Main (Session-1) లో
రెండు తెలుగు రాష్ట్రాలలో 12 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ పైన సాధించిన ఏకైక స్కూల్ హ్యాపీ వ్యాలీ స్కూల్.

• 40 ఎకరాల విస్తీర్ణం. ప్రకృతి వ్యాలీలో పొల్యూషన్ లేని క్యాంపస్. • AC హాస్టల్, AC క్లాస్ రూములు, AC డైనింగ్ హాల్. • రుచి మరియు శుచితో పాటు న్యూట్రిషన్ విలువలతో కూడిన భోజన వసతి. • అన్ని రకాల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ కలవు. • ఇండోర్ స్విమ్మింగ్ పూల్, మెడిటేషన్ కొరకై ఆడిటోరియంలు. • స్కూల్ మరియు +1, +2 లకు అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీ. • IIT (అడ్వాన్స్), IIT (మెయిన్స్) టీచింగ్ కు స్పెషల్ ఫ్యాకల్టీ. • అన్ని రకాల ఆటలకు, స్పోర్ట్స్ కొరకు విశాలమైన ఆట స్థలాలు. • ఆధునిక టెక్నాలజీతో సెంట్రల్ AC సినిమా థియేటర్. • హ్యూమన్ వాల్యూస్ బోధనకు ప్రత్యేకంగా క్లాసులు.

10th మరియు +2 CBSE బోర్డ్ లో 100% ఫలితాలు.
IIT, NIT, IIIT, మెడికల్, డీమ్డ్ యూనివర్సిటీలలో, విదేశీ యూనివర్సిటీలలో అత్యధికంగా అడ్మిషన్లు సాధిస్తున్న ఏకైక స్కూల్.

అడ్మిషన్స్ జరుగుచున్నవి 4th to +1 CBSE, Co-Education

వివరాలకు : ఫోన్ : 9014 551 223 / 224 / 225,
www: kkrhappyvalley.com సంప్రదించగలరు


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.